




# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 125 మంగళవారం 23 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# ఇస్రో మరో ప్రయత్నం

## రేపు బాహుబలి రాకెట్ ప్రయోగం

## తిరుమల శ్రీవారి సేవలో ఇస్రో ఛైర్మన్ నారాయణన్



సతీశ్ థావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54గంటలకి బాహుబలి రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఇస్రో) ఛైర్మన్ డా. వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మేజర్ మిషన్లకు ముందు ఇస్రో అధికారులు తిరుమల దర్శనం చేసుకోవడం సంప్రదాయం. ఈసారి డిసెంబర్ 24న జరగబోయే ముఖ్యమైన లాంచ్‌కు శ్రీవారి ఆశీస్సులు కోరుకున్నట్టు తెలుస్తోంది.

04



# భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

## ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం

# యువతకు వేదికగా జనసేన

**అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దని నేతలకు పవన్ హెచ్చరిక**

**మంగళగిరిలో 'పదవి-బాధ్యత' సమావేశంలో జనసేన నేతలకు దిశానిర్దేశం**

**జాతీయ దృక్పథంతో ప్రాంతీయ పార్టీని స్థాపించానన్న పవన్**

**పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి జరగాలని సూచన**




**గుంటూరు :** యువతకు సరైన వేదికగా మారాలనే పార్టీ పెట్టినట్లు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. యువతను రాజకీయంగా భాగస్వామ్యం చేయాలని, వారు రాజకీయంగా ఎదుగుదలకు దోహదపడాలన్న సంకల్పంతో ఉన్నామని అన్నారు. కొత్త పంథాను నమ్ముకొని అనేకమంది యువత నక్సల్స్‌లో చేరారని, సిద్ధాంతాలను వదల్లేక వేలాది మంది చనిపోయారని అన్నారు. ఐడియాలజీ సరైంది కాకపోతే

మిగతా 2 లో



# బెల్టు షాపుల బెల్ట్ తీయండి

## ఆదాయం కాదు.. ప్రజల ఆరోగ్యం ముఖ్యం

**బెల్టు షాపుల కట్టడికి హర్యానా మోడల్‌పై అధ్యయనం**

**లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పునఃపరిశీలన**

**ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని ఆదేశం**

**ఆబ్కారీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి :** లిక్కర్ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, బెల్టు షాపుల ఊసే లేకుండా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బెల్టు షాపులపై చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఆదాయం కాదని.. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని వ్యాఖ్యానించారు. లాటరీ విధానం, రిటైలర్

మిగతా 2 లో




## సీఆర్‌డిఏ అధికారులతో చంద్రబాబు సమావేశం

జరుగుతున్న పనుల ప్రగతిపై ఆరా

2

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ కేక్ కట్ చేసి మత పెద్దలకు తినిపించిన సీఎం



2

అసోం రాజధాని గౌహతిలో

## శ్రీవారి ఆలయం

25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి

నేషనల్ హెరాల్డ్ కేసులో

## ఈడీ సవాల్

ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్

సోనియా, రాహుల్‌కు నోటీసులు.. మార్చి12కు విచారణ వాయిదా



.. వివరాలు 3లో

## వీసా ప్రక్రియ విశ్వసనీయత పెంచే యత్నం

సోషల్ మీడియా వెట్టింగ్‌పై యూఎస్ వివరణ

వీసా దుర్వినియోగం అరికట్టడానికే అని వెల్లడి




.. వివరాలు 3లో



4

# రన్‌వేపై కూర్చొని రాత పరీక్ష

**ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్**

హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమర్‌పాలి రన్‌వేను కేటాయించారు. డెస్క్‌లు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చొని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం.

# ఉగాదికి నంది నాటకోత్సవాలను నిర్వహించే ఆలోచన

**ఎపిలో నిర్మించే చిత్రాలకు రాయితీలు ఇస్తాం**

**జనవరి 8 నుంచి 10 వరకు ఆవకాయ్ ఉత్సవాలు**

**పోస్టర్ ఆవిష్కరణచేసిన మంత్రి కందుల దుర్గేశ్**



**అమరావతి :** వచ్చే ఉగాది నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులతో పాటు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వీటిని తిరిగి అత్యంత వేడుకగా నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ వేడుకలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నారని తెలిపారు. అమరావతిలో 'ఆవకాయ్' ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా దుర్గేశ్ ప్రకటించారు. జనవరి 8 నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు

మిగతా 2 లో

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# బెల్టు షాపుల బెల్ట్ తీయండి

మొదటి పేజీ తరువాయి

మార్జిన్ పెంపుపై పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు.. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె. శంకరరావు కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపించారని ప్రస్తావించారు. ఏపీలో కూడా బీసీలకు స్థానిక సంస్థల్లో వారి జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తి పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరరావు పేర్కొన్నారు.



## సీఆర్‌డిఏ అధికారులతో చంద్రబాబు సమావేశం

### జరుగుతున్న పనుల ప్రగతిపై ఆరా

**అమరావతి :** రాజధాని అమరావతిలో జరుగుతన్న అనేక పనులు, అభివృద్ధి పనులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీసారు. సోమవారం సచివాలయంలో 56వ సీఆర్డీఏ అథారిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ భవనాల టెండర్లను పిలిచే అంశంపై అథారిటీ సమావేశంలో చర్చించారు. రాజధానిలో అఖిలభారత సర్వీసు అధికారుల నివాసాలు, న్యాయమూర్తుల నివాసాల వద్ద అదనపు నిర్మాణాలపైనా సీఆర్డీఏ అథారిటీ సమీక్షించనున్నది. ఏపీసీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాలనా వ్యయం మంజూరుపై సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మాట్లాడారు. రాజధానిలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖకు చెందిన యోగా, నేచురోపతి సెంటర్ నిర్మాణంతో పాటు పలు భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. అమరావతిలో పంపింగ్ స్టేషన్లు, జోన్ 8లోని ఎల్పీఎస్ పనులకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలోనే జరీబు- మెట్ట భూముల వర్గీకరణపై రాష్ట్ర స్థాయి కమిటీని నియమించే అంశంపై నిర్ణయం తీసుకోనుంది అథారిటీ సమావేశం. ఈ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

క్రీస్తు త్యాగాలను స్మరిస్తూ ఆయన చూపిన బాటను అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. క్రైస్తవులకు సంక్షేమం, ఆర్థిక చేయూత అందించింది తమ ప్రభుత్వమేనని అన్నారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సాయంత్రం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. క్రిస్మస్ కేట్ కట్ చేసి మత పెద్దలకు తినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఏసు ప్రభువు ఈ లోకంలో జన్మించిన రోజును మనం క్రిస్మస్ గా జరుపుకుంటాం. ప్రపంచంలో జరిగే అతిపెద్ద పండుగ క్రిస్మస్. మేరీ మాత కడుపున ఏసు ప్రభువు జన్మించిన పవిత్రమైన రోజు మన అందరికీ పండుగైంది. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే శాశ్వత విలువలను అందించిన ఏసు సందేశం ఎప్పటికీ మార్గదర్శకం. క్రీస్తు బోధనల్ని ఆయన చూపిన బాటను అంతా అనుసరించాలి.

పశువుల పాకలో పుట్టి... గొర్రెల కాపరిగా పెరిగిన ప్రజా రక్షకుడు ఏసు. నమ్మిన సిద్ధాంతం కోసం బలి దానానికి సైతం వెనుకాడని క్రీస్తు గొప్పదనం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ప్రభువు తాగ్యాన్ని స్మరించుకోవాలి. శాంతి మార్గాన్ని అనుసరించాలి. ప్రేమ తత్వాన్ని పెంచాలి. ఈర్ష్య, ద్వేషాలకు దూరంగా ఉండి పాపులను సైతం క్షమించాలని బైబిల్ చెబుతోంది" అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం**

"గత ఐదేళ్లలో అసమర్థ పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నేను ఎంత లోతుకు పోతే అన్ని ఎక్కువ సమస్యలు కనపడుతున్నాయి. ఇలాంటి విధ్వంసం నా జీవితంలో చూడలేదు. మనో సంకల్పంతో లక్ష్యాన్ని సాధిస్తున్నాం. 18 నెలల్లో రాష్ట్రం నిలదొక్కుకునే పరిస్థితికి తీసుకొచ్చాం. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశాం.



క్రైస్తవుల్లో పేద కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ ఆర్థిక భరోసా కల్పించాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం, ఉచిత బస్సు పథకం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం,పాస్టర్లకు గౌరవ వేతనాలు ఇలా అన్ని విధాలా క్రిస్టియన్ మైనారిటీలను ఆదుకుంటున్నాం. ప్రత్యేకంగా క్రైస్తవ సమాజం కోసం రూ. 22 కోట్లు ఖర్చు చేసి,44,812 మంది క్రైస్తవ సోదర సోదరీమణులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాం. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నాం" అని వెల్లడించారు.

**క్రైస్తవులకు ఆర్థిక చేయూత**

"క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2014 నుంచి 2018 మధ్య 977 చర్చిలకు రూ.70 కోట్లు మంజూరు చేశాం. వీటిలో 377 చర్చిల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. గుంటూరులో క్రిస్టియన్ భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశాం. మరిన్ని నిధులు విడుదల చేసి ఈ ఏడాది క్రిస్టియన్ భవనాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవ సోదర సోదరీమణులకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. వార్షిక ఆదాయంరూ. 3 లక్షల లోపు ఉన్న వారికి రూ. 60,000,రూ. 3 లక్షలకు పైగా ఉన్న వారికి రూ. 30,000 ఇస్తున్నాం. దీని కోసం ఈ ఏడాది రూ.1.50 కోట్లు కేటాయించాం" అని చంద్రబాబు తెలిపారు.

**సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి క్రైస్తవ మిషనరీలు**

"సమాజ సేవలో క్రైస్తవ సంస్థలు ముందున్నాయి. క్రిస్టియన్ పాఠశాలలు, కాలేజీలు, ఆసుపత్రులు దశాబ్దాలుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ఇవి లక్షల మంది జీవితాల్లో మార్పు తెస్తున్నాయి. మిషనరీ పాఠశాలల్లో చదివి ఎంతోమంది ఎంతో ఉన్నత స్థానాలకు వెళ్లారు. క్రమశిక్షణ, సేవ, నాలెడ్జ్ కు మిషనరీ విద్యా సంస్థలు కేంద్రంగా ఉన్నాయి.

గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ, ఆంధ్ర లయోలా కాలేజీ వంటి క్రిస్టియన్ విద్యా సంస్థలు రాష్ట్రంలో ఎంతోమంది ఉన్నతికి సేవ చేశాయి. ఎన్టీఆర్ కూడా మిషనరీ కాలేజ్ లోనే చదువుకున్నారు. పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం" అని సీఎం చంద్రబాబు వివరించారు.

# అసోం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం

**తిరుమల :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అర్థ కారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్భుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని



అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన

ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అర్థ కరించారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్రప్రదేశ్ , అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

# యువతకు వేదికగా జనసేన




మొదటి పేజీ తరువాయి

అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన 'పదవి- బాధ్యత' సమావేశంలో పవన్ మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ కోసం బలంగా నిలబడ్డారని అందుకే మీ అందరికీ పదవులు వచ్చాయన్నారు. అందరూ కలిస్తేనే సమాజం తయారైందని తెలుసుకోవాలన్నారు. కూర్చోబెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం వృథా. ప్రతి వంద కిలోమీటర్లకు మన భాష, అలవాట్లు, ఆచారాలు మారిపోతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అనేక చర్యలు చేపడుతున్నాం. దురాశతో పర్యావరణానికి తీవ్రంగా నష్టం చేస్తున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి జరగాలని కోరుతున్నాం. మనం ఏం పని చేసినా రాజ్యాంగానికి లోబడే పని చేయాలని పవన్ పేర్కొన్నారు. జనసేన నిస్వార్థ రాజకీయాలతో కూటమిలో భాగమై, ప్రజలకు సేవ చేస్తోందన్నారు.

## జెన్ జి వ్లాగర్ స్వాతి రోజాకు పవన్ అభినందనలు

### ఆమె సాహస యాత్రలపై డిప్యూటీ సిఎం ఆరా

**అమరావతి :** దేశవ్యాప్తంగా బైక్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఆధ్యాత్మిక అంశాలను అందరికీ పంచుకుంటున్న జెన్ జి వ్లాగర్ స్వాతి రోజాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఆమె చేస్తున్న సాహస యాత్ర గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ యాత్రలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ని స్వాతి రోజా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేశవ్యాప్త పర్యటనలో భాగంగా కొద్ది వారాల క్రితం ఆమె శ్రీశైలంలో పర్యటించినప్పుడు వసతి, భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ ఆమెకు శ్రీశైలంతోపాటు, తిరుమల, శ్రీకాళహస్తి, విజయవాడ కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం పవన్ కల్యాణ్‌ని కలిసి.. ఆయన చూపిన శ్రద్ధకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలంలో గతంలో ఎదురైన అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బైక్ రైడింగ్, బైకులపై తనకున్న ఆసక్తిని పవన్ కల్యాణ్ పంచుకున్నారు.

# ఉగాదికి నంది నాటకోత్సవాలను నిర్వహించే ఆలోచన


మొదటి పేజీ తరువాయి

తెలిపారు. తెలుగు సినిమా సాహిత్యం, కవిత్వం, సర్ధ తం, నృత్య విభాగాల్లో ఈ వేడుకలు ఉండనున్నాయి. కృష్ణానదీ తీరం పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో వీటికోసం ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి కందుల ఆవిష్కరించారు. అనంతరం సినీ పరిశ్రమ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఏపీలో షూటింగ్ జరుపుకొనే చిత్రాలకు ప్రభుత్వం నుంచి మరింత సహకారం ఉంటుంది. నంది అవార్డులు.. నంది నాటకోత్సవాలు జరగాలి. నాటకాన్ని సినిమానూ సమానంగా చూడాలని సీఎం పలుమార్లు చెబుతున్నారు. చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారానికి త్వరలో సినిమాటోగ్రఫీశాఖ ఓ సమావేశం నిర్వహించనుంది. కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఏ రకమైన ఆలోచన చేయాలి? వాళ్ల ఇబ్బందులను తొలగించాలన్న దానిపై ఇందులో మాట్లాడతాం. ఈ సమావేశంలో సినీ పరిశ్రమ వర్గాలేవీ పాల్గొనడం లేదు. వారితో మరోసారి సమావేశం నిర్వహించి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వారికి వివరిస్తామని మంత్రి దుర్గేశ్ వివరించారు. బడ్జెడెట్‌ను బట్టి సినిమాకు సహకారం అందించాలని ఒక ఆలోచన ఉంది. అలాగే ఏపీలో షూటింగ్ చేసిన సినిమాలకు ఇంకొంత సపోర్ట్ చేయాలి. థియేటర్ల నుంచి ఆదాయం తగ్గుతోంది కాబట్టి, ప్రస్తుతం ఉన్న విధి విధానాల ప్రకారం అత్యధిక బ్జడెట్ సినిమాలకు సహకారం అందిస్తున్నాం. ఇక్కడ రెండు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నటీనటుల పారితోషికం కాకుండా సినిమా బ్జడెట్ ఎక్కువగా ఉంటే ఆ సినిమాకు సహకారం ఇవ్వాలని ఒక వాదన నడుస్తోంది. నటీనటులు, సాంకేతిక నిపుణులకు పారితోషికంతో కలిపితే సినిమా బ్జడెట్ అవుతుందన్న మరో వాదన కూడా ఉంది. ఈ రెండింటికీ మధ్యే మార్గంగా ఎలా చేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం. ఏపీలో ఎక్కువగా షూటింగ్ సినిమాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం అని మంత్రి వివరించారు.

# రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

### జనవరి నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం

### పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి




**గుంటూరు :** జనవరి నుంచి రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ చెప్పారు. మండలంలోని వడ్డమానులో రూ 98.7 లక్షలతో నిర్మించిన రోడ్డును మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రపంచంలో టాప్ 5 లో ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. రాజధానిలోని 29 గ్రామాల్లో జనవరి నుంచి మౌలిక వసతుల పనులు చేపడతామని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ, రైల్వే లైన్, రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటామని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్ కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ల్యాండ్ పూలింగ్ కు ఎవరైనా ముందుకు రాకుంటే అప్పుడు భూసేకరణ పై నిర్ణయం తీసుకుంటామన్నారు.

# గోవా పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం

## ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని మోడీ

**పనాజి :** గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఘన విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలన, ప్రగతిశీల రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'సుపరిపాలనకు గోవా ప్రజలు అండగా నిలిచారు. ప్రగతిశీలక రాజకీయాలకు పట్టం కట్టారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ–ఎంజీపీ (ఎన్డీయే) కుటుంబానికి బలమైన మద్దతు ఇచ్చిన నా సోదరులకు, సోదరీమణులకు కృతజ్ఞతలు' అని అన్నారు. గోవా అభివృద్ధి దిశగా ఎన్డీయే చేస్తున్న ప్రయత్నాలకు ప్రజాతీర్పు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం పునరకింతమవుతుందని పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారణమైన కార్యకర్తలను ప్రధాని అభినందించారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీపై నమ్మకం ఉంచి ఘన విజయం అందించిన ఓటర్లకు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ–ఎంజీపీ కూటమి నుంచి గెలుపొందిన అభ్యర్థులను అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై ప్రజలు నిర్ణయాత్మక తీర్పునిచ్చారని అన్నారు. 'గోవాలో బీజేపీ నెంబర్ 1. ఇంతటి ఘనవిజయంతో బీజేపీని ఆశీర్వదించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం పేర్కొన్నారు. గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల ఫలితాలు సోమవారంనాడు వెలువడ్డాయి. మొత్తం 50 సీట్లలో 30 సీట్లు బీజేపీ గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, స్వతంత్ర అభ్యర్థులు 5 సీట్లు గెలుచుకున్నారు. మహారాష్ట్ర గోమంతక్ పార్టీ (ఎండీపీ) రెండు స్థానాల్లో గెలుపొందగా, గోవా ఫార్వార్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), రివల్యూషనరీ గోన్స్ పార్టీ (ఆర్‌జీపీ) ఒక్కో సీటు చెప్పున గెలుచుకున్నాయి. బీజేపీ ఈ ఎన్నికల్లో ఎంజీపీతో కలిసి పోటీ చేయగా, జీఎఫ్‌పీ పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసింది. 2027లో గోవా అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, 2012 నుంచి రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంది.

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సవాల్

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈడీ ఛార్జిషీటుపై ట్రయిల్ కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను దర్యాప్తు సంస్థ హైకోర్టులో సోమవారంనాడు సవాలు చేసింది. దీంతో కేసులో నిందితులైన కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని, సాక్ష్యాలను సేకరించిందని, కేసులో భాగంగా పలుచోట్ల సోదాలు కూడా జరిపిందని చెప్పారు. ఈడీ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోకుండా దిగువ కోర్టు తప్పు చేసిందని ఆయన వాదించారు. ఈ కేసుపై తదుపరి విచారణను వచ్చే మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు గత మంగళవారంనాడు నిరాకరించింది. చార్జిషీటును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేటు వక్తి సుబ్రమణ్యం స్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా చార్జిషీటును పరిగణనలోకి తీసుకోలేమని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టం ప్రకారం దీన్ని విచారించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రత్యేక న్యాయమూర్తి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈడీ చార్జిషీటు ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటే అవుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలిచ్చింది. ఈడీ ఛార్జిషీట్లులో సోనియగాంధీ, రాహుల్ గాంధీ పేర్లతో పాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్, సునీల్ భండారి పేర్లు చేర్చింది.

# వీసా ప్రక్రియ విశ్వసనీయత పెంచే యత్నం

## సోషల్ మీడియా వెట్టింగ్‌పై యూఎస్ వివరణ

## వీసా దుర్వినయోగం అరికట్టడానకే అని వెల్లడి

**న్యూఢిల్లీ :** అమెరికా దౌత్య కార్యాలయం హెచ్–1, హెచ్–4 వీసా దరఖాస్తుదారుల కోసం గ్లోబల్ అలర్ట్ జారీ చేసింది. డిసెంబర్ 15 నుంచి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్' వీసా స్క్రీనింగ్‌లో భాగంగా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ప్రెజెన్స్ అంటే సోషల్ మీడియా, డిజిటల్ యాక్టివిటీ సమీక్ష పరిధిని విస్తరించినట్లు వెల్లడించింది. ఈ కొత్త విధానం అన్ని దేశాలకు చెందిన దరఖాస్తుదారులకు వర్తించనుంది. ఈ చర్య వీసా కార్యక్రమం దుర్వినియోగాన్ని అరికట్టడం కోసమేనని అమెరికా దౌత్య కార్యాలయం స్పష్టం చేసింది. ఫేక్ జాబ్ ఆఫర్లు, తప్పుడు సమాచారం, మధ్యవర్తుల పాత్ర వంటి అక్రమాలను నియంత్రించడం ద్వారా అమెరికా సంస్థలు నిజమైన, అర్హత కలిగిన తాత్కాలిక విదేశీ ఉద్యోగులను నియమించుకునేలా చేయడమే లక్ష్యమని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా ఎంబసీలు, కాన్సులేట్లు వీసా దరఖాస్తులను యథావిధిగా స్వీకరిస్తూ ప్రాసెస్ చేస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ సమీక్ష విస్తరణ కారణంగా అదనపు ప్రాసెసింగ్ సమయం పట్టే అవకాశం ఉందని దరఖాస్తుదారులకు ముందుగానే సూచించారు. వీసా వ్యవస్థలో మోసాలు, నకిలీ ఉద్యోగ ఆఫర్లు, తప్పుదారి పట్టించే సమాచారం వంటి అంశాలపై అమెరికా గత కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియా, ఆన్‌లైన్ కార్యకలాపాల సమీక్షను స్టాండర్డ్ వీసా స్క్రీనింగ్‌లో భాగంగా చేర్చింది. ఇది ఏ ఒక్క దేశం లేదా సమూహాన్ని లక్ష్యంగా చేసుకున్న చర్య కాదని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం అనంతరం అమెరికాలో ఉద్యోగం కోరుకునే పలువురు దరఖాస్తుదారులు గోప్యతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో తమ ప్రొఫైల్స్ పబ్లిక్‌గా ఉంచడం వల్ల వ్యక్తిగత సమాచారం డేటా బ్రోకర్ల చేతుల్లోకి వెళ్లి కాపీ లేదా అమ్మకం జరిగే ప్రమాదం ఉందని కొందరు అభిప్రాయపడ్డారు. కొంతమంది దరఖాస్తుదారులు ప్రభుత్వమే అధికారిక అకౌంట్ల నుంచి రిక్వెస్ట్ పంపడం, లేదా వీసా ఇంటర్వ్యూ సమయంలో మొబైల్ ద్వారా ప్రొ÷ల్ చూపించే అవకాశం ఇవ్వాలని సూచించారు. అయితే ఈ అభ్యంతరాలపై ఇప్పటివరకు అమెరికా అధికారులు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయలేదు. అమెరికా అధికారుల ప్రకారం ఆన్‌లైన్ ప్రెజెన్స్ సమీక్ష ప్రపంచవ్యాప్తంగా అన్ని వీసా దరఖాస్తుదారులకు సమానంగా వర్తిస్తుంది. వీసా పక్రియ యొక్క విశ్వసనీయతను కాపాడటమే దీని ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు.

# పవన్, ఎన్టీఆర్‌ల పిటిషన్లపై విచారణ

## ఫోటోల మార్ఫింగ్‌పై ఢిల్లీ కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టుసోమవారం విచారణ చేపట్టింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. సామాజిక మాధ్యమాల్లో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య అవసరాలకు వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం వాటిల్లుతోందని ఎన్టీఆర్, పవన్ కల్యాణ్ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేసుల్లో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. లింకులు అభిమానుల ఖాతాల నుంచి వచ్చినవని ఇన్‌స్టాగ్రామ్ నిరాకరణతో స్పష్టంగా పేర్కొనాలని హైకోర్టు సూచించింది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత లాగిన్ వివరాలను మూడు వారాల్లో అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది.

# రన్‌వేపై కూర్చొని హోంగార్డు రాత పరీక్ష

## ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్




**భువనేశ్వర్ :** ప్రభుత్వ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై నేలపై కూర్చొని పరీక్ష రాశారు. రన్‌వేపై పరీక్షా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మా రింది. హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమర్‌పాలి రన్‌వేను కేటాయించారు. డెస్క్‌లు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చొని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం. వివరాల ప్రకారం.. సబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. కేవలం 187 పోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 8,000మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంబిఎ, ఎంసిఎ, గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, డిప్లమో, ఐటిఐ శిక్షణ పొందిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన వారు కూడా ఉన్నారు. అభ్యర్థులను ఉదయం 6గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ్డారు. ఉదయం 10.30గంటలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయబడ్డాయి. 50మార్కుల ప్రశ్నాపత్రంలో 20 మార్కులకు పేరా రైటింగ్, 30 మార్కులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉన్నాయి. ముగ్గురు అదనపు సూపరింటెండెంట్లు, 24మంది ఇన్స్పెక్టర్లు, 86మంది సబ్‌ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లతో పాటు వందమందికి పైగా హోమ్ గార్డులు, ట్రాఫిక్ సిబ్బందిని అభ్యర్థులను పర్యవేక్షించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ సమస్యకు ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మండిపడ్డాయి.



# ఇస్రో మరో భారీ ప్రయత్నం


## రేపు బాహుబలి రాకెట్ ప్రయోగం



**నెల్లూరు :** సతీశ్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54గంటలకి బాహుబలి రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ఎత్తు – 43.5మీటర్లు, బరువు 6400 మీటర్లు ఉండగా.. ఈ రాకెట్ ప్రయోగ సమయం 15నిమిషాల 7 సెకన్లు ఉండనుంది. అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్ – 2 శాటిలైట్‌ని నింగిలోకి మోసుకెళ్లనుంది బాహుబలి రాకెట్. శాటిలైట్ బరువు 6100కిలోలు ఉంది. ఈ శాటిలైట్‌ని అమెరికాకి చెందిన స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించింది. గతంలో పంపిన శాటిలైట్ల కంటే పదిరెట్లు అధిక సామర్థ్యంతో బ్లూ బార్డ్ బ్లాక్ – 2 శాటిలైట్ పనిచేయనుంది. ఎల్‌వీఎం రాకెట్ సిరీస్‌లో ప్రస్తుతం ఎనిమిదో ప్రయోగం జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రయోగాలు విజయవంతమైన విషయం తెలిసిందే. చంద్రయాన్ –3 ప్రయోగానికి ఎల్‌వీఎం–3 రాకెట్‌ని ఇస్రో వినియోగించనుంది. ఈ నేపథ్యంలో షార్‌కి ఇస్రో చైరన్ డాక్టర్ నారాయణన్, అమెరికా ప్రతినిధులు చేరుకున్నారు. ఎల్‌వీఎం–2 ఎం6 ప్రయోగం పూర్తి వాణిజ్య ప్రయోగంగా తెలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకి అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో షార్‌లో జవాన్లు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

# తిరుమల శ్రీవారి సేవలో ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**తిరుమల :** ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్ డా. వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మేజర్ మిషన్లకు ముందు ఇస్రో అధికారులు తిరుమల దర్శనం చేసుకోవడం సంప్రదాయం. ఈసారి డిసెంబర్ 24న జరగబోయే ముఖ్యమైన లాంచ్‌కు శ్రీవారి ఆశీస్సులు కోరుకున్నట్టు తెలుస్తోంది. నెల 24వ తేదీ ఉదయం 8:54 గంటలకు శ్రీహరికోట నుంచి బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం–3 ఎం6 ద్వారా అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ కంపెనీకి చెందిన బ్లూబర్డ్ బ్లాక్–2 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఇది భారత్ నుంచి ఇప్పటివరకు లో ఎర్త్ ఆర్బిట్ లోకి పంపిన అత్యంత బరువైన కమర్షియల్ కమ్యూనికేషన్ ఉపగ్రహం.



# భారత్, న్యూజిలాండ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

## ఇరు దేశాల మధ్య కుదరిన ఒప్పందం

**న్యూఢిల్లీ :** భారత్, న్యూజిలాండ్‌లు ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారత్– న్యూజిలాండ్‌ల మధ్య సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం జరిగిన చర్చలు విజయవంతంగా ముగిశాయి. ఈ మేరకు భారత ప్రధాని మోడీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌లు ఫోన్ సంభాషణల అనంతరం సోమవారం ప్రకటించారు. ఇప్పటికే భారత్ పలు దేశాలతో ఎఫ్‌టిఎ (స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం)ను కుదుర్చుకుంది. గత కొన్ని సంవత్సరాల్లో భారత్ ఒమన్, యుకె, ఇఎఫ్‌టిఎ దేశాలు, యుఎఇ, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల తర్వాత తాజాగా న్యూజిలాండ్‌తో కుదర్చుకున్నది ఏడవ ఒప్పందం. '9 నెలల సమయంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు ముగిశాయి. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవాలనే ఉమ్మడి ఆశయం, రాజకీయ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ఎఫ్‌టిఎపై ఇద్దరు నాయకులు అం–కరించారు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను గణనీయంగా పెంచుతుంది. మార్కెట్‌ను మెరుగు పరుస్తుంది. పెట్టుబడి ప్రవాహాలను ప్రోత్సహిస్తుంది. వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేస్తుంది. అలాగే ఇరు దేశాల్లో వివిధ రంగాలలోని ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, రైతులు, ఎంఎస్‌ఎంఇలు, విద్యార్థులు, యువతకు కొత్త అవకాశాల్ని కల్పిస్తుంది. రాబోయే ఐదు సంవత్సరాల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతోపాటు, రాబోయే 15 సంవత్సరాలలో న్యూజిలాండ్ నుండి భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి సాధించడంపై ఇరువురు నేతలు విశ్వాసం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. న్యూజిలాండ్ నుండి భారత్‌కి అయ్యే ఎగుమతులకు 95 శాతం సుంకాలను తగ్గిస్తుందని న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ సోషల్‌మీడియా ద్వారా ప్రకటించారు. ఈ ఒప్పందం వల్ల రాబోయే రెండు దశాబ్దాల్లో న్యూజిలాండ్ నుంచి భారత్‌కి ఎగుమతులు 1.1 నుంచి 1.3 బిలియన్ డాలర్ల మేర పెరుగుతాయని అంచనా. వాణిజ్యాన్ని పెంచడం ద్వారా కివీ ఉద్యోగాలు, అధిక వేతనాలు, కష్టపడి పనిచేసే న్యూజిలాండ్‌వాసులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి అని న్యూజిలాండ్ ప్రధాని ప్రకటనలో తెలిపారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహానికి సాక్ష్యమే ఈ ఒప్పందమని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో లక్సన్ భారత్ పర్యటనకు వచ్చారు. అప్పుడు ప్రధానితో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపారు. నాలుగుసార్లు చర్చలు జరిపిన తర్వాత ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది.

# ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో దెబ్బతిన్న రెండు నౌకలు

## రష్యా అధికారుల ధ్రువీకరణ

**మాస్కో :** ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో రెండు నౌకలు దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు సోమవారం తెలిపారు. డ్రోన్ దాడిలో రెండు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, నౌకల్లో మంటలు చెలరేగాయని అన్నారు. రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని నల్లసముద్ర తీరంలో ఉన్న వోల్నా గ్రామంపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడిందని క్రాస్నోడార్ ప్రాంతానికి చెందిన కార్యనిర్వాహక ప్రధాన కార్యాలయం టెలిగ్రామ్‌యాప్‌లో పేర్కొంది. నల్లసముద్రంలోని వోల్నా టెర్మినల్ వద్ద ఉన్న నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా ఖాళీ చేయించామని తెలిపింది. డ్రోన్ దాడితో 1,500 చదరపు మీటర్ల వరకు మంటలు వ్యాపించాయని, స్థానిక కాలమానం 2.00 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ తరచుగా క్రాస్నోడార్ ప్రాంతంపై విరుచుకుపడుతోందని రష్యా ఆర్మీ తెలిపింది. శుద్ధి కర్మాగారాలు, ఇంధన గిడ్డంగులు, ఓడరేవులు మరియు వైమానిక స్థావరాలను లక్ష్యంగా డ్రోన్లతో దాడి చేస్తోందని పేర్కొంది. నల్లసముద్ర ప్రాంతం రష్యా ఇంధన ఎగుమతులు మరియు సైనిక వ్యూహాలకు ముఖ్యమైన కేంద్రంగా ఉంది. క్రిమియా సరిహద్దులో, దక్షిణ ఉక్రెయిన్‌లోని డ్రోన్ పరిధిలో ఉంది. నల్లసముద్ర ప్రాంతంలోని వోల్నా గ్రామం రష్యాకు కీలకం. ఇది 2014లో ఉక్రెయిన్ నుండి విలీనం చేయబడిన క్రిమియన్ ద్వీపకల్పానికి ప్రధాన భూభాగాన్ని అనుసంధానిస్తుండటంతో పాటు కెర్చ్ జలసంధిపై ఉన్న క్రిమియన్ వంతెనకు దగ్గరగా కూడా ఉంటుంది.






## సంపాదకీయం

# సవాళ్లు ఎవరి ప్రయోజనాల కోసం!

రాష్ట్రం విభజన జరిగి 12 ఏళ్ల కావస్తోంది. అంటే పుష్కరకాలం గడిచింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సాధించింది సున్నా. ఓ రకంగా చెప్పాలంటే విభజన వల్ల రాజకీయ పార్టీలు, కొందరు నేతలు బాగుపడ్డారు తప్ప ప్రజలు ఏ విషయంలోనూ బాగుపడలేదు. వారికి ఎలాంటి ఉపయోగం కలగలేదు. అయినా రాష్ట్రాలను బాగు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ సవాళ్లు విసురుకుంటూ..జనాలను మోసం చేస్తున్నారు. అక్కడ చంద్రబాబు, జగన్ సవాళ్లు, ఇక్కడ కెసిఆర్ బృందం, రేవంత్ బృందం పరస్పర సవాళ్లతో కాలం గడుపుతున్నారు. తామంతా మంచే చేశామని, పాలన బ్రహ్మాండంగా చేసామని ఇరు రాష్ట్రాల సిఎంలు, సిఎంలుగా పనిచేసిన వారు చెప్పుకుంటున్నారు. మధ్యలో రాండి చర్చిద్దాం..అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. ఉచిత పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించడం తప్ప వీరు చేసిన పాలనలొ గొప్పతనం ఏదీ లేదు. పైగా రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోయాయి. ఉమ్మడి ఎపికన్నా విడిపోయాక రెండు తెలుగు రాష్ట్రాలు దగపడ్డాయి. ఇకపోతే తాజాగా కెసిఆర్ మరోమారు మీడియా ముందుకు రావడం, నదీజలాలపై మాట్లాడడం, సర్కార్‌కు సవాల్ విసరడంతో ఇప్పుడు మరోమారు తెలంగాణలో సవాళ్ల పర్వ నడుస్తోంది. కృష్ణా జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్న కాంగ్రెస్ ప్రభుత్వ వాదనగా ఉంది.. కృష్ణా జలాల్లో ఏపీకి 511 టీఎంసీలు (64 శాతం),తెలంగాణకు 299 టీఎంసీలు (36 శాతం) చాలని సంతకం పెట్టింది కేసీఆరే అని, ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసిందీ ఆయనే అని రేవంత్ సర్కార్ విమర్శిస్తోంది. ఆ పాపానికి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు నీటి విషయంలో ఎక్కువ నష్టం జరిగింది. కాంగ్రెస్ హయాంలో ప్రారంభ మైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, డిండి, ఎస్‌ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం... ఇలా కృష్ణా నదిపై ఉన్న ఒక్క ప్రాజెక్టును కూడా పదేళ్లలో పూర్తిచేయలేకపోయారని విమర్శలు అందుకున్నారు. అసలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఇప్పటివరకు ఎప్పుడేం జరిగింది? ఎవరేం చేశారు? అని చర్చించేందుకు జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతామని, కేసీఆర్ రావాలి. చర్చలో పాల్గొనాలి. ఒకరోజు కృష్ణా జలాల మీద, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దాం అని కూడా కరేవంత్ అంటున్నారు. తెలంగాణకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని... అసెంబ్లీకి వస్తే ఆ ద్రోహిని నిలదీస్తామని కూడా సవాల్ విసిరారు. అంతేగాకుండా కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, సభకు వచ్చి చర్చిస్తేనే ఉన్నట్లని వ్యాఖ్యానించారు. రోడ్డు మీద కాదు... అసెంబ్లీలో నీళ్లు–నిజాలపై చర్చిద్దామని సూచించారు. ఇక కెసిఆర్ వ్యవహార శైలి మరోలా ఉంది. కృష్ణాజలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాటను, రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను కేసీఆర్ ఏకరువు పెట్టారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య అన్నారు.ప్రజలను ఏమార్చినంత సులువుగా పాలన చేయడం చేతిగాని విఫల నేత అని పరోక్షంగా రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ఇంతకాలం నోరు తెరిస్తే చావు శకునాలు, నెత్తుటి కూతలు కూసిన బేతాళ మాటలను కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై రెండేండ్ల నుంచి నేను మౌనం పాటించి చూసుకుంటూ వస్తున్నట్లు వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు నేను బయలుదేరాను. ప్రజల మధ్యలో అటు కేంద్రాన్ని ఎక్స్‌పోజ్ చేస్తం. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా ఎండగడుతం. చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతం అని ప్రకటించారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెడుతం. ప్రజా ఉద్యమాలు చేస్తం. పెద్ద బహిరంగ సభలు పెడుతం. బహిరంగ సభలకు నేను స్వయంగా అటెండ్ అవుతున్నా. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఎండగడుతం అని కేసీఆర్ ప్రకటించారు.మా హయాంలో ఈ రాష్ట్రం ఒక పద్ధతి ప్రకారం ముందుకు నడిచింది. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికం, ఐటీ రంగం, క్రైమ్ తగ్గింపు, లాండ్ అండ్ ఆర్డర్ నిర్వహణలో మంచి పద్ధతిలో ముందుకు పోయింది. ఇప్పుడు మానభంగాలు, నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదు. అప్పుడు పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఇప్పుడవన్నీ మాయమై నయని అన్నారు. యూరియా సప్లయ్ చేసే తెలివి లేదా వీళ్లకు? మా గవర్నమెంట్ ఉన్నప్పుడు రైతులు ఆటోకు డబ్బులిచ్చి పది బస్తాలు తెచ్చియ్యి బాబూ అంటే.. తెచ్చి ఎకడో పొలంకాడ పడేస్తుండె. ఇవ్వాల రైతులు రోజుల తరబడి లైన్లలో చెప్పులు పెడుతున్నరు. రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పుల లైన్లు ఉండె. బీఆర్‌ఎస్ ఉన్నన్ని రోజులు చెప్పుల లైన్లు మాయమైనయ్. కాంగ్రెస్ రాగానే మళ్లీ చెప్పుల లైన్లు స్టార్ట్ అయినయ్ అంటూ విమర్శలు సంధించారు. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందా తప్ప పాలమూరుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలేదు. తట్టెడు మట్టి తీయలేదు. వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? ఎవరి ప్రయోజనాలు కోరుతున్నట్టు అని నిలదీసారు. 10 టీఎంసీలకు మా గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ పంపింది. ఇప్పుడేమో ఆ డీపీఆర్ తిప్పి పంపించిండ్రు.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, రాష్ట్రానికి వస్తున్న నీళ్లను కూడా కాపాడే పరిస్థితి లేకపోతే.. ఇదేం దద్దమ్మ ప్రభుత్వం? కేంద్రం మొత్తం డీపీఆర్ పంపిస్తే ప్రాజెక్టుని ఆగం చేసే పరిస్థితి వస్తే.. వీళ్ల నుంచి సప్పుడులేదంటూ కెసిఆర్ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. మొత్తానికి ఇప్పుడు పరస్పర సవాళ్లు తప్ప పాలనపై ఎలాంటి సూచనలు లేవు. మధ్యలో ప్రజలు ఆగమవుతున్నారు. రాష్ట్రం అప్పులపాలు అవుతోంది. ఇదంతా నాయకత్వ లోపంగానే చూడాలి. ఇందులో గతంలో పాలించిన, ఇప్పుడు పాలిస్తున్న వారే బాధ్యులు. అప్పుల గురించి చర్చించాలి. నీటి వాటాలపైనా చర్చించాలి. అయితే మేధావుల సమక్షంలో అసెంబ్లీ బయట చర్చిస్తే మంచింది.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# ఎంజి నరేగాకు తూట్లు పొడవడం దారుణం

- జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి
- ఆర్‌ఎసెస్ భావజాలంతో పనిచేస్తున్న మోడీ
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగిన లెఫ్ట్ పార్టీలు

**విజయవాడ,డిసెంబర్ 22 :**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ మోడీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని వామపక్ష పార్టీల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో మోడీ సర్కార్ కొత్తగా తీసుకొచ్చిన వి బి `జి రాం జి 2025 (వికసిత్ భారత్`గ్యారెంటీ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లును వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిరచాయి. ఈ నేపథ్యంలో సిపిఎం, సిపిఐ, వామపక్ష పార్టీల జాతీయ నాయకత్వం దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిన క్రమంలో విజయవాడ వన్ టౌన్ లోని హెడ్ పోస్ట్ ఆఫీస్, గాంధీ విగ్రహం వద్ద ఆయా పార్టీల నగర శాఖలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశ స్వాతంత్రోద్యమ కాలపు జాతి నేతల పేర్లను నిస్సిగ్గుగా తొలగించేందుకు వెనకాడటం లేదంటూ మండిపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం వి బి జి రామ్ జి చట్టాన్ని తీసుకురావటం దుర్మార్గమని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో బిజెపి ప్రభుత్వం మహాత్ముని పై విద్వేషం వెళ్లగక్కుతుందన్నారు. మతోన్మాదం ప్రతిబింబించేలా కొత్త చట్టాలకు పేర్లు పెడుతుందన్నారు. ఇది భారత లౌకిక రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమన్నారు. ఈ చర్యను బిజెపి అప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా పేర్కొనవచ్చన్నారు. వర్షాభావంతో కరువు కోరల్లో చిక్కుకున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. నూతన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపనుందన్నారు. మన రెండు తెలుగు రాష్ట్రాలు సుమారు రూ.4 వేల కోట్ల భారాన్ని మోయాల్సి వస్తుందన్నారు. 60 రోజులపాటు ఉపాధి పనులపై నిషేధం రాష్ట్రాలపై భారం వేయడంతో ఉపాధి పని రోజులు తగ్గిపోతాయన్నారు. వ్యవసాయ సంక్షోభం పెరిగి మరిన్ని ఆత్మహత్యలకు దారితీస్తుంది అన్నారు. ఓవైపు మహాత్మా గాంధీ పేరు తొలగింపు, మరోవైపు రాష్ట్రంపై అదనపు భారం పడుతున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నోరు మెదపకపోవటం చూస్తుంటే కేంద్రం వద్ద చేతకాని పిరికిపందల్లా మారారా ? అన్నట్లు అనిపిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాకముందే నూతన చట్టాన్ని రద్దు చేయాలని వామపక్షాల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ? ఆర్‌ఎస్‌ఎస్ తో అంటకాగుతున్న మోడీ ప్రభుత్వం మరోసారి మహాత్ముని హత్యగావించిందని ఆరోపించారు. ఓట్ల కోసం మతాల మధ్య విద్వేషం సృష్టించింది చాలదన్నట్లుగా మరోసారి మతాలను ప్రతిబింబించే విధంగా చట్టాలకు పేర్లు పెడుతూ బీజేపీ ప్రజల్లో మరోసారి మత వైషమ్యాలను సృష్టించాలని చూస్తుందన్నారు. మహాత్మున్ని అవమానిస్తున్న బిజెపినీ నిలదీయడంలో కూటమి ప్రభుత్వంతో పాటు వైసిపి వైఫల్యం చెందిందన్నారు. జి రామ్ జి బిల్లు రద్దు చేసే వరకు వామపక్షాల ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం చేస్తామంటూ స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ?. మోడీ, అమిత్ షాలు ప్రజల్లో మహాత్మా గాంధీ పేరు వినపడకూడదనే కుట్ర చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. కరువు ప్రాంతాలలో ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ తప్పుబట్టారు. కొత్త చట్టం రాష్ట్రాలపై 40 శాతం భారం మోపుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కూటమినేతలు తమ స్వప్రయోజనాల కోసం కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారంటూ ధ్వజమెత్తారు. నేరేగా స్థానంలో తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు గ్రామీణ ప్రాంత రైతు కూలీల పక్షాన నిలబడి చిత్తశుద్ధితో పోరాటం చేస్తామంటూ స్పష్టం చేశారు. ఈ ధర్నాలో ఆర్‌ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరామ్, ఎస్ యు సి ఐ నాయకులు సుధీర్, న్యూ డెమోక్రసీ నేత రామకృష్ణ, లిబరేషన్ నాయకులు ఈశ్వర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు బోయి సత్య బాబు, పివి ఆంజనేయులు, కోట కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న బంగారం వెండి ధరలు

**అడ్డూ అదుపు లేకుండా పెరుగుదల**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 :**

వెండి, బంగారం ధరలు మళ్లీ జోరందుకున్నాయి. వెండి ధరల గురించి చెప్పనక్కరలేదు.. తారాస్థాయిలో రేటు పలుకుతోంది. సోమవారం కిలో వెండి ధర ఏకంగా రూ.5 వేలకు పెరిగి ఆల్ టైమ్ రికార్డు రూ.2,31,000 కు చేరింది. వెండి దూకుడు చూస్తుంటే వచ్చే ఏడాది జనవరిలోనే రూ.2,50,000 వేలు పలికినా ఆశ్చర్యపడనక్కరలేదు అంటున్నారు నిపుణులు. సోమవారం దేశంలో బంగారం ధరలు భగ్గుమన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటులో కొత తప్పదన్న అంచనాలు బలపడటంతో పసిడి, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,35,280కు చేరుకుంది. కేవలం గంటల వ్యవధిలోనే రూ.1100 మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.1000 మేర పెరిగి రూ.1,24,000కు చేరుకుంది. కొన్ని రోజులుగా అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న వెండి ధర నేడు కూడా అదే ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. ఏకంగా రూ.5 వేల మేర పెరిగి రూ.2,19,000కు చేరుకుంది. అంతర్జాతీయంగా కూడా పసిడి, వెండి ధరలు చుక్కలను అంటాయి. 24 క్యారెట్‌ల ఔన్స్ స్పాట్ గోల్డ్ ధర 4,383 డాలర్లను తాకింది. అక్టోబర్‌లో నమోదైన జీవితకాల గరిష్ఠం కంటే 1.5 శాతం మేర పెరిగింది. ఔన్స్ వెండి ధర కూడా 3.4 శాతం మేర పెరిగి 70 డాలర్లకు చేరువైంది. వెనెజువెలా చమురుపై అమెరికా ఆంక్షలతో పాటు డాలర్ బలహీనపడటం, ఫెడ్ రేట్‌లో కోతపై పెరిగిన అంచనాలతో బంగారం, వెండి ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని నిపుణులు చెబుతున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ లో వెండిపై పెరిగిన పెట్టుబడులు, ఎలక్ట్రానిక్స్ లో పెరిగిన వినియోగం, తరిగిన వెండి ఉత్పత్తుల నేపథ్యంలో వెండి ధరల రేటు వేగంగా పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదే డిసెంబర్ 13వ తేదీన వెండి కిలో ధర రూ.2,10,000ఉండటం గమనార్హం. పసిడి కూడా ఏమాత్రం తగ్గకుండా పరుగు లంకించుకుంది. సోమవారం బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే ? 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,35,280కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1000 పెరిగి రూ.1,24,000లకు చేరింది. పసిడి ధరలు కూడా మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

## పల్నాడు జిల్లాలో మరో దారుణం
# అన్నదమ్ములను నరికి చంపిన దుండగులు

**పల్నాడు,డిసెంబర్ 22 :**

పల్నాడు జిల్లాలో మరో దారుణం చోటుచేసుకుంది. అన్నదమ్ములను గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. దుర్గి మండలం అడిగొప్పలలో ఈ ఘటన జరిగింది. తమ్ముడు కొత్తా హనుమంతు, అన్న కొత్తా శ్రీరాంమూర్తిని ఆదివారం అర్ధరాత్రి వేటకొడవళ్లతో హతమార్చారు. హనుమంతును గ్రామం మధ్యలో.. శ్రీరాంమూర్తిని అమ్మవారి గుడి సమీపంలో అత్యంత కిరాతకంగా చంపేశారు. మృతులిద్దరినీ తెదేపా సానుభూతిపరులుగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ జంట హత్యలపై పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆయన మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని ఆదేశించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి హంతకుల కోసం వేట ప్రారంభించారు.

## నిందితుడిని పట్టుకోబోగా కత్తితో దాడి

**అనంతపురం,డిసెంబరు 22:** అనంతపురంలో సీఐపై కత్తితో దాడి చేసిన దేవరకొండ అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి మద్యం మత్తులో నిందితుడు అజయ్.. రాజా అనే యువకుడిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో సోమవారం ఉదయం ఆకుతోటపల్లి సమీపంలో ఇద్దరు కానిస్టేబుళ్లు ఆటో డ్రైవర్‌తో కలిసి నిందితుడు అజయ్‌ను పట్టుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అతడు పోలీసులపైనా దాడికి తెగబడ్డాడు. పోలీసులు తప్పించుకోగా ఆటో డ్రైవర్ బాబాకు గాయాలయ్యాయి. దీంతో రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా..అతడిపైనా నిందితుడు దాడి చేశాడు.

# ఉపాధిహామీ పథకంలో మార్పు సరికాదు

**వెంటనే కేంద్రానికి ఎపి లేఖ రాయాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్**

**విజయవాడ,డిసెంబర్ 22 :**

ఉపాధిహామీ చట్టం స్థానంలో జీరాంజీ పథకం తీసుకురావడం సరికాదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, పేదలు, గ్రామీణ కూలీలు ఎక్కువమంది ఉన్నారని, కొత్త పథకం వల్ల వారందరికీ ఉపాధి పోతుందని తెలిపారు. రాయలసీమలోనూ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ గతంలో ఆకలిచావులు ఉండేవని, ఉపాధిహామీ వల్ల తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం 50 రోజులు దొరుకుతున్న పనికి గ్యారంటీ లేకుండా పోతుందని పేర్కొన్నారు. నూతన నిబంధనల వల్ల రాష్ట్రంపై రూ.3000 కోట్ల భారం పడుతుందని వివరించారు. అయినా టిడిపి, వైసిపి నాయకులు నోరెత్తడం లేదని విమర్శించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయడంతోపాటు, రాష్ట్రం నుండి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు సోమవారం ఆందోళనకు దిగాయి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ చేపట్టిన చట్ట సవరణను వ్యతరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి.

# బిర్యానీ తిన్న మత్స్యకారులకు ఫుడ్ పాయిజనింగ్

**కాకినాడ,డిసెంబర్ 22 :**

కాకినాడ జిల్లా ఉప్పాడ ప్రాంతంలో విషతుల్య ఆహారం కలకలం రేపింది. తీర ప్రాంతానికి చెందిన కొందరు మృత్సకారులు అస్వస్థతకు గురవ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఉప్పాడ తీర ప్రాంతానికి చెందిన 8 మంది మత్స్యకారుల సమూహం ఇటీవల చేపల లోడిరగ్ కోసం బైరవపాలెం వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆకలేసి తాళ్లరేవు సమీపంలో గల ఓ హోటల్లో బిర్యానీ ఆరగించారు. ఫుడ్ పాయిజన్ కావడంతో.. అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో వారిని యు.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు స్థానికులు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అయితే.. అక్కడి వైద్యులు వీరిని పరీక్షించిన తర్వాత ప్రమాదమేమీ లేదని నిర్ధారించారు. దీంతో బాధితులు సహా వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం.. వారు పిఠాపురంలో చికిత్స పొందుతున్నారు.

# కల్తీ నెయ్యి వ్యవహారం.. చెవిరెడ్డిని విచారించిన సిట్

**అమరావతి,డిసెంబర్ 22 :**

టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సీబీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ సోమవారం విచారించింది. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డిని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విచారించారు. కల్తీ నెయ్యి కుంభకోణం జరిగిన సమయంలో టీటీడీ బోర్డు సభ్యుడుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుమతి ఇవ్వడంతో సోమవారం విచారణ చేపట్టారు. విచారణలో అప్పట్లో నెయ్యి కాంట్రాక్టును మార్చిన అంశం, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, సంబంధిత వ్యక్తులతో జరిగిన చర్చలపై సీబీఐ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. ఈ వ్యవహారానికి సంబంధించి కీలక సమాచారాన్ని చెవిరెడ్డి నుంచి సేకరించినట్లు సమాచారం. ఇప్పటికే మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వరుస కేసుల్లో ఆయనపై విచారణ కొనసాగుతుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కల్తీ నెయ్యి కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
మంగళవారం 23 డిసెంబర్ 2025



ప్రధానమంత్రి గ్రామీణ ఆదర్శ యోజన పథకాన్ని

# విజయవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం,(మనసులోమాట) డిసెంబర్ 22:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి గ్రామీణ ఆదర్శ యోజన పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పథకంలో భాగంగా, 500 జనాభా కలిగి, జనాభాలో కనీసం 40 శాతం షెడ్యూల్డ్ కులాల వారు నివసించే గ్రామాలను ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని మెరకముడిదాం, వంగర, తెర్లాం, ఆర్.ఆమదాలవలస మండలాల నుండి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకానికి సాంఘిక సంక్షేమ శాఖను నోడల్ శాఖగా నియమించడం జరిగిందని, వారి సమన్వయంతో ఆయా గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో త్రాగునీరు, విద్య, వైద్యం, సోషల్ సెక్యూరిటీ, గ్రామీణ రహదారులు, విద్యుత్, వ్యవసాయం, ఆర్థిక అభివృద్ధి, డిజిటలైజేషన్ జీవనోపాధి మరియు నైపుణ్యాభివృద్ధి వంటి పది కీలక రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధి జరిగేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం కింద ప్రతి గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.20 లక్షల నిధులు అందుతాయని, అదనపు అవసరాలకు సంబంధిత శాఖల ద్వారా కన్వర్జెన్స్ పద్ధతిలో నిధులు సమీకరించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఎం. అన్నపూర్ణమ్మ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ పాణి, జడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల శిక్షణ ప్రారంభం

**విజయనగరం (మనసులోమాట): డిసంబర్:21::** సోమవారం జరిగిన 478 మంది స్టయిపెండరీ క్యాడెట్ ట్రైనీ మహిళా కానిస్టేబుల్స్ (సివిల్)- 2025-26 బ్యాచ్ 9 నెలల ప్రాథమిక శిక్షణ ప్రారంభోత్సవం ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్. శంఖబ్రత బాగ్చి పోలీసు కమిషనర్ మరియు అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ విశాఖపట్నం మెట్రోపాలిటన్ ని ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు, ఎస్పీ సాదరముగా స్వాగతం పలికారు.






పి.టి.సి. సిబ్బంది ఇచ్చిన గౌరవందనం ముఖ్య అతిథి స్వీకరించి, జ్యోతి ప్రజ్వలనతో ఇండక్షన్ ట్రైనింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శిక్షణార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదగా నియామక పత్రాలు అందుకోవడం అభినందనీయమని అన్నారు. శిక్షణాకాలంలో పాటించవలసిన క్రమశిక్షణ నియమాలు మరియు సమాజం లో పెరుగుతున్న సైబర్ క్రైమ్ అరికట్టడం లో పోలీసుల పాత్ర గురించి శిక్షణార్థులకు వివరించారు. వృత్తి మరియు వ్యక్తిగత జీవితం లో రాణించడానికి కావలసిన మెళకువలను శిక్షణార్థులకు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో శిక్షణార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలు గురించి వివరించారు. ముఖ్యంగా మహిళా శిక్షణార్థుల భద్రత నిమిత్తం తీసుకున్న ప్రత్యేక జాగ్రత్తలు అయిన సి.సి.కెమెరాలు, దృష్టి నియంత్రణ సౌకర్యాలు గురించి ముఖ్యఅతిథికి వివరించారు. గడిచిన మూడు నెలల్లో ప్రజాప్రతినిధులు మరియు కలక్టర్ సహాయ సహకారాలతో వసతి, అవస్థాపన సౌకర్యాలు మెరుగుపరిచేందుకు సిబ్బంది చేసిన విశేష కృషిని అభినందించారు, శిక్షణాకాలం లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ పి.వి.అప్పారావు, డి.యస్.పిలు పి.శ్రీకాంత్, ఎమ్.మహేష్, టి.రమేష్, మెడికల్ ఆఫీసర్ ఉదయ కుమార్, ఏ.ఓ టి.భవాని, సి.ఐలు, ఆర్.ఐలు, యస్.ఐలు, ఆర్.యస్.ఐలు పి.టి.సి. సిబ్బంది పాల్గొన్నారు.



24 న అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ లో

# ఉచిత ఫిజియోథెరఫీ మెడికల్ క్యాంపు

### అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామకృష్ణ (రామ్ కీ) చే పోస్టర్స్ అవిష్కరణ

**అనకాపల్లి, డిసెంబర్ 22 (మనసు లో మాట):** అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పెటల్ ప్రాంగణంలో విశాఖపట్నం అబిలిటి పీపుల్, అనకాపల్లి రోటరీ క్లబ్ సంయుక్త అధ్వర్యంలో మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచనలతో ఈనెల 24 న సీనియర్ ఫిజియోథెరపీ డాక్టర్ ప్రియాంక (ఎన్ ఆర్ఐ) ప్రోత్సాహంతో ఉచిత ఫిజియోథెరఫీ మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుంది. డిఎం ఆండ్ హెచ్ఓ, ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ డిసిహెచ్ఎస్, సూపరింటెండెంట్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉచిత ఫిజియోథెరఫీ మెడికల్ క్యాంపు మరియు వికలాంగుల కోసం ఆరోగ్య నిపుణులు చే ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్న పోస్టర్స్ ను అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామ్ కీ అవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్ కీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉరకలు పరుగులు జీవితాలలో సరైన ఆహార నియమాలు పాటించని అనేకమంది కి అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఎముకలు, నరాలు, గుండె సంబంధిత వ్యాధులు బాధిస్తున్నాయన్నారు. కొద్దిపాటి వ్యాయామంతో పాటు ఫిజియోథెరపీ ద్వారా తేలికగా అదిగమించవచ్చన్నారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచన మేరకు స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారు నడుము, ముడుకులు, పక్షవాతం ఉన్నవారికి ఈనెల 24 న ఫిజియోథెరపీ పై అవగాహన కలిగించి అవసరమైన వారికి వైద్య సేవలు కూడా అందిస్తారన్నారు. ఈ మెడికల్ క్యాంపు ని సద్వినియోగం చేసుకోవాలని రామ్ కీ కోరారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు మంగా ఈశ్వర్, తాడి రామకృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పనుల సామాజిక తనిఖీ

### సిబ్బందికి సహకరించాలి

**ఎస్. రాయవరం, డిశంబర్ 22,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలంలో 2024-25 సంవత్సరం కుగాను జరిగిన ఉపాధిపనులసామాజిక తనిఖీ లో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కో అర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపిడిఓ పి. మీనాకుమారి మాట్లాడుతూ గత ఏడాది మండలంలో రూ22.48 కోట్లు ఉపాధి ఫనులు కు ఖర్చు చేసామని, దీనిలో వేతనంకోసం రూ18.12 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. సిమెంటురోడ్లు, తారురోడ్లు, గోకులంషెడ్లుకు గాను రూ4.50 కోట్లు ఖర్చు జరిగిందన్నారు.ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి పెనుమార్పులు తీసుకువచ్చిందని, ఏడాదిలో 125 రోజులు పనిదినాలుగా పెంచారన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అబద్ధం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం తో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, ఈ పథకం ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు,తారురోడ్లు, గోకులం షెడ్లు, స్కూల్ బిల్డింగ్ ప్రహరీ గోడలు, పంచాయతీ బిల్డింగులువంటి గ్రామానికి అవసరమైన పనులు చేసుకోవడానికి ఈ పథకం చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకంలో పని చేస్తున్న సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని, గడిచిన సంవత్సరం జరిగిన పనులు సామాజిక తనిఖీ పూర్తి పారదర్శకతతో నిర్వహించాలన్నారు. గ్రామాలలో రోడ్లకు ఇరువైపులా తుప్పలు ఉండడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయాని,ఉపాధి వేతనందారులు వారంలో ఒకరోజు శ్రమదానం చేసి ఆ తుప్పలు తొలగించాలని విజ్ఞప్తి చేసారు.అనంతరం సామాజిక తనిఖీ ఎస్ ఆర్ పి దాసు మాట్లాడుతూ ఈ సామాజిక తనిఖీ నందు ముగ్గురు డిఆర్పిలు పాల్గొంటారని, ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం 6 వరకు గ్రామాల్లో ఉండి సామాజిక తనిఖీ నిర్వహిస్తారని ఈ విధానం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లో తీసుకొచ్చిందనిఅన్నారు. ఈ విధానానికి అందరూ సహకరించి సామాజిక తనిఖీ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ కు విశేష స్పందన

### పిర్యాదుదారుల నుండి 257 వినతులు స్వీకరణ - జిల్లా కలక్టరు ఎస్ రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (మనసులోమాట) డిశంబరు, 22:** సొమవారం కలక్టరేటు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు విశేష స్పందన లభించింది. పిర్యాదుదారుల నుండి 257 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు ప్రజల నుండి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. కలక్టరు ఆడిటోరియంలో (పిజిఆర్ఎస్)లో జిల్లా కలక్టరు, జాయింటు కలక్టరు, జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు తదితరులు ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను సాదవధానంగా విని, సంబంధింత శాఖాల అధికారులకు వెను వెంటనే ఆదేశాలు జారీ చేసారు. ప్రజల యొక్క వినతులు పరిష్కారంలో అధికారులు ఆలసత్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. ఫిర్యాదుదారుల నుండి 257 వినతులు స్వీకరించి, వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టుటకు సంబంధింత శాఖల జిల్లా అధికారులను జిల్లా కలక్టరు ఆదేశాలు జారీచేసారు. రెవెన్యు శాఖకు సంబంధించి 70 వినతులు, డిఆర్డిఎ సంబంధించి 82 వినతులు, గ్రామ సచివాలయం శాఖకు సంబందించి 6 వినతులు, మున్సిపల్ శాఖ-7, విద్యా శాఖ -5, జిల్లా పంచాయితీ శాఖ-28, విద్యుత్ శాఖ-4, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ-16, హౌసింగు-4, ఇతర శాఖ నుండి 35 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్ లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్ కు అందిన కాల్స్ కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. అర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానిని తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసారు.

ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింటు కలక్టరు సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి , సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలజి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి మణిక్యంయుడు, వ్యవసాయ శాఖ జెడి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అన్నపూర్ణమ్మ, బి.సి.సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, పంచాయితీరాజ్ ఎస్.ఇ. ఆర్.డబ్ల్యుఎస్ మరియు ఆర్ అండ్ బి ఎస్.ఇ.లు మార్క్ఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, విజయనగరం, ఐ.సిడి.ఎస్. పి.డి. విమలరాణి, డిఆర్ డి ఎ పిడి శ్రీనివాస్ పాణి, మైక్రోఇరిగేషన్ పి.డి. లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మొదటి స్థానం

### కైవసం చేసుకున్న విశాఖ జిల్లా - ట్రోఫీ అందజేసి అభినందించిన బాజపా రాష్ట్ర నేత డా.కేఎన్ఆర్



**గాజువాక (మనసులోమాట)డిసెంబర్ 22..** విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు క్రీడల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర బీజేపీ మీడియా పెనలిస్ట్, గాజువాక బీజేపీ ఇంచార్జి కర్ణం రెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 70వ వార్డు ద్రోణంరాజు కళ్యాణ మండపంలో వెడాకాయ్ దు కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బిజేపి గాజువాక ఇంచార్జ్ మరియు రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు విచ్చేసి గెలిపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు పదకొండు జిల్లాల నుండి సుమారు మూడు వందల యాభై మంది క్రీడాకారులు పాల్గొన్నారని అందులో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానం, కృష్ణ జిల్లా రెండవ స్థానం, విజయనగరం మూడవ స్థానం లో గెలిపోందయాన్నారు. ఆత్మరక్షణ కోసం ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేస్తున్నాయని అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం కోటా కల్పిస్తున్నారు అన్నారు. యువత చెడు వ్యసనాలు అలవాటు కాకుండా ఏదో ఒక క్రీడలో రాణించి వారి పుట్టిన ప్రాంతానికి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో వాడాకాయ్ దు కరాటే అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు సతీష్ కుమార్,రాష్ట్ర కార్యదర్శి రాము, నాయకులు బాటా శ్రీను, దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, కార్తిక్,కోచ్లు గోవర్ధన్, అప్పారావు, శరత్, శ్రీనివాసరావు, గంటా నూకరాజు, సుధాకర్, అగస్త్య,కిషోర్, కరణం. సన్నీ, పార్వతీ,రాజేశ్వరి, రిఫరీలు, జడ్జిలు క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గణితాన్ని ఇష్టంగా నేర్చుకోవాలి

### మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్



**నక్కపల్లి, మనసులో మాట డిశంబరు 22:** ప్రతీ విద్యార్థి గణితాన్ని ఇష్టపడి నేర్చుకోవాలని,అప్పుడే సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే వీలుంటుందని స్థానిక మండల విద్యాశాఖాధికారి కే.నరేష్ అన్నారు .సోమవారం మండలంలో 13 ఉన్నతపాఠశాలలతో పాటు గురుకులం,కే.జీ.బీ.వి పాఠశాలలు,ప్రాథమిక పాఠశాలల్లో రామానుజన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబరాన్నంటేవిధంగా గణితదినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.వేంపాడు హైస్కూల్ లో హెచ్.ఎమ్. యు.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు స్థానిక మండలవిద్యాశాఖాధికారి 1 కే.నరేష్, మండలవిద్యాశాఖాధికారి2 రుత్తల నాగన్నదొర లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో ముందుగా గణితం ల్యాబ్ ను నరేష్ తో పాటు గ్రామ సర్పంచ్ యేడిద నూకరత్నం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.విద్యార్థులు తయారుచేసిన వివిధ గణిత నమూనాలు పలువురు చూపరులను ఆకట్టుకున్నాయి.గణితంలో రామానుజన్ చేసిన అద్భుతమైన కృషిని విద్యార్థులకు వివరించారు.ప్రతీ విద్యార్థి గణితంయొక్క ప్రాముఖ్యత తెలుసుకుని గణితంపై పట్టుసాధించాలన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రెశిడెంట్ అయినంపూడి అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కోటవురట్ల మండలంలో వైసీపీకి షాక్



**కోటవురట్ల (మనసులో మాట) డిసెంబర్ 22:** కోటవురట్ల మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. మాజీ ఎంపీపీ మాజీ జడ్పిటిసి కిల్లాడ వెంకట సాయి, ఆయన సతీమణి ఎంపీటీసీ వెంకటలక్ష్మి వైసీపీకి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం ప్రకటించారు. పాములవాక సెగ్మెంట్ నుంచి వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపీటీసీ అయ్యారని అన్నారు. అప్పటినుంచి పార్టీ పెద్దలు తమను పట్టించుకోవడం లేదన్నారు. ఏ కార్యక్రమం జరిగినా తమకు ఆహ్వానం అందడం లేదన్నారు. వైసిపి అధినేత జగన్ పుట్టినరోజు సందర్భంగా పాములవాక గ్రామం వచ్చిన పాయకరావుపేట నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త కంబాల జోగులు కనీసం తమకు వస్తున్నట్లుగా సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే మండల పార్టీ అధ్యక్షుడు కూడా తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు పార్టీలో తగిన గౌరవం గుర్తింపు లేదన్నారు. ఈ కారణంగా తాము రాజీనామా చేస్తున్నామన్నారు. తమను గౌరవించే పార్టీలోకి వెళ్లాలని భావిస్తున్నామన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కుశర్లపూడిలో ఘనంగా వైయస్ జగన్ జన్మదిన వేడుకలు

**రోలుగుంట మనసులో మాట, డిసెంబర్ 22.** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కుసర్లపూడిగ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని గ్రామస్థులుఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామ సర్పంచ్ మద్దు అప్పలనాయుడుఆధ్వర్యంలో సబ్బవరపు శివ, అనిమిరెడ్డి సురేంద్ర యూత్ పర్యవేక్షణలో ఈ వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం నిర్వహణ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద జన్మదిన వేడుకలుజరిగాయి. స్థానిక, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను కార్యక్రమానికి ఆహ్వానించారు. కేక్ కటింగ్, మిఠాయిల పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం, సంక్షేమ పథకాల స్మరణసభలో మాట్లాడిన నేతలు, వైయస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన అమ్మఒడి, పింఛన్లు, వంటి సంక్షేమపథకాలను గుర్తుచేశారు. గ్రామస్థులు కూడా ఆయన పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి,బలహీన వర్గాల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.కార్యక్రమంలో గొల్లు నారాయణ మూర్తి, గ్రామంలోని వైఎస్ఆర్సిపి ముఖ్య నేతలు, కార్యకర్తలు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్ద పెద్ద పల్లకిపై స్వామివారి తిరువీధి సేవ



**నక్కపల్లి డిసెంబర్ 22 మనసులో మాట..** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతముపై స్వయం వ్యక్తంగా వేంచేసి యున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం ఏడవ రోజు ఉదయం పెద్దపల్లకిపై స్వామివారి ఉత్సవమూర్తులతోనూ చిన్న పల్లకిలో గోదాదేవి అమ్మవారు ఉత్సవమూర్తులతో తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో నిత్య కార్యక్రమములు బాల భోగ నివేదనలు తిరుప్పావై సేవా కాలము నిర్వహించారు. తరువాత శ్రీదేవి భూదేవి సమేత కల్కి వెంకటేశ్వర స్వామి వారిని పెద్ద పల్లకిలోను గోదాదేవి అమ్మవారిని చిన్నపల్లకిలోనూ అధిష్ఠింపచేసి మేళతాళములతోనూ మంగళ వాయిద్యములతోనూ గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు.అనంతరం గోదాదేవి సన్నిధి వద్ద కీస్ కిసెన్డు ఎంగుం అనై చ్ఛాత్తన్ ఏడవ రోజు పాశురంతో విశేషంగా నిరాజనాలు సమర్పించారు. అనంతరం తీర్థ గోష్టి భక్తులందరకు ప్రసాద్ వినియోగము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు భక్తులు సుధూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హాజరయ్యారు.

## యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రఘునాథ్, కన్నయ్య



**డుంబ్రిగుడ, డిసెంబర్ 22,(మనసులో మాట):** యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం అల్లూరి జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కే రఘునాథ్, ఎస్ కన్నయ్య నూతనంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రం పాడేరులో ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరిని నూతనంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం సాగిస్తూ పరిష్కారానికై కృషి చేస్తామని వారు చెప్పారు.

# గణిత గుర్తులుతో విద్యార్థుల ప్రదర్శన



**ఎస్. రాయవరం, డిశంబర్ 22 (మనసులో మాట):** మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గణిత గుర్తులు, 1729సంఖ్యగా ఏర్పడిచేసిన ప్రదర్శన పలువురును విశేషంగా ఆకట్టుకుంది. శ్రీనివాస్ రామానుజన్ జయంతి నిపురస్కరించు కొని విద్యార్థులు రామానుజన్ సంఖ్య గా పిలవబడే 17 29 ఆకారం, ప్లస్, మైనస్, గుణకారం, భాగాహారం గుర్తుల ఆకారంలో కూర్చొని ప్రదర్శన నిర్వహించి నివాళులు అర్పించారు. నేటికీ రామానుజన్ సిద్ధాంతాలపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయని, మ్యాజిక్ స్క్వేర్ ప్యూర్ మ్యాథమెటిక్స్ కు చెందిన నెంబర్ సిద్ధాంతం, మాక్ తీటా ఫంక్షన్స్ ఎంతో ప్రసిద్ధి చెందని ప్రధానోపాధ్యాయిని సుధామాధురి విద్యార్థులు తెలియజేశారు. గణిత ఉపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు కూడా గణితంతో మన జీవితం ముడిపడి ఉన్నదని 1729 అనేది 9 యొక్క ఘనము, 10 యొక్క ఘనము ల మొత్తాలు గా రాయగలిగిన కనిష్ట సంఖ్య 17 29 అని ఆనాడే రామానుజన్ సమాజానికి తెలియజేశారన్నారు.

## జనవరి 4 న భిక్షాటన కు తలపెట్టిన

# విశాఖ ఉక్కు నిర్వాసితులు



**గాజువాక (మనసులోమాట)డిసెంబర్ 22..** నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ భూ నిర్వాసితుల సమస్యలు గత కొన్ని నెలలుగా అనేక ఉద్యమాలతో ఉదృతం చేస్తున్నారు. ఆనాడు ఇందిరాగాంధీ దేశ ప్రధాని గా ఉన్నప్పుడు భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం ఇస్తానని వాగ్దానం ఇచ్చి, ప్రతి ఇంటి కి ఆర్ కార్డు ఇచ్చి ఇల్లు, భూమి తిసుకున్నారు. నాటి నుండి నేటి వరకు ఉక్కు నిర్వాసితులకు అన్యాయం జరుగుతూ వస్తుందని, మిగులువున్న సుమారు 8500 ఆర్ కార్డు దారులకు ఈ రోజు కు ఎటువంటి న్యాయం జరగకపోగా కూలి పనులు, పాచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉక్కు భూ నిర్వాసితులకు శాశ్వత న్యాయం జరగాలంటూ విశాఖ ఉక్కు నిర్వాసితుల కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, ఉక్కు ఐక్య సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నారు. నడుపూరు కళావేదికలో 64 గ్రామాలు నుండి నిర్వాసితుల జేఏసీ కమిటీ లతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశం ఉద్దేశించి అధ్యక్షులు పితాని భాస్కర మాట్లాడుతూ జనవరి 4వ తారీఖున ఆదివారం ఉదయం 9 గం. లకు పాత గాజువాక నుంచి జరిగే బిక్షాట్టిన కార్యక్రమానికి నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, ఈ యొక్క కార్యక్రమానికి రాజకీయ నాయకులు, ప్రజాసంఘాలు యూనియన్ నాయకులు మద్దతు తెలియజేయాలని మా న్యాయమైన డిమాండ్ కోసం పోరాటం చేస్తున్నామని మీరంతా పూర్తి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. స్టీల్ ప్లాంట్ సంబంధించి మిగిలి ఉన్న మిగిలి ఉన్న భూములు అనేకం ఉన్నాయని, ఆ యొక్క భూమిని ఏ విధంగా కూడా స్టీల్ ప్లాంట్ వారు ఉపయోగించలేదని.., ఆ యొక్క మిగిలి ఉన్న భూములను ఇప్పటి వరకు ఏ న్యాయం చెయ్యని భూ నిర్వాసితులకు అందరికీ మిగిలిన భూమి పంచాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉక్కు భూమి పంచెంతవరకు ప్రతి నెల 25 వేల రూపాయలు జీవనోపాధి భృతి చెల్లించాలని 64గ్రామాల వారు కోరుచున్నారని చెప్పారు. ఈ విధంగా చెల్లించే వరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని గుర్తు చేసారు. జనవరి 4న పిలుపునివ్వడంతో ఇప్పటి నుండే 64 గ్రామాల భూ నిర్వాసితులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉమ్మడి అప్పారావు, గల్లా రామకృష్ణ, నిర్వాసితుల నాయకులు శీర సంజీవ, కోన రమణ, అంగదేముడు. కె. జగన్, సి హెచ్ ఈశ్వరరావు వి రాజు. మొల్లీ రవి, కేత గణేష్, భారీ సంఖ్యలో ఉక్కు నిర్వాసితుల 64 గ్రామాల కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ ద్వారా సమస్యల పరిష్కారం



**చీడికాడ, డిసెంబర్ 22, (మనసులో మాట):** ప్రజా దర్బార్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు మండల కేంద్రమైన చీడికాడ శ్రీ తులసి కళ్యాణ మండపంలో ప్రజా దర్బార్ కార్యకర్తే అధినేత అను కార్యక్రమం సోమవారం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికు మండలంలో ప్రజలు పలు సమస్యల కోసం వినతి పత్రాలు అందజేశారు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్ తహసిల్దార్ కిషోర్ లింకన్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నంనాయుడు కోనాం రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కోట్యాడ చిన్నంనాయుడు కూటమి నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# రోలుగుంటలో హిందూ సమ్మేళనం

**- భవ్యంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగం**



**రోలుగుంట మనసులో మాట డిసెంబర్ 22.** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కేంద్రంలో జరగబోయే సంబంధించిన హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమ ఇన్చార్జ్ బి. దేవుడు బాబు ఆధ్వర్యంలో కొవ్వూరు గ్రామంలో ప్రత్యేక ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటలకే మేలుకొలుపు భజన బృందాలు గ్రామ వీధులన్నింటిలోనూ సంచరిస్తూ భక్తి గీతాలు ఆలపించాయి. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ గ్రామస్తులు అందర్నీ రోలు గుంటలో జరిగే హైందవ సమ్మేళనానికి ఆహ్వానించారు.. భజన బృందాల భక్తిసాన్నిధ్యంతో గ్రామం మొత్తానికి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. యువత, మహిళలు, వృద్ధులు అందరూ ఉత్సాహంగా స్పందించి కార్యక్రమంలో పాల్గొనాలని కరపత్రాలు ఇచ్చారు. ఇన్చార్జ్ దేవుడు బాబు మాట్లాడుతూ, "హిందూ సమైక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణ, భక్తి భావ పరంపర కొనసాగింపు లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది. అందరూ తప్పనిసరిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని అన్నారు. కార్యక్రమానికి స్థానిక హిందూ సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భజన మండళ్లు కృషి చేస్తున్నారు. డిసెంబరు 25న జరిగే ఈ సమ్మేళనం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

## కుసర్లపూడిలో ధనుర్మాసం పురస్కరించుకొని

# మేలుకొలుపులు



**రోలుగుంట మనసులో మాట, డిసెంబర్ 22..** అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలం, కుసర్లపూడి గ్రామంలో ధనుర్మాసం పురస్కరించుకొని శ్రీకృష్ణ మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయంలో తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజలు, హారతులు, భజనలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ మేలుకొలుపు కార్యక్రమానికి గొల్లు రమణ, గొల్లు గోవిందా, సబ్బవరపు పెద్ది నాయుడు, శెట్టి సత్తిబాబు, సబ్బవరపు కాశి ఆధ్వర్యంలో గ్రామ యువకులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. . కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, గొల్లు నారాయణమూర్తి తదితర ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని ధనుర్మాస మేలుకొలుపు విశిష్టతను వివరించారు. హిందూ సంస్కృతిలో ధనుర్మాసంలో ఉదయం పూట జరిగే ఈ రకమైన మేలుకొలుపు, భజన కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో భక్తి, సామరస్యాన్ని పెంపొందిస్తాయని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కీర్తనలు పాడుతూ, హారతు ఇస్తూ కార్యక్రమం నిర్వహించారు



## రేవు పోలవరం లో గణిత దినోత్సవ వేడుకలు

### టిఎల్ఎం ప్రదర్శన ప్రారంబించినసి ఐ రామకృష్ణ

**ఎస్. రాయవరం, డిశంబర్ 22,(మనసులో మాట):**ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం జిల్లాపరిషత్ హైస్కూల్ లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని స్వర్ణ గౌరీ తయారుచేసిన టి ఎల్ ఎమ్ ప్రదర్శన ను నక్కపల్లిసర్కిల్ ఇన్స్పెక్టర్ శ ఎల్ రామకృష్ణ ప్రారంభించారు .గణిత విశ్లేషణ, సంఖ్యాశాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు గూర్చి ప్రపంచానికి అద్భుతమైన జ్ఞానాన్ని ప్రజలందరికి అందించారని సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ విద్యార్థులకు తెలియజేశారు. గణిత ఉపాధ్యాయరాలు స్వర్ణ గౌరి మాట్లాడుతూ మ్యాజిక్ స్క్వేర్ ప్యూర్ మ్యాథమెటిక్స్ చెందిన నంబర్ సిద్ధాంతం మాక్ తీటా ఫంక్షన్స్ ప్రసిద్ధి చెందాయని , నేటికీ రామానుజన్ సిద్ధాంతాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయని, 2012 వ సంవత్సరం నుండి డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవం గా నిర్వహించుకుంటు న్నామన్నారు. రామానుజన్ విద్యార్థుల , ఉపాధ్యాయుల హృదయాలలో చిరస్మరణీయుడుగా వెలుగొందుతున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయిని అరుణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



చీడికాడ, డిసెంబర్22, (మనసులో మాట) గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కోణం రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కోట్యాడ చిన్నంనాయుడు అన్నారు మండలంలో తుని వలస గ్రామంలో సోమవారం పంచాయతీ గ్రామ సభ జరిగింది ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరుకు పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది ఈ సందర్భంగా చిన్నంనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ద్వారా పంచాయతీకి నిధులు మంజూరు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పడాల హైమా పంచాయతీ కార్యదర్శి సుజాత పంచాయతీ పాలవర సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పేద రోగులకు అసరాగా సిఎం సహాయ నిధిఎస్



**రాయవరం, డిశంబర్ 22,(మనసులో మాట):**పేదప్రజల వైద్యఖర్చులుకు సి ఎం సహాయనిధి అసరాగా నిలుస్తుంది ని, హోమ్ మంత్రి సిఫార్సు మేరకు ఎస్. రాయవరం మండలంలోని పలుగ్రామాలరోగులుకు సి ఎం సహాయనిధినుండినిధులు మంజూరుఅయినట్లు స్థానిక టిడిపి నేతలు తెలిపారు. మండలంలోనితిమ్మాపురం గ్రామంలో ప్రమాదానికి గురైన గుర్రం రవికిరణ్ కు41,084 రూపాయలుచెక్కును స్థానిక టిడిపినేతలు ఆయనకు అందచేసారు. ధర్మవరం గ్రామంలో అనారోగ్యంతో ఆసుపత్రి లో వైద్య సేవలుపొందిన కందుల రాము కు 55,616 రూపాయలు సి ఎం సహాయనిధి చెక్కును అందచేసారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షుడు అబద్ధం, కార్యదర్శి నర్సింహా మూర్తి, గుర్రంరామకృష్ణ, వి. గోవింద్, భీమ, కలిగట్లబాబూరావు, బండినాగేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో నిర్వహణ తీరు పరిశీలన



మునగపాక, డిసెంబర్ 22, మనసులో మాటసోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ శాఖకు సంబంధించిన ఎక్స్టర్నల్ అసెస్మెంట్ టీం సోమవారం హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో జరిగిన తీరును పరిశీలించారు. డాక్టర్ కె. విజయశాంతి ఆధ్వర్యంలో డాక్టర్ కె. చాందిని టీం కేంద్రంలో రిపోర్ట్స్ ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పోలియో చుక్కల నిర్వహణ తీరును, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం గ్రామాలలో చుక్కలు పొందిన పిల్లలను పరిశీలించారు. గృహ సందర్శన చేస్తున్న బృందముల పనితీరును సమీక్షించారు. ఎర్రవరం గ్రామంలో ఇటుక బట్టీలో వేసిన పిల్లవాడిని పరిశీలించి సంతృప్తిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ షకీన, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్ ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, వైద్య సిబ్బంది గణేష్,నాగేశ్వరరావు,ఇందిర,లక్ష్మీ మరియారత్నం,దేవకి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం రద్దు పై సిపిఎం నిరసన

## ఉపాధి చట్టం ఉసురు తీసిన డబుల్ ఇంజన్ సర్కార్



**మునగపాక, డిసెంబర్ 22, మనసులో మాట..** మీ గురువుమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, దీనినీ పథకంగా మార్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్యకు వ్యతిరేకంగా సిపిఎం మునగపాక మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ , చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని బిజెపి మోడీ ప్రభుత్వం సవరణలు చేయడం మహాత్మా గాంధీ పేరు తొలగింపు చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండును బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమే. గ్రామీణ పేదలను ఆకలి చావులకు ఉసుగోల్పడమే అవుతుందని అన్నారు. మహాత్మా గాంధీని హత్య చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి గాడ్సే వారసులుగా ఉన్న మోడీ ప్రభుత్వం ఈ పథకంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి ద్రోహం చేస్తుందని అన్నారు. రాష్ట్రాల వాటా 10 నుండి 40 శాతానికి పెంచి రాష్ట్రాలపై భారం పెంచారు. ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేల కోట్లు అదనపు భారం పడనుంది. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతు గా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించు కునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆళ్ల మహేశ్వర రావు, ఎస్ బ్రహ్మాజీ , కాండ్రేగుల రాము, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కు మెమోరాండం సమర్పించారు.



## నిర్వహణ బాగుంది గ్రంథాలయ అధికారి దమయంతి

**నక్కపల్లి డిసెంబర్ 22 మనసులో మాట..** గ్రంథాలయ నిర్వహణ బాగుందని గ్రంథాలయ అధికారి దమయంతి అన్నారు. నక్కపల్లి మండలం ఉపమాక అగ్రహారం గ్రామీణ గ్రంథాలయాన్ని సోమవారము ప్రధమ శ్రేణి గ్రంథాలయాధికారిని పి. దమయంతి( నర్సీపట్నం) సందర్శించారు గ్రంథాలయమునకు సంబంధించి, 2024-25 సంవత్సరం, వార్షిక, రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. గ్రంథాలయానికి, చదువరులు ఎక్కువమంది వచ్చేలా చూడాలని, గ్రామపంచాయతీ నుండి రావలసిన గ్రంథాలయ పన్ను సకాలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులకు జమ అయ్యేటట్టు చూడాలని, పాఠశాలల విద్యార్థులతో సభ్యత్వాలు చేర్పించాలని దమయంతి సూచించారు గ్రంథాలయాధికారి కె. జనార్ధన్ విధి నిర్వహణ, రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు

## గోరాపూర్లో గుర్తు తెలియని మృతదేహం



డుంబ్రిగుడ, డిసెంబర్ 22,(మనసులో మాట):- మండలంలోని గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆంధ్ర, ఒడిశా రహదారి కిందన తుప్పల చాటున గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించడం జరిగిందని ఎస్సై సురేష్ తెలిపారు స్థానికుల సమాచారంతో సంఘటన స్థలంలో చేరుకోవడం జరిగిందన్నారు. మృతుడు ప్యాంటు, బ్రౌన్ రంగు బెల్టు, కుడి చేతిపై ఆంజనేయస్వామి బొమ్మ (టుటూ) ఉందన్నారు. మృతుడి వయసు సుమారు 25 ఏళ్ల ఉండవచ్చన్నారు. స్థానికులతోపాటు రైల్వే రోడ్డుకు పనికొచ్చిన వారిని విచారించడం జరిగిందన్నారు. మృతుడు ఎవరనేది పూర్తి తెలుసుకునేందుకు గోరాపుర్, గొడ్డిగుడ గ్రామస్థులను విచారించగా మతిస్థిమితం లేని వ్యక్తిగా గత అయిదు రోజులుగా తిరుగుతున్నారని స్థానికులు తెలిపారన్నారు. మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడం జరగిందని చెప్పారు బాధిత మృతుడి మృతిపై అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## పిల్లవానిపాలెం ప్రత్యేక పంచాయతీ పై హోరెత్తిన ఎండిఓ ఆఫీస్





**రావికమతం డిసెంబర్ 22 (మనసులో మాట)...** మండలంలో గుడివాడ పంచాయతీకి చెందిన శివారు గ్రామం పిల్లవాని పాలెంను ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు పై సోమవారం అనుకూల వ్యతిరేక వర్గాలు నినాదలతో మండల పరిషత్ కార్యాలయం హోరెత్తింది . గుడివాడ పంచాయతీ కేంద్రానికి రెండున్నర కిలోమీటర్ దూరంలో ఉన్న పిల్లవానిపాలెం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఒక వర్గం డిమాండ్ చేయగా గుడివాడ పంచాయతీలోని కొనసాగించాలని మరొక వర్గం నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్ఐ రఘువర్మ ఇరు వర్గాలతో చర్చించి ఇరు వర్గాల డిమాండ్ ను ఎండిఓ మహేష్ కు విడివిడిగా తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు రెండు వర్గాలు సర్పంచ్ గుమ్మాల శంకర్ ఆధ్వర్యంలో ఎండిఓ కు డిమాండ్లు ను తెలియజేశారు. పంచాయతీ విభజన పాలకవర్గం తీర్మానంపై ఆధారపడి ఉందని ఎండిఓ మహేష్ తెలిపారు. 12 మంది వార్డు మెంబర్లు తీర్మానం తీసుకురావాలని సర్పంచ్ కు సూచించారు.

## రామానుజన్ జయంతి ని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం



**వి మాడుగుల డిసెంబర్ 22 (మనసులో మాట)..** జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వి మాడుగుల లో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి ని జాతీయగణిత శాస్త్ర దినోత్సవంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి. ఎస్.ఎస్.శాస్త్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభాధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి మాట్లాడుతూ గణిత శాస్త్రం శాస్త్ర సాంకేతిక రంగాల్లో వెన్నెముక వంటిదని ఇది నిత్యజీవితంలో కీలకపాత్ర వహిస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో గణిత శాస్త్రం ప్రఖ్యాతి వహించిందని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి జయలక్ష్మి మాట్లాడుతూ భారతదేశానికి ఆధునిక కాలంలో అంతర్జాతీయ స్థాయిని తీసుకువచ్చిన గణిత శాస్త్రవేత్త రామానుజన్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో కూడా గణిత శాస్త్రం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల గణిత శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ వి. అప్పలనాయుడు స్వాగతోపన్యాసం చేసి రామానుజం గణిత శాస్త్రంలో చేసిన కృషిని వివరించారు. తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ పులవర్తి పైడిరాజు మాట్లాడుతూ గణిత శాస్త్రాన్ని పద్యాల రూపంలో వివరించిన పావులూరి మల్లన గురించి తెలియజేశారు. కళాశాల బీఎస్సీ మ్యాథమెటిక్స్ విద్యార్థులు చిరంజీవి అనూష కుమారి, జగదీశ్వరి, రమేష్, జయచంద్ర, తేజస్విని, ధనలక్ష్మి, భారతి, చార్మిళ, షాలిని, సతీష్, ఉమా మహేష్, విజయ్, మహేశ్వరి , మధుసూదన్,లు రామానుజన్ జీవిత చరిత్రను, భారతీయ గణిత శాస్త్రవేత్తలను పరిచయం చేశారు. ఇంకా గణితశాస్త్రం ఇతర శాస్త్రాలపై ఉండే ప్రభావం నిత్యజీవితంలో ఆవశ్యకత మొదలైనఅంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తమ ఉపన్యాసకులు డాక్టర్ వి. అప్పలనాయుడు ను దుశ్శాలువ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇతర ఉపన్యాసకులు బి నారాయణ ఎస్ అంబేద్కర్ రాజు కేపీ నాగేశ్వరరావు బోధనేతర సిబ్బంది సులేమాన్ శ్రీనివాసు లు మరియు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విశాఖలో డిగ్రీ కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్



**వి మాడుగుల డిసెంబరు 22 (మనసులో మాట)..** భారత యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఫిట్ ఇండియా ఉద్యమం లో భాగంగా ఆరోగ్య కుటుంబమే ఆరోగ్య భారత్ అనే నినాదంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ను మై భారత విశాఖపట్నం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో బాలురకు వాలీబాల్ పోటీలు 100 మీటర్ల పరుగు పోటీలు మరియు బాలికలకు కబడ్డీ మరియు 100 మీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. పై పోటీల్లో ప్రథమ ద్వితీయ స్థానం సంపాదించిన వారికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి చేతులమీదుగా మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఇంకా ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ ఆ స్త్రీ అధ్యక్షా ఉపన్యాసం చేస్తూ వికసత్ భారత్ లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య భారత్ ను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి జయలక్ష్మి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు ఇతర ఉపన్యాసకులు డాక్టర్ పులవర్తి పైడిరాజు, వి.అప్పలనాయుడు ఎస్ అంబేద్కర్ రాజు, బి నారాయణ, కే పి నాగేశ్వరరావు బోధనేతర సిబ్బంది సులేమాన్ శ్రీనివాసు మరియు విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మై భారత్ విశాఖ జిల్లా ప్రతినిధులు వినయ్ కుమార్, జ్ఞాన దీపు, ప్రసన్న కుమార్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మై భారత్ కోఆర్డినేటర్ ఎం రామకుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## డిగ్రీ కళాశాల పలు ఉన్నత పాఠశాలలో రామాజన్ జయంతి



**చోడవరం, డిసెంబర్ 22(మనసులో మాట) :** గణిత శాస్త్ర వేత్త రామానుజన్ 138వ జయంతి వేడుకలను జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల లో మేథ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత దినోత్సవం లో ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని ప్రశంసించారు . వైస్ ప్రిన్సిపాల్ ఐవివి సత్యవతి, సీనియర్ ఉపన్యాసకులు నారాయణ మూర్తి , అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ, రత్న భారతి తదితరులు పాల్గొన్నారు . కంప్యూటర్ ప్రజంటేసన్ చేసిన మొదటి సంవత్సర విద్యార్థిని రమ్య కు బహుమతి అందచేశారు. గాంధీ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పాండు రంగారావు నేతృత్వంలో గణిత దినోత్సవం ఘనంగా జరిపారు. గణిత ఉపాధ్యాయులు కె.రాజరాజేశ్వరి, ఎం. జగదీశ్వరరావు, బి.వి.వి. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు . గవరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్ సింగ్ అధ్యక్షతన గణిత దినోత్సవం జరిగింది. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు సిహెచ్. సంజీవరావు విద్యార్థులకు మేథ్స్ క్విజ్, రంగోలి నిర్వహించారు. మేథ్స్ మోడల్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు .

## ఒకపక్క చెత్త మరోపక్క మురికినీరు తో అల్లాడిపోతున్న మోసయ్యపేట ప్రజలు



**అచ్యుతాపురం, మనసులో మాట డిసెంబర్ 22:** మండలంలోని మోసయ్యపేట గ్రామం చెత్తకుప్పలు, మురుగు నీటితో దుర్భర పరిస్థితుల్లో కూరుకుపోయింది. ముఖ్యంగా రామాలయం వీధిలో డ్రైనేజీ పూర్తిగా మూసుకుపోవడంతో మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది.గ్రామంలోని చెరువుల్లో అక్రమ నిర్మాణాల వల్ల నీటి ప్రవాహ మార్గాలు అడ్డుకుపోయి, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా మురుగు నీరు ఇళ్లలోకి చేరుతూ, పురుగులు, పాములు వంటి జీవులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దోమల విపరీత పెరుగుదలతో పిల్లలు, వృద్ధులు తీవ్రంగా దోమకాటుకు గురవుతున్నారు. దీని వల్ల , జ్వరాలు తదితర అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు బ, ౕ యౕ ా ం దో ౕ న గురవుతున్నారుసంబంధిత అధికారులు స్పందించకపోవడంతో “ఇక్కడ నివసించాలా? ఇళ్లను ఖాళీ చేయాలా?” అనే స్థితికి మోసయ్యపేట ప్రజలు చేరుకున్నారు. తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టి, మురుగనీరు పోయే విధంగా డ్రైనేజ్ ని నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుచున్నారు . జిల్లా అధికారులు ఇప్పటికీ స్పందించి మాకు విముక్తి కల్పించాలి అని గ్రామస్తులు కోరుతున్నారు.



## భక్తులు తాతయ్య బాబుకు మునగపాక టిడిపి నేతలు అభినందనలు

**మునగపాక , డిసెంబర్ 22, మనసులో మాట..** అనకాపల్లిజిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులుగా బత్తుల తాతయ్య బాబు రెండవ సారి నియమితులైన సందర్భంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో వారి స్వగృహంలో ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్ర కార్యదర్శి కర్రి సాయికృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బత్తుల తాతయ్య బాబు సారధ్యంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆసభవాన్ని వ్యక్తం చేశారు.

## జీవో నెంబర్ 1491 సవరణ చేసి జీవో రిలీజ్ చేయాలని వైయస్సార్ సిపి విజ్ఞాపన



**మునగపాక, డిసెంబర్ 22, మనసులో మాట..** అనకాపల్లి కలెక్టర్ ఆఫీసులో వెళ్లి మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని జిల్లా సమీక్ష సమావేశం లో ఏదైతే కూటమి ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందో,జీవో నెంబర్ 1491 సవరణ చేసి,మరలా జీవో రిలీజ్ చేయాలని,మునగపాక మండలాల 26 పంచాయతీ గ్రామసభలో తీర్మానం చేసినా వినతి పత్రాన్ని కలెక్టర్ అందజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ ఈ కార్యక్రమంలో మునగపాక మండల పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి ఆచ్చినాయుడు మరియు సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ బయటకు వచ్చి మీడియా ద్వారా మాట్లాడిన వైఎస్ఆర్సిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ జీవో సవరణ చేసి కొత్త జీవోను రిలీజ్ చేయాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

## ప్రధానమంత్రి సూర్య గర్ పథకం నిరుపేదలకు వరం



**చీడికాడ డిసెంబర్ 22, (మనసులో మాట)** ప్రధానమంత్రి సూర్యగర్ పథకం నిరుపేదలకు వరమని జిల్లా విద్యుత్ శాఖ సూపర్డెంట్ ప్రసాద్ అన్నారు చీడికాడ సబ్ స్టేషన్ లో ప్రజలు సూర్య పథకంపై అవగాహన సదస్సు జరిగింది ఈ సదస్సులో పాల్గొన్న జిల్లా సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ ప్రసాద్ మాట్లాడుతూ సూర్య గర్ కు దరఖాస్తు చేసుకున్న వారికి 80 శాపం సబ్సిడీపై ఇంటిపై సోలార్ ఏర్పాటు జరుగుతుందన్నారు ప్రజలు సోలార్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా మండల్ లైన్ గా సేవలందిస్తున్న వరహాలును చీడికాడ యువకులు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డి ఈ ఏవి ఎన్ అప్పారావు ఏడిఇ సురేష్ బాబు ఏఈ వెంకట్రావు లైన్ ఇన్స్పెక్టర్ భుషణం మండలానికి చెందిన లైన్మెన్లు పాల్గొన్నారు

## పదవి బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ నేతలతో ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్



**మునగపాక, డిసెంబర్ 22, మనసులో మాట..** ఇటీవల మునగపాక మండలంలో వివిధ హోదాల్లో పదవి బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ నేతలతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన పదవీ బాధ్యత స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడుటెక్కలి పరుశురాం, పార్టీ ప్రధాన కార్యదర్శి కే చంద్రమోహన్, నాగులపల్లి పిఎసిఎస్ అధ్యక్షులుఎల్లపు వెంకట భాస్కరరావు, చూచు కొండ పిఎసిఎస్ అధ్యక్షులుపెంటకోట నర్సింగరావు, కర్రి వెంకయ్య నాయుడు, ఇల్లపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు




# శిల్పమే.. నినాదంగా

- ఆకట్టుకుంటున్న దేవిన సిస్టర్స్ సైకత శిల్పం
- మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా..
- రైతు దినోత్సవ సైకత శిల్పం

**అనపర్తి (మనసులో మాట), డిసెంబరు 22:** ఒక సందేశం ఇవ్వాలంటే భాషే అక్కర్లేదు..శిల్పం ద్వారా కూడా ప్రజలలో చైతన్యం తీసుకు రావచ్చునని నిరూపిస్తున్నారు దేవిన సిస్టర్స్. అనపర్తి నియోజకవర్గం రంగంపేట మండలానికి చెందిన దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత. తండ్రి శ్రీనివాస్ కు సైకత శిల్పాలు రూపొందించడంలో అందెవేసిన చేయి. తండ్రి వద్ద సైకత శిల్పం కళలో మెలకువలు నేర్చుకున్న దేవిన సిస్టర్స్ జాతీయ అంతర్జాతీయ వేడుకలు ఏమొచ్చినా తమదైన శైలిలో సైకత శిల్పాల ద్వారా ప్రజలకు మంచి మంచి సందేశాలతో అవగాహన కల్పిస్తూ ఎందరో ప్రముఖుల అభినందనలు అందుకున్నారు. నేడు (మంగళవారం) మన దేశ 5వ మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి. ఈయన రైతు నాయకుడు. రైతుల విజేతగా గుర్తింపు పొందారు. ఆయన జీవితంలో రైతుల శ్రేయస్సు, హక్కుల కోసం పోరాడారు. అందుకే చౌదరి చరణ్ సింగ్ జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రజలకు మంచి సందేశం అందివ్వాలనే ఉద్దేశంతో దేవిన సిస్టర్స్ 'కిసాన్ దివాస్' పేరుతో చక్కని సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. ఒకవైపు రైతు శ్రమను చూపిస్తూనే..మరో వైపు 'రసాయన వాడకం తగ్గిద్దాం, పుడమికి ప్రాణం పోద్దాం' అనే చక్కని నినాదంతో రైతులను ఆలోచింపజేసేలా ఈ సైకత శిల్పాన్ని చెక్కారు. నేడు (మంగళవారం) రైతు దినోత్సవం సందర్భంగా ఈ సైకత శిల్పాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా గత రెండు రోజుల పాటు శ్రమించి అందమైన సైకత శిల్పాన్ని దేవిన సోహిత, ధన్యత తీర్చిదిద్దారు. పశు సంపద, పచ్చని పైరు, రైతు, రైతు భార్య..ఇలా సైకత శిల్పంలో దేవిన సిస్టర్స్ చూపించారు. ఈ సైకత శిల్పం తయారు చేయడానికి 12 గంటలు పట్టిందని, రెండున్నర యూనిట్ల ఇసుకను వినియోగించినట్టు దేవిన సోహిత, ధన్యత తెలిపారు. ఈ సైకత శిల్పాన్ని చూసిన ప్రతీ ఒక్కరూ దేవిన సిస్టర్స్ ను అభినందించడంతో పాటు..కుమార్తెలకు చక్కని శిక్షణ ఇచ్చిన దేవిన శ్రీనివాస్ ను మెచ్చుకుంటున్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో..
- పాల్గొన్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** జిల్లా యంత్రాంగం, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ప్రైవేటు సమావేశ మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా హాజరైన ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, క్రైస్తవ సోదర – సోదరీమణులు, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలందరికీ ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, క్షమ, త్యాగం వంటి మానవీయ విలువలను గుర్తు చేస్తుందని ఆమె అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సామాజిక సమైక్యతకు, నైతిక విలువలకు పునాదిగా నిలుస్తాయన్నారు. విభిన్న మతాలు, సంస్కృతులు కలిసి వికసిస్తున్న మన దేశంలో ఇటువంటి పండుగలు సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. సభాధ్యక్షుడు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలు, వర్గాలకు సమాన గౌరవంతో పండుగలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. భద్రత, భరోసా, స్వేచ్ఛతో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయని, ఊహాజనిత మాటలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆయన బోధనలు భారతీయుల హృదయాలను ఆకట్టుకున్నాయని తెలిపారు. క్రైస్తవ మతంలోని ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ క్రీస్తు బోధనల ద్వారా కరుణ, దాతృత్వం, ఇతరుల పట్ల ప్రేమ భావం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ కే ప్రతాప్ సిన్హా మాట్లాడుతూ దేవుడు తన కుమారుడిని ఈ లోకానికి పంపి మానవాళికి ప్రేమ, శాంతి మార్గం చూపారని అన్నారు. క్రైస్తవులకు, సంస్థలకు ప్రభుత్వ సహకారం కొనసాగాలని కోరారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఫాస్టర్ లు జిల్లా ప్రజల శాంతి, సమైక్యత, సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలను ఆత్మీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖాధికారి మెల్లిమి సునీల్ కుమార్, డాక్టర్ కే సుధీర్ కుమార్, జుహానీ హాలోనెస్, రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పీ టాటి విక్టర్, డాక్టర్ కే మోసెస్ బాబు, రెవ్ టీ కుమార్, బిషప్ బత్తిన రాజు, కాశీ నవీన్ కుమార్, ఉప్పులూరి జానకి రామయ్య, గాలి సుబ్బరాజు, కే మోజెస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం నుంచే మెదడుకు పదును పెట్టాలి



- భావి భారత శాస్త్ర వేత్తలుగా ఎదగాలి - గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలి
- విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ - ఘనంగా ప్రారంభమైన సైన్స్ ఫెయిర్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22 :** పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, అందుకు మెదడుకు పదును పెట్టాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. స్థానిక శ్రీ సత్య సాయి గురుకులంలో తూర్పు గోదావరి జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి జవహర్ మాట్లాడుతూ.. అగ్రికల్చరల్ సస్టైనబులిటీ.. అంశంలో ప్రదర్శనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని.. వ్యవసాయ రంగంలో పురుగు మందులు అధికంగా వాడనవసరంలేని ఆర్గానిక్ పంటల రకాలు రావాలని ఆకాంక్షించారు. నేడు మనం తింటున్న అనేక ఆహార పంటలు రసాయనాల వాడకంతో కలుషితమై, రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆలోచనకు అనుగుణంగా చెత్త నుండి సంపదపై దృష్టి పెట్టాలని.. ఇళ్లలోనే కంపోస్టు ఎరువు తయారు చేసుకునే విధంగా విద్యార్థులు ఆలోచించాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలరని, పరిశుభ్రత, క్రమశిక్షణతోనే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని అన్నారు. విద్యార్థులు అందరూ ఆరోగ్యంగా ఎదగాలని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని విద్యార్థికి అలవాటు చేయాలనే సంకల్పంతోనే "ముస్తాబు" కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ముందుగా జాతీయ పతాకాన్ని జవహర్ ఆవిష్కరించారు. తదుపరి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి సూచనలు చేశారు. జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు సైన్స్ ఫెయిర్ పతాకాన్నిఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ యాజమాన్యాల పాఠశాలల నుండి 230 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శన కు 11 ప్రాజెక్టు లు ఎంపిక అవుతాయన్నారు.విద్యార్థులు అందరికీ టిఫిన్, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శ్రీ సత్య సాయి గురుకులం కరెస్పాండెంట్ శ్యామ సుందర్, ప్రిన్సిపాల్ గురయ్య, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ని ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహుకరించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ డీ గౌరీ శంకర రావు రచించిన సైన్స్ ఫెయిర్ గీతం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్,కొవ్వూరు డివిజన్ డీవైఈఓ బీ దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎన్ఎస్ నెహ్రూ, రాజమహేంద్రవరం రూరల్ ఎంఈఓ ఏ దుర్గా తులసీదాస్, డీసీఈబీ సెక్రటరీ దేవా అనిత, సీఎంఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహ కార్యదర్శి కోలా సత్యనారాయణ, మంగిన రామారావు, టీ రామానుజం, రమణ రావు, ఎస్ఎల్ వీ రమేష్, కమిటీ సభ్యులు వైవీ రామారావు, టీ చక్రధర్, ఎస్ రవికుమార్, ఏ మల్లేశ్వరరావు, జాన్సన్ మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# నగరమంతా అభివృద్ధి చెందాలి..

- ముఖ్యంగా శివారు ప్రాంతాల అభివృద్ధిపైనే నా దృష్టి
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్-49వ డివిజన్‌లో రూ. 22 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా తాను పని చేస్తున్నానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 49వ డివిజన్ సుబ్బారావు నగర్-2లోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల వద్ద రూ. 22 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసు కూటమి నాయకులతో కలిసి శ్రీకారం చుట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకుల్లా కాకుండా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజా ఉపయోగకరమైన పనులు మాత్రమే చేయడం జరుగుతోంది అన్నారు. గత పాలకులు రోడ్లకు మధ్యలో డివైడర్లు కట్టి రాళ్లు అంటించి రోడ్లను ఇరుకు చేశారని, తాను ప్రజలు సంచరించే ప్రాంతాలు, ఎక్కువగా ప్రజలు నివసించే ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నగర శివారు ప్రాంతాలైన 45, 46, 47, 48, 49 డివిజన్లల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నగరంలో ప్రస్తుతం జరుగుతున్న, అలాగే పూర్తయిన అభివృద్ధి పనులు అన్నీ కలిపి సుమారు రూ. 290 కోట్ల పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు, వారి శారీరక వ్యాయామం కోసం నగరంలోని ప్రతి పార్కును అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. పుష్కరాల నాటికి నగరం ఒక సుందరంగా, పర్యాటక నగరంగా మారబోతోందన్నారు. ఆ దిశగానే ప్రభుత్వం కూడా ప్రణాళికలు చేస్తోందన్నారు. దానిలో భాగంగానే 2027లో జరగబోయే పుష్కరాల నేపథ్యంలో నగరంలోని పలు ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ. 10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేయడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఓ పతాకమా.. క్షమించుమా..

## బీజేపీకి తీరని అవమానం

- రోడ్ల పక్క మురుగు కాల్వల్లో ఆ పార్టీ జెండాలు
- ముందు రోజు అలంకరణలు..మర్నాటికి పనికిరాని జెండాలుగా..
- కమలనాథులూ..గమనించారా??






**రాజమహేంద్రవరం (మనసులోమాట), డిసెంబరు 22:** కేంద్రంలో బీజేపీ, ఏపీ కూటమి లో బీజేపీ..అయితే ఏంటటా. కనీసం తమ పార్టీ జెండాను గౌరవించని కేడర్ ను చూసి నగర వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల ముందు 'కమలం గుర్తుకే మీ ఓటు' అని బిగ్గరగా ప్రచారం. అధికారంలోకి వచ్చాక సభలూ, సమావేశాలు, ఆ పార్టీ నాయకుల విగ్రహావిష్కరణలకు ప్రధాన జంక్షన్లు, డివైడర్లకు, విద్యుత్ స్తంభాలకు, రహదారికి ఇరువైపులా మామిడి తోరణాలు కట్టేసినట్టు కట్టేస్తారు. ఎటు చూసినా కాషాయమే. బీజేపీ జెండాల రెపరెపలే. కార్యక్రమం పూర్తయ్యాక మళ్ళా తమ పార్టీ జెండాలను ఎంతో పవిత్రంగా జాగ్రత్త చేయాలనే ధ్యాసే ఉండదు. దాంతో నాయకులు అలా వెళ్ళగానే..ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు పీకేస్తారు. దేశానికి జాతీయ పతాకం ఎంత పవిత్రమైనదో..రాజకీయ పార్టీలకు ఆ పార్టీ పతాకాలు అంత పవిత్రమైనవిగా భావించాలి. అవసరం కోసం పార్టీ జెండా పట్టుకుని, పదవి వచ్చాక నిర్లక్ష్యం చేస్తే..ఆ జెండాలకు విలువ ఏముంటుంది. ఆ పార్టీ నాయకులపై విమర్శలు గుప్పించకుండా ఎలా ఉంటారు. ఒక్కసారి కమలనాథులు ఆలోచించాలి.స్థానిక గోరక్షణ పేటలో ఆదివారం సాయంత్రం భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర'లో భాగంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అక్కడే అటల్ బిహారీ వాజపేయి నిలువెత్తు విగ్రహాన్ని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ మంత్రులు సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇంత వరకూ బాగానే ఉంది. కార్యక్రమం విజయవంతం కావడానికి బీజేపీ శ్రేణులు శ్రమనూ అభినందించాలి. కాకపోతే.. కార్యక్రమం పూర్తయ్యాక రోడ్లపై చెత్త కాగితాల్లా, వ్యర్థ పదార్థాలు మాదిరిగా పార్టీ జెండాలను 'అవసరం తీరాక వదిలేసినట్టు' విస్మరించడాన్ని అటుగా వెళుతున్న ప్రతీ ఒక్కరికీ బాధను కలిగించింది. జెండాలు కట్టేటప్పుడు నాయకులు ఎంత శ్రద్ధగా పర్యవేక్షిస్తారో, కార్యక్రమం అయ్యాక అంత జాగ్రత్తగా పార్టీ జెండాలను కార్యాలయానికి తరలించాలనే ఆలోచన లేకపోవడం దురదృష్టకరం. అందునా..రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు బీజేపీ సీనియర్ నేతలు. గతంలో వీరిద్దరూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంతో భాధ్యతగా సేవలందించారు. అటువంటిది పార్టీ జెండాలను నిర్లక్ష్యంగా వదిలేసి.. కార్యక్రమం పూర్తవగానే ఎవరి వాహనాలలో వారు వెళ్ళిపోయారే కానీ..తమకు గుర్తింపు తెచ్చిన, హోదానిచ్చిన పార్టీ పతాకాన్ని కేవలం 'అలంకార' వస్తువుగా చూడటం పట్ల దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# సీపీఐ ధర్నా

- 'ఉపాధి హామీ' చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండు చేస్తూ..
- కేంద్రం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' పథకాన్ని రద్దుచేసే వరకు పోరాటం ఆగదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు




**రాజమహేంద్రవరం (మనసులో మాట) డిసెంబరు 22:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక జంపేట గాంధీ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో మోడీ ప్రభుత్వం మతం ముసుగులో జిరాంజీ పథకంగా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేని సమయంలో గ్రామీణ పేదలకు వలసల నుండి నివారణ కల్పిస్తూ ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా నీరుగార్చడానికి ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. అందులో భాగంగానే మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సే పేరుతో వికసిత్ భారత్ జిరాంజీ పథకంగా పేరు మార్చి కేంద్రం వాటా 90 శాతం నుండి 60 శాతానికి కుదించడం.. ఉపాధి హామీ చట్టాన్ని రానున్న రోజులలో రద్దు చేసే ఆలోచనతోనే కేంద్ర మోడీ ప్రభుత్వం ఉందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రం వాటా పది శాతం నుండి 40 శాతానికి పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం ద్వారానే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. మోడీ ప్రభుత్వం జిరాంజి పథకాన్ని రద్దు చేసే వరకు వామపక్ష పార్టీలతో కలిసొచ్చే పార్టీలను, సంఘాలను కలుసుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, సహాయ కార్యదర్శి పీ లావణ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనువాస్, పీ త్రిమూర్తులు, సమితి సభ్యులు టీ నాగేశ్వరావు, నల్ల రామారావు, జట్ల సంఘం అధికార బాడీ దేముడు బాబు, అప్పలనాయుడు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్కే మున్ని, వామపక్ష పార్టీల నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కురెళ్ళ వరప్రసాద్, ఏ లక్ష్మీ ఇందిరా, భజంత్రీ శ్రీనివాసరావు, ఎం ఇసాక్, కంది విశ్వనాథం, శ్యామల రాణి, జే గోపి, కొండేటి బేబీ, కే సుధారాణి, జీ స్వాతి, పీ ఆదిశేషు, బళ్ళ కనక దుర్గారావు, కే రామాంజనేయులు, జీ కోటేశ్వరరావు, కే నరసింహస్వామి, కే రాంబాబు, ఉప్పులూరి లక్ష్మి, భవాని, బీ శంకర్, లెనిన్, జీ శివకుమార్, ఎస్ సత్యనారాయణ, అరుణ కుమారి, జీ ఏసుబాబు, బీకేఎంయూ నాయకులు బుగ్గల ప్రభాకర్, బీ ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## ప్రిజన్ లీగల్ క్లినిక్ సేవలను రిమాండ్ ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు. (మనసులోమాట) డిసెంబర్ 22.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎన్ శ్రీలక్ష్మి సోమవారం ప్రత్తిపాడు సబ్ జైల్ ను సందర్శించారు. ప్రిజన్ లీగల్ క్లినిక్ సేవలను రిమాండ్ ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు . అనంతరం ఫిర్యాదులు పెట్టెను రికార్డులను ఆమె పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో వారికి అందుతున్న భోజన వసతులు తదితర విషయాల గురించి తమకు అందుతున్న లీగల్ ఎయిడ్ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపర్నెంట్ చక్రవర్తి మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్స్ బి.శివ అవసరాల దేవి మధుబాబు మల్లేశ్వరరావులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ పెన్షన్దారులు జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించాలి

- జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరు లోగా..
- జిల్లా ఖజానా లెక్కల అధికారి ఏ గణేష్



**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 22:** పదవీ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ పెన్షన్ దారులు వార్షిక జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని ఫైనాన్స్ డిపార్ట్మెంట్, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ప్రతీ ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరు లోగా సమర్పించాలని కాకినాడ జిల్లా ఖజానా లెక్కల అధికారి ఏ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛను దారులు తమ వార్షిక జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాన్ని" జీవన ప్రమాణ్" పోర్టల్లో కానీ, పింఛన్ దారుల వ్యక్తిగత సీఎఫ్ ఎంఎస్ లాగిన్ ద్వారా కానీ లేదా ఏదైనా ఖజానా కార్యాలయంలో కానీ సమర్పించవచ్చన్నారు. ఇందుక పెన్షన్ దారుల (ఆధార్, మోబైల్ నెంబర్ (ఓటీపీ కొరకు), పీపీఓ నెంబరు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు సరి చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పెన్షన్ నిలిపివేయ బడుతుందని, ఈ విషయాన్ని పెన్షనర్లు గమనించాలన్నారు. కాకినాడ జిల్లా పరిధిలో డివిజనల్ ఖజానా కార్యాలయం, కాకినాడ నందు ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంచామన్నారు. అలాగే ఉప ఖజానా కార్యాలయాలు అయిన పెద్దాపురం, జగ్గంపేట, పిఠాపురం, తునిలో అందుబాటులో ఉంచామన్నారు. ఉప ఖజానా కార్యాలయాలలోనూ పింఛన్ దారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించ వచ్చునన్నారు. పెన్షన్ దారులు ఎవరికైనా సందేహాలు ఉంటే ఖజానా కార్యాలయ అధికారులను సంప్రదించ వచ్చునని జిల్లా ఖజానా లెక్కల అధికారి ఏ గణేష్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## దరఖాస్తుల వెల్లువ



**కపిలేశ్వరపురం (మనసులో మాట) డిసెంబర్ 22..** మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామంలో ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు దరఖాస్తు దారులు పోటెత్తారు. ఎంపిడిఓ బానూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంనకు విచ్చేసిన దరఖాస్తుదారులు పలు సమస్యలు పై వినత పత్రాలు అందచేశారు. ఎక్కువగా వ్యక్తిగత అవసరాలు పైనే దరఖాస్తులు అందినట్లు ఎంపిడిఓ బానూజీ మీడియా కు వివరించారు. అత్యధికంగా ఇండ్ల స్థలాలు మంజూరి కొరకు 122 , సామాజిక పెన్షన్ 2, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ 1, కొత్త రేషన్ కార్డు 1అసిస్టెంట్ లేబర్ ఆఫీసు కి 1, ఎక్సైజ్ శాఖకు 1, శానిటేషన్ సమస్యపై 1చొప్పున వినతి పత్రాలు అందినట్లు ఎంపిడిఓ బానూజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ ఏ ఈ శ్రీనివాస్ రెడ్డి వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# భరత్ నీకు దమ్ముందా.. నాపై గెలవగలవా?!

▸▸ నాపై కార్పొరేటర్‌గా పోటీ చేయగలవా.. ▸▸ అధికారంలో ఉన్నప్పుడు నీ ఇంటికి రప్పించుకున్నది నిజం కాదా
▸▸ నేను తప్పు చేసి ఉంటే అప్పుడే కేసులు పెట్టొచ్చు కదా ▸▸ మాజీ ఎంపీ భరత్ విమర్శలకు కొయ్యల రమణ కౌంటర్



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:'భరత్..నాపై కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచే దమ్ముందా..ఆ సత్తా, ధైర్యం నీకుందా..ఛాలెంజ్'..అని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కు శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చెర్మన్, మాజీ కార్పొరేటర్ కొయ్యల రమణ సవాల్ విసిరారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి విమర్శలు చేయడం అతనికి తగదని అన్నారు. తాను తప్పుచేసి ఉంటే అతను ఎంపీగా ఉన్న ఐదేళ్లలో తనపై కేసులు పెట్టించవచ్చు కదా అని ఆయన ప్రశ్నించారు. పేకాట, కోడి పందాలు ఆడిస్తున్నట్టు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. స్థానిక క్వారీ సెంటర్ లోని బీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొయ్యల రమణ మాజీ ఎంపీ భరత్ పై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎంపీ భరత్ రామ్ తనను వైసీపీలోకి రావాలని ఆహ్వానించడం, రెండు సార్లు మిథున్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్లడం నిజం కాదా అని కొయ్యల రమణ ప్రశ్నించారు. కేసులు ఏమైనా ఉన్నాయా అని కూడా ఎంక్వైరీ చేయించిన విషయం నిజం కాదా అని కొయ్యల రమణ ప్రశ్నించారు. వైసీపీలో చేరేది లేదని చెబితే.. తనను చాలా ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. కానీ ఎన్ని ఇబ్బందులొచ్చినా ఆదిరెడ్డి కుటుంబంతోనే ఉంటానని చెప్పానని, అందుకే కక్షగట్టి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. క్వారీ ఏరియాలో ఉన్న బూత్ లలో ఒక్కచోట కూడా భరత్ కి మెజార్టీ రాలేదన్నారు. సరిగ్గా మంత్రి లోకేష్ వచ్చేముందు తనను టార్గెట్ చేసి, బద్నాం చేయడం దారుణమన్నారు. మంత్రి నారా లోకేష్ వచ్చినపుడు తన వార్డు నుంచి జనం అధిక సంఖ్యలో వచ్చారని ఆయన గుర్తు చేశారు. జనం తమ వెంట ఉన్నారని అన్నారు. భరత్ చేసిన అభివృద్ధి ఏంటి?..భరత్ చేసిన అభివృద్ధి ఏమిటని కొయ్యల రమణ సూటిగా ప్రశ్నించారు. క్వారీ ఏరియాలో ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు వచ్చాక అభివృద్ధి వేగంగా జరుగుతోంది అన్నారు. వ్యక్తిగతంగా విమర్శించాలంటే తాను కూడా చాలా విషయాలు ప్రస్తావించాల్సి ఉంటుందని అన్నారు. మాట్లాడితే ఈవీఎం ఎమ్మెల్యే అంటున్నారని, మరి గతంలో భరత్, వారి పార్టీ 11 మంది ఎమ్మెల్యేలు ఎలా గెలిచారని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు వచ్చాయంటే ఈవీఎం ల మీదే నెగ్గారు కదా అని కొయ్యల రమణ ప్రశ్నించారు. అతను మాజీ, తాను మాజీయే కనుక తమ 45వ డివిజన్‌లో పోటీ చేద్దామని, ఎవరు గెలుస్తారో చూద్దాం..అందుకు భరత్ సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ తురకల నిర్మల మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో భరత్ చేసిందేమిటో అందరికీ తెల్సిందేనని అన్నారు. కూటమి హయాంలో చేస్తున్న అభివృద్ధిని చూడలేక ఎమ్మెల్యే వాసు మీద, ఆయన అనుచరులమీద ఆరోపణలు చేయడం దారుణమన్నారు. క్వారీ ఏరియా వాళ్లకు ఆవలో ఇచ్చిన పట్టాలు ఎందుకు పనికిరావని, కొత్తగ ఇళ్ల స్థలాల కోసం అప్లికేషన్ పెట్టుకోవడానికి వీలులేకుండా ఉందన్నారు. బేసరి చిన్ని మాట్లాడుతూ వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి విమర్శలు చేస్తే, తాము కూడా చాలా విషయాలు చెప్పగలమని అన్నారు. వారు చేసిన తప్పులేమిటో ముందుగా తెలుసుకోవాలన్నారు. తప్పులన్నీ వారివైపు పెట్టుకుని, తమ ఎమ్మెల్యే వాసు మీద, ఆయన అనుచరుల మీద విమర్శలు చేయడం తగదన్నారు. మీడియా సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు కేబుల్ మురళి, సందక లక్ష్మణరావు, కానేటి ప్రభుదాస్, బూరా కల్పన, పలివెల నవీన్ బాబు, బంగారు తాతారావు, ప్రభాకర్, ఏసురత్నం, పెద్దిబాబు, దేవాన రాజా, టైలర్ రాజు, బాలు, విజ్జన సుధాకర్, పల్లా ప్రకాష్, ఫొటో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుడు, ప్రముఖ కవి రవికుమార్ కు ఘన సన్మానం

- జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో అలరించిన రవి కుమార్ కు ప్రశంసలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సంస్కృతి శాఖ, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన 160 వ జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనంలో కవితాగానం చేసి అలరించిన ప్రముఖ కవి, రాజమండ్రి వీటీ జూనియర్ కళాశాల ఆంగ్ల భాషాధ్యాపకుడు నల్లి రవికుమార్ ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాజమహేంద్రవరం కమాండర్ ఏపీ ఎస్పీఎఫ్ ఎస్పీ డాక్టర్ కొండా నర్సింహారావు దంపతులు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ ఘనంగా సత్కరించారు. డాక్టర్ కొండా నరసింహారావు దంపతుల శంఖారావంతో సమ్మేళనాన్ని ప్రారంభించారు.? వివిధ రాష్ట్రాల నుంచి 126 మంది కవులు హాజరై తమ కవితా గానాలను వినిపించారు. అలాగే 30 మంది వివిధ కళలకు చెందిన కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించారు.? తన కవితాగానంతో అలరించి సత్కారం పొందిన అధ్యాపకుడు రవికుమార్ ను ఈ సందర్భంగా వీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే రాజా, సహచర అధ్యాపకులు, కుటుంబ సభ్యులు డాక్టర్ నల్లి సునీత, డాక్టర్ నల్లి సన్ షైన్, మేడిది కృపావరం అభినందించారు.

# బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాలకు గ్రైండర్, మిక్సీ వితరణ

-సామాజిక బాధ్యతతో విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటు మన బాధ్యత-హౌసింగ్ పీడీ నాతి బుజ్జి



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:సామాజిక బాధ్యతలో భాగంగా గిరిజన విద్యార్థుల సంక్షేమానికి సహకరించడం ప్రతి ప్రభుత్వ అధికారి కర్తవ్యమని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాతి బుజ్జి అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి రూ.12 వేలు విలువ చేసే గ్రైండర్, మిక్సీని సోమవారం ఆమె విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించిన హౌసింగ్ పీడీ నాతి బుజ్జి 'ముస్తాబు' కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. పరిశుభ్రత ఉంటే ఆరోగ్యం ఉంటుందని, ఆరోగ్యం ఉంటే ఆయుష్షు పెరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పని సరిగా పాటించాలని సూచించారు.అనంతరం 10వ తరగతి విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని అధిగమించాల్సిన అవసరాన్ని వివరించారు. సమయాన్ని వృథా చేయకుండా, ప్రతి రోజూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడంతో పాటు పునశ్చరణ చేసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. గ్రైండర్, మిక్సీ వితరణ చేసినందుకు గాను విద్యార్థినులు, పాఠశాల యాజమాన్యం, జిల్లా అధికారి జ్యోతి తదితరులు హౌసింగ్ పీడీ నాతి బుజ్జిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ విద్యాధికారి కేఎన్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీఐడీ కార్యాలయంలో డిజిటల్ భద్రతపై అవగాహన వర్క్‌షాప్




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై నేరాలు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పించే వర్క్‌షాప్‌ను రాజమహేంద్రవరం లోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆస్మా ఫరీన్, అదనపు పోలీసు సూపరింటెండెంట్, సీఐడీ, ప్రాంతీయ కార్యాలయం, రాజమహేంద్రవరం పర్యవేక్షణలో జరిగింది.ఈ సందర్భంగా చీఫ్ గెస్ట్‌గా పాల్గొన్న ఆస్మా ఫరీన్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని, ఉద్యోగులు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు, బాలికలపై నేరాల నివారణకు సంబంధిత చట్టాలపై అవగాహన తప్పని సరిగా ఉండాలని, మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటే విధి నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా వివిధ అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు.బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌ల వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలపై రాజమహేంద్రవరం లోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ కల్యాణ్ చక్రవర్తి వివరించారు. ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగంపై అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ట్రైనర్ సనబోయిన అశ్రిత్ కుమార్ అవగాహన కల్పించారు.మహిళలు, బాలికలపై నేరాలు, పోక్సో చట్టం అమలు అంశాలపై తూర్పు గోదావరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పేరిచర్ల సూర్య ప్రభావతి ప్రసంగించారు.స్ట్రెస్ తగ్గింపు, సమయ నిర్వహణ అంశాలపై రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన సైకాలజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం గోపాల కృష్ణ వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో సీఐడీ, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 25 న మనుస్మృతి దహన దినోత్సవం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** ఆంధ్రప్రదేశ్ జనచైతన్య మండలి, దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25న నగర పాలక సంస్థ ఆవరణ ప్రక్కన ఉన్న డాక్టర్ అంబేద్కర్ శిలావిగ్రహం వద్ద మనుస్మృతి దహన దినోత్సవాన్ని మానవ హక్కుల పరిరక్షణ దినంగా పాటించడం జరుగుతుందని జనచైతన్య మండలి వ్యవస్థాపకుడు పెయ్యల పావన్ ప్రసాద్ చెప్పారు. అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థను పెంపు చేసే ఆటవిక, అమానవీయ, దుర్మార్గ శిక్షాస్మృతే మనుస్మృతి అని, అది అసమానతలకు నిలయమని, అధర్మ శాస్త్రమని ధ్వజమెత్తారు. మనుస్మృతి ఆనాడుబహుజనుల హక్కులను హరించి వేసిందని అందుకనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1927 డిసెంబరు 25న మహద్ చెరువు నీటి కోసం జరిగిన పోరాటంలో మనుస్మృతిని బహిరంగంగా తగలబెట్టారని చెబుతూ, ఆ చారిత్రత్మాక రోజును బహుజనులంతా మానవహక్కుల పరిరక్షణ దినంగా పాటిస్తారని తెలిపారు. మనువాదులు తిరిగి మనుస్మృతిని భారత రాజ్యాంగంగా తీసుకురావాలని తీవ్రంగా కృషి చేస్తున్నారని, ఆ చర్యలను ఖండిస్తూ మనుస్మృతిని ఆ రోజు దహనం చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోడానికి బహుజనుల బాధ్యతను గుర్తు చేస్తామని పెయ్యల పావన్ ప్రసాద్ అన్నారు. బహుజనులంతా, ప్రజాస్వామ్య వాదులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు సీహెచ్ సుబ్బారావు, చిలుకోటి కూర్మయ్య, మర్రి బాబ్జి, నయనాల కృష్ణారావు, అనుసూరి ఆదినారాయణ, కోన లాజరు, గంటి వెంకటరమణ, జీవన్ సురేష్ కుమార్, కొంకి రమేష్, బందిల దుర్గాప్రసాద్, వేమవరపు శోభన్ బాబు, యలమంచిలి ప్రకాష్ కుమార్, పొనుకు చిరంజీవి, కే రామ్మోహన్, గుడిసె వనరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను కలిసిన దళిత గిరిజన సంఘాల నాయకులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి సామ్యూల్ జవహర్ ను దళిత గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మెస్ ఛార్జీలు, శాశ్వత భవనాలు, శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేసి మెరుగైన మౌలిక వసతులను కల్పించాలని, అలాగే ప్రతి నెల పౌరహక్కుల దినోత్సవం తప్పని సరిగా జరిపించాలని కోరుతూ వారొక వినతి పత్రం అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన కాశీ నవీన్ కుమార్ ని ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, పసలపూడి బోస్, ఆకుమర్తి చిన్న, కవులూరి వెంకటరావు, మల్లారపు సత్యానందం, కొమ్ము సత్తిబాబు, పసలపూడి శ్రీను, బేరి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## శాటిలైట్ సిటీ హైస్కూల్లో గణిత దినోత్సవం



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో సోమవారం గణిత దినోత్సవం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు అనేక మోడల్స్ ప్రదర్శించారు. మాథ్స్ రంగోలి లో విద్యార్థినీ విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్ ప్రశాంతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో ఉన్న లెక్కలు అంటే భయాన్ని పోగొడ్తాయని తెలిపారు. మ్యాథ్స్ టీచర్స్ సుసత్య రేఖ, సీహెచ్ రవికుమార్, ప్రభావతి, సునీత, కృష్ణవేణి, హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి నిజ జీవితంలో లెక్కల్ని ఉపయోగించే విధానాన్ని సులభంగా నేర్చుకోవడానికి వారి చేత అనేక మోడల్స్ ని ప్రదర్శించడం జరిగిందన్నారు. వినూత్నంగా రంగోలి ద్వారా వారిలో దాగున్న ప్రతిభను వెలికి తీయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.





## పశు గ్రాసం భారం

**యంత్రాలతో కోతలు కోయడం వలన పశువులకి పనికిరాని గడ్డిపంట పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం వల్ల నష్టం**



ముమ్మిడివరం(మనసులో మాట) డిసెంబరు 22:కూలీల కొరత తో రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు యంత్రాలు పై మొగ్గు చూపుతున్నారు. వరి కోత యంత్రాలతో గంటల వ్యవధిలోనే పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. కానీ యంత్రాలతో వరి కోత కోసిన గడ్డిని పొలం లోనే వదిలేస్తున్నారు. ఆ గడ్డికి నిప్పు పెట్టి ఆ పంట పొలం లోనే దహనం చేస్తున్నారు. దీంతో ఆ గడ్డి వృధా గా పోవడమే కాకుండా ఆ గడ్డి మంట పెట్టిన పొలానికి చేటు కలుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశు పోషణ కోసం పాడి రైతులకు భారంగా మారింది. పశువుల దాణా ధరలకు రెక్కలు రావడం తో పాడి రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. పశు వులకు దాణా గా ఉపయోగించే తవుడు, చిట్టు, ఉలవలు, వేరుశనగ పిండి, ఎండు గడ్డి, ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.వరి కోత యంత్రాలతో మాసూళ్ల చేయడం తో వరి గడ్డి ముక్క ముక్కలుగా నలిగిపోతుంది. దీంతో ఎక్కువ మంది రైతులు గడ్డి ని చేలల్లోనే దహనం చేసేస్తున్నారు. చేలల్లో గడ్డిని దహనం చేయడం వల్ల భూమికి ఉపయోగపడే సూక్ష్మ క్రీములు చనిపోయి నాట్లు వేసినప్పుడు వరి పైరు కు తెగిళ్ళు ఆశిస్తాయి. అందువల్ల చేలల్లో గడ్డిని దహనం చేయకుండా ఒబ్బిడి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


## జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో 29 ఫిర్యాదులు



**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా (మనసులో మాట), డిసెంబరు 22:** పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 29 ఫిర్యాదులు అందినట్టు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలను, ఫిర్యాదుదారులను స్వయంగా కలిశారు వారి సమస్యలను స్వయంగా అడిగి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో ప్రధానంగా కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, పాత కేసులకు సంబంధించినవి ఉన్నాయన్నారు.

**ముఖ్య అంశాలు:** ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి, తదుపరి వారంలోగా పురోగతి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని ప్రజలు పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడకుండా, తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలి. పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి ఎస్పీ స్పష్టం చేశారు.

## ట్రాన్స్ఫార్మర్ల తరలింపు కోసం స్థల పరిశీలన



**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 22..** అయినవిల్లి మండలంలో నిర్మిస్తున్న ఎలక్ట్రికల్ ప్రాజెక్టు కోసం ఏపీ ట్రాన్స్కో ఈఈ,ఏడీలు ట్రాన్స్ఫార్మర్లు తరలించడానికి స్థల పరిశీలన చేశారు. సోమవారం నేదునూరు మీదుగా అయినవిల్లి వెళ్లడానికి మురుగుకాలువ పెద్ద వంతెన ప్రక్కన ఉన్న ఉన్న చిన్న వంతెనను వారు పరీక్షించారు. అలాగే ప్రక్కనే విద్యుత్ పోల్స్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు .మురుగు కాలువ వంతెన వద్ద స్థలం పరిశీలించి పోల్స్ కు అవసరమైన మార్గాన్ని వారు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఈఈలు పుల్లయ్య, రామకృష్ణారెడ్డి ఏడిఈ మల్లికార్జునరావు మెఘా కంపెనీ మేనేజర్ వెంకటేశ్వరరావులు ఉన్నారు.

# భారతీయ జ్ఞాన పరంపర పునరుజ్జీవనానికి కృషి చేద్దాం

### -ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ విభాగం జాతీయ సమన్వయకర్త గంటి సూర్యనారాయణ మూర్తి






**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** ప్రాచీన భారతీయ విజ్ఞానం ఎంతో గొప్పదని, దానిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని, భారతీయ జ్ఞాన పరంపర పునరుజ్జీవనానికి కృషి చేద్దామని భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ విభాగం జాతీయ సమన్వయకర్త గంటి సూర్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో విద్యా భారతి ఉచ్చా శిక్షా సంస్థాన్ (వీబస్) నోయిడా సహకారంతో "రిక్లైమింగ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ : ది వే ఫార్వర్డ్" అనే అంశంపై జాతీయ సెమినార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షునిగా రిజిస్ట్రార్ ఆచార్య కేవీస్వామి వ్యవహరించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ విభాగం జాతీయ సమన్వయకర్త గంటి సూర్యనారాయణ మూర్తి, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పీ సురేష్ వర్మ, నేషనల్ సెమినార్ కన్వీనర్లు ప్రొఫెసర్ కేఎస్ రమేష్, ప్రొఫెసర్ డీ జ్యోతిర్మయి, డాక్టర్ ఎన్ సజ్నా రాజ్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ విభాగం జాతీయ సమన్వయకర్త గంటి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపరను పునరుజ్జీవింపజేసి తిరిగి పొందాల్సిన తరువాత తరాలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ కి పునాది భారతీయ జ్ఞానపరంపరతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యాచరణలో భారతీయ దృష్టిని సమన్వయం చేసి ముందుకు సాగాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 లో భాగంగా భారతీయ జ్ఞాన పరంపరకు పెద్దపీట వేయబడిందని, దానిలో భాగంగా విద్యా విధానంలో భారతీయ జ్ఞాన పరంపర దృష్టిని అంతర్లీనం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. భారతీయ జ్ఞాన పరంపరని అందుకోవడానికి ప్రయత్నించే ఆచార్యులకు, విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని, వాటి వివరాలు కోసం ఐఎంఎఅఅఐఖు.శీతీస్త్ర అఫీషియల్ వెబ్ సైన్ ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ పూర్వకాలం నుండి విద్య, వైద్యం, సంపదలు, సంస్కృతి, సంప్రదాయాలలో భారతదేశం ఉన్నత స్థానంలో ఉండేదని గుర్తు చేశారు. ఆయుర్వేద, హోమియోపతి, నాచురోపతి వంటి వైద్య విధానాలు భారతదేశంలో ప్రాచుర్యం పొందాయన్నారు. తన బాల్యంలో నాడి పెట్టుకుని ఆరోగ్య సమస్య ఏమిటో చెప్పి, దానికి తగిన వైద్యాన్ని అందించే వైద్యులు ఉండేవారని చెప్పారు. ఆచార్య కే శ్రీరమేష్ మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతదేశానికి రాక ముందు భారత దేశం సంపన్న దేశమని అన్నారు. పాశ్చాత్య విజ్ఞానం కంటే భారత విజ్ఞానం గొప్పదని దానిని భవితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. స్పిరిచ్యువల్ నాలెడ్జ్ మాత్రమే కాకుండా మెటీరియల్ నాలెడ్జ్ ను సంపాధించుకోవాలన్నారు. మండువా లోగిళ్ళలో ఉన్న ప్రయోజనకరమైన శాస్త్రీయ అంశాలను తెలియజేశారు. డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పీ సురేష్ వర్మ మాట్లాడుతూ భారతీయ విద్యా వ్యవస్థ చాలా గొప్పదని, గురుకులాలు, నలందా విశ్వవిద్యాలయం వంటి గొప్ప విద్యా సంస్థలు ఉన్న దేశం భారత దేశమన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ భారతీయ జ్ఞానాన్ని పునరుద్ధరిస్తుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. తరువాత అతిథులను సన్మానించి నన్నయ జ్ఞాపికను అందించి అభినందించారు. మధ్యాహ్నం బీఓఎస్ చైర్మన్ లతో సమావేశంలో ఏర్పాటు చేసి భారతీయ జ్ఞాన వ్యవస్థలను తిరిగి పొందడం, ముందుకు సాగే మార్గలపై చర్చించారు. కార్యక్రమంలో యూజీ, పీజీ బీఓఎస్ చైర్మన్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కాపవరం హైస్కూల్ విద్యార్థిని సిరి దుర్గ



**అనపర్తి మనసులో మాట) డిసెంబర్ 22:** ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో కెరీర్ ఎక్స్ పో మరియు ప్రదర్శన పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో "మై కెరీర్ మై ఫ్యూచర్" అనే అంశంపై పోస్టర్ ను వివరించే పోటీలో బిక్కవోలు మండలం కాపవరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న సోడసాని సిరిదుర్గ చక్కని ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమస్థానం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు పి. గోపాలకృష్ణారావు తెలియజేశారు. రాజమండ్రిలో జరిగిన పోటీలో ఈ విభాగం లో ఒక్కరిని మాత్రమే ఎంపిక చేసారని, ఈ గట్టి పోటీలో సిరి దుర్గ ఎంపిక కావడం చాలా గొప్ప విషయం అని త్వరలో విజయవాడలో జరగబోయే పోటీల్లో, తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొని రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి కాపవరం పాఠశాలకు జిల్లాకు పేరు తీసుకురావాలని కోరుకుంటూ మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు కె.వీరరాఘవరెడ్డి, టి.వి.ఎస్.ఎన్ రెడ్డి,వై.బి.యస్.ఆచార్యులు, యస్.రవికుమార్, సి.హెచ్ కోమలి , కె.రవిభాస్కర రెడ్డి, డి.లోవకుమారి, సి.హెచ్.చైతన్య, డి రవిబాబు మరియు అధికారులు, పెద్దలు అభినందించారు.

# కలెక్టరేట్ పీజీఆర్ఎస్ లో 240 అర్జీలు

### - గ్రీవెన్స్‌లను ఎస్ఎల్ఏ గడువులోపే పరిష్కరించాలి - జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** గ్రీవెన్స్‌లను ఆర్థిక సంబంధిత ఫిర్యాదులు, ఆర్థికేతర ఫిర్యాదులుగా విభజించడం జరిగిందని, గ్రీవెన్స్‌లో అందే ప్రతి అర్జీని నిర్దేశిత ఎస్ఎల్ఏ గడువును మించకుండా పరిష్కరించాల్సిందే అని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్ లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ ఆర్థిక సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో కొంత ఆలస్యం జరిగినా సహించవచ్చుని, అయితే ఆర్థికేతర ఫిర్యాదులు మాత్రం తప్పని సరిగా ఎస్ఎల్ఏ గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, ఏపీ ఈపీడీసీఎల్, రెవెన్యూ, సర్వే, ఆర్ అండ్ బి, పంచాయితీ రాజ్, రిజిస్ట్రేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, ఐసీడీఎస్ శాఖల్లో ఎస్-ఎల్ఏ గడువును మించి పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్‌లు ఎందుకు ఉన్నాయో సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. పెండెన్సీని తగ్గిస్తూ, అన్ని అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ మేఘా స్వరూప్ స్పష్టం చేశారు. ఎండార్స్‌మెంట్‌ను స్పష్టంగా, సరైన విధంగా ఇవ్వాలని, సమస్యను పూర్తిగా అధ్యయనం చేసి క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల హెచ్‌ఓడీలు ప్రత్యేక దృష్టి సారించినప్పుడే గ్రీవెన్స్‌లకు నాణ్యమైన, సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 240 దరఖాస్తులు స్వీకరించారు. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు 106, పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖకు 68, హోమ్ శాఖకు 16, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు 9, మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖకు 5, పరిశ్రమలు-వాణిజ్యం, వ్యవసాయం, సహకారం, మానవ వనరులు (పాఠశాల విద్య) శాఖలకు తలో 3 చొప్పున, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, హౌసింగ్, వినియోగదారుల వ్యవహారాలుఆహారంపౌర సరఫరాలు శాఖలకు రెండేసి చొప్పున, అలాగే శక్తి శాఖకు 1 దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి, ఎస్డీసీ కే భాస్కర్ రెడ్డి, వీ భాగ్యవతి, సీపీఓ ఎల్ అప్పల కొండ, డీఎస్పీ విద్య, డీడీఓ వీ శాంతామణి, డీఎస్వో వీ పార్వతి, డీఐపీఆర్వో కే లక్ష్మీ నారాయణ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తి, జిల్లా సర్వే అధికారి బీ లక్ష్మీ నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు పాల్గొన్నారు.

# నాటుసారాతో పట్టుబడ్డ వ్యక్తి



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 22..** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకుఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు ఉండకూడదని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దానిలో భాగంగా జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు మండలంలో విస్తృతంగా పర్యటించి ఈరోజు జగ్గంపేట నుండి గోకవరం పోవు రోడ్డులో పోలవరం కెనాల్ దగ్గర్లో తోట మణి స్వామి కాట్రావులపల్లి గ్రామం,ప్రస్తుతం జగనన్న కాలనీ పెద్దాపురం లో నివాసం ఉంటున్న ఆ వ్యక్తిని 20 లీటర్ల నాటు సారా తో పట్టుబడడం జరిగింది.అతని వద్ద నున్న మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం అతనిని అరెస్ట్ చేయడం జరిగింది ఇతని మీద ఇప్పడి వరకు 10 పాత ఇతర నేరంలు కూడా కలవు.తదుపరి అతనిను పెద్దాపురం కోర్టులో ప్రొడ్యూస్ చేయగా ఇతనికి 05.01.2026 తేదీ వరకు రిమాండ్ విధించిన నిమిత్తం పెద్దాపురం సబ్ జైల్ కు తరలించడం జరిగింది.



## రామానుజన్ కు విద్యార్థుల ఘన నివాళి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులు ఘన నివాళులర్పించారు. స్థానిక దానవాయి పేట నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఐజాక్ బాబు మాట్లాడుతూ గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను వివరించారు..1729 సంఖ్య ఆవ్యశకతను వివరించి విద్యార్థులు ఆ నెంబర్ ఆకృతిలో కూర్చుని కార్యక్రమానికి వన్నె తెచ్చారు.

## హోమియోపతి వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు పూర్తి నివారణ




ప్రత్తిపాడు ( మనసులోమాట) డిసెంబర్ 22.. హోమియోపతి వైద్యంతో దీర్ఘకాలికంగా ఉన్న అనారోగ్యాలు పూర్తిగా నయమవుతాయని అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం స్వామీజీ ద ఫౌండర్ రామానంద స్వామీజీ అన్నారు .సోమవారం ఉదయం మండలంలోని రాచపల్లి గ్రామంలోని శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవాలయంలో విశ్వమానవత సంస్థ నిర్వహించిన హోమియోపతి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు .ఈ శిబిరంలో ప్రత్తిపాడు కు చెందిన ఎల్.వి హోమియో క్లినిక్ డాక్టర్ మంతెన లక్ష్మీ వినీల . పివి రావువర్మలు వైద్య శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో దీర్ఘకాలిక రోగాలు అధికమై అనేకమంది మధ్య వయసులోనే మరణిస్తున్నారన్నారని హోమియోపతి వైద్యం వాడితే పూర్తి నివారణ కలుగుతుందని ఆయన అన్నారు . విశ్వమానవవత సంస్థ ఫౌండర్ చైర్మన్ శ్రీ అల్లూరి శ్రీనివాస్ చౌదరి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల వల్ల రాష్ట్రంలో అనేకమందికి దీర్ఘకాలిక వ్యాధులు నివారణ జరగడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విశ్వమానవత సంస్థ వారు అందిస్తున్న హోమియోపతి వైద్య సేవలను అభినందించారు. ప్రతి 15 రోజులకు ఈ వైద్య శిబిరం అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతుందని రాచపల్లి సమీప గ్రామాల ప్రజలు హోమియోపతి వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వమానత సంస్థ వాలంటర్ వత్సవాయ రమేష్ దేవస్థాన వాలంటీర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి ఉచిత హోమియోపతి మందులను అందించారు.

## దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 22:** కోరంగి పంచాయతీ సీతారామపురం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లోని దివ్యాంగులకు వైఎస్సార్సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతీయేటా దివ్యాంగులకు వీటిని పంపిణీ చేయడం జరుగుతుందని, అయితే ఆదివారం శెలవురోజు కావడంతో సోమవారం పంపిణీ చేసినట్లు గోవిందకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇంఛార్జ్ ఎంజె గోపాలరావు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, వైఎస్సార్సీపీ నాయకులు దడాల జగదీశ్వరరావు. కామాడి భైరవమూర్తి. నేల శ్రీను, నేరేడిమిల్లి స్వామి, పోల్నాటి కృష్ణ, శీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బావ వరం గ్రామంలో హిందూ సమ్మేళనం

**ముఖ్యఅతిథిగా యోగి సిద్ధరామయ్య విశిష్ట అతిథిగా పాలచర్ల నాగేంద్ర చౌదరి**



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 22..** జగ్గంపేట మండలం భావవరం గ్రామంలో దుర్గమ్మ వారి గుడి వద్ద నరేంద్ర పట్నం ఉపమండలం హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యోగి సిద్ధరామయ్య, విశిష్ట అతిథిగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు, ముఖ్య వర్తగా డాక్టర్ తిరుపతిరావు, హాజరయ్యారు. ఈ సందర్భంగా గడప లోపల కులం, గడప దాటితే హిందువులం అనే నినాదంతో ఈ హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని సనాతన ధర్మం, గోసంరక్షణ, హిందూ సంస్కృతి సంప్రదాయం కాపాడటమే లక్ష్యంగా హిందువులందరూ పనిచేయాలని ప్రతి ఒక్కరూ భగవద్గీత, ఇతిహాసాలను చదవాలని పాలచర్ల నాగేంద్ర చౌదరి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందువులందరికీ శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఆలయ పార్కింగ్ స్థలం ప్రైవేట్ వ్యక్తుల పరం

**పిఠాపురం, (మనసులో మాట)డిసెంబరు22:** పిఠాపురం పట్టణంలోని ప్రసిద్ధ కుంతి మాధవస్వామి ఆలయం వద్ద భక్తుల పార్కింగ్ నిమిత్తం కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు దుర్వినియోగం చేయడంపై ఆలయ అధికారులు దృష్టి సారించారు. ప్రైవేటు వాహనాలను రోజులు, వారాల తరబడి దీర్ఘకాలంగా ఆలయ పార్కింగ్ స్థలంలో విడిచిపెట్టడం వలన ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆలయ అధికారులు సోమవారం కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇకపై ప్రభుత్వ దేవాదాయ స్థలాలలో ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలను పార్క్ చేయకూడదని, తక్షణమే వాటిని అక్కడి నుండి తొలగించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) నున్నా శ్రీరాములు స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను పాటించని వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. భక్తుల సౌకర్యార్థం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదంటూ, చాలాకాలంగా పార్కింగ్ స్థలంలో ఉంచిన పలు వాహనాలపై నోటీసులు అంటించారు.

## తాళ్లరేవులో ఘనంగా పీవీ రావు వర్ధంతి



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 22:** దళిత ఉద్యమనేత, అంబేడ్కర్ ఆశయసాధన కోసం నిరంతరం పోరాడిన పీవీ రావు వర్ధంతిని సోమవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ వద్దగల ఆయన విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళితజాతి ఉద్ధరణకు పీవీ రావు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు దడాల జగదీశ్వరరావు, జక్కల ప్రసాద్, దడాల బుజ్జిబాబు, గోడి భాస్కరరావు, వస్కారెడ్డి, పెయ్యల కొండబాబు, దున్నా మురళి, గంటా గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 అర్జీలు




**పిఠాపురం, (మనసులో మాట)డిసెంబరు 22:** పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఅర్ ఎస్) కార్యక్రమంలో భాగంగా పాడా పీడీ శ్రీనివాసరావు పాల్గొని, నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై నేరుగా విన్నపాలు సమర్పించారు.

ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నేటి కార్యక్రమంలో మొత్తం 20 అర్జీలు అందినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 5, పోలీస్ శాఖకు 2, మునిసిపాలిటీకి సంబంధించి 4, ఇతర శాఖలకు చెందినవి 6 అర్జీలతో పాటు 3 ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చాయన్నారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

1100 నంబర్‌కు కాల్ చేసి స్థితిగతులు తెలుసుకోవచ్చు: అర్జీదారులు తమ ఫిర్యాదుల నమోదు గురించి లేదా గతంలో నమోదైన అర్జీల స్థితిగతులు సమాచారం తెలుసుకోవాలంటే నేరుగా 1100 (వన్ వన్ జీరో జీరో) నంబర్‌కు కాల్ చేయవచ్చని పీడీ సూచించారు. ప్రభుత్వ సేవలపై పారదర్శకత పెంచేందుకే ఈ సదుపాయం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన సైన్స్ ఫెయిర్

### -విద్యార్థులలో సృజనాత్మకత ను ప్రోత్సహించాలి - పరిశోధన పట్ల వారిలో ఆసక్తి పెంచాలి - జిల్లా ఇంచార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్






**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 22:** తూర్పు గోదావరి జిల్లా శ్రీ సత్య సాయి గురుకులంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ సోమవారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేసిన ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు. "ఈరోజు నేను ఇక్కడ, ఈ స్థితిలో ఉండటానికి కారణం నా జీవితంలో నాకు చదువు చెప్పిన గురువులే అన్నారు. వారి కృషి వల్లనే మనం జ్ఞాన స్వరూపులుగా, సామాజిక బాధ్యతగల వ్యక్తులుగా ఎదగగలము. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు భావి శాస్త్ర వేత్తలుగా, పరిశోధకులుగా ఎదిగేందుకు కృషి చేయాలి. ప్రపంచంలోనే ఎక్కువ మంది యువత ఉన్న దేశం మన భారత దేశం అన్నారు. ఈ యువతను సక్రమంగా మార్గనిర్దేశం చేస్తే నూతన సాంకేతిక పరిజ్ఞానం అనుసరించి ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. ఎవ్వరూ పరిపూర్ణ విజ్ఞాన వంతులు కాదు, అందుకే ప్రతి విద్యార్థి నిత్య విద్యార్థిగా ఉండి కొత్త ఆవిష్కరణలకు సంబంధించిన పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకోవాలి." అన్నారు. విద్యార్థులకు అగ్రికల్చరల్ సస్టైనబిలిటీ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టమని సూచించారు. "మన దేశంలో అనేక ఆహార పంటలు రసాయనాల వాడకంతో కలుషిత మవుతున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో ఆర్గానిక్ పంటలు, చెత్త నుండి సంపద తేడా తగ్గించే మార్గాలపై దృష్టి పెట్టడం అవసరం. ఇళ్లలోనే కంపోస్ట్ ఎరువులు తయారు చేసుకునే విధంగా ఆలోచించాలి. పరిశుభ్రత, క్రమశిక్షణతోనే మన ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి" అన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి, సూచనలు ఇచ్చారు. జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ యాజమాన్యాల పాఠశాలల నుండి మొత్తం 230 ప్రాజెక్టులతో విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వీటిలో 11 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక అయ్యాయని తెలిపారు. సైన్స్ ఫెయిర్ ను తిలకించిన ఎంపీ పురందేశ్వరి..కాగా సోమవారం ఉదయం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సైన్స్ ఫెయిర్ ను తిలకించారు. విద్యార్థుల ఆలోచనలను, మేధా శక్తికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక్కో ప్రాజెక్టును నిశితంగా ఎంపీ పరిశీలించారు. ఆ ప్రాజెక్టు తయారీ విధానం, పనిచేసే తీరును విద్యార్థులు ఎంపీకి వివరిస్తున్నప్పుడు ఆమె ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు. కాగా ముగింపోత్సవ ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి గురుకులం కరెస్పాండెంట్ శ్యామ సుందర్, ప్రిన్సిపల్ గురయ్య, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే వాసుదేవరావు, కొవ్వూరు డివిజన్ డీవైఈఓ బీ దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎన్ఎస్ నెహ్రూ, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహ కార్యదర్శి కోలా సత్యనారాయణ, మంగిన రామారావు, టీ రామానుజం, రమణా రావు, ఎస్ఎల్వీ రమేష్, కమిటీ సభ్యులు వైవీ రామారావు, టీ చక్రధర్, ఎస్ రవికుమార్, ఏ మల్లేశ్వర రావు, జాన్సన్ మునీశ్వర రావు, వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ కు 556 అర్జీలు..



**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 22:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల అధిక ప్రాధాన్యతనిస్తూ సకాలంలో పరిష్కరించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లా స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్ఓ జే వెంకటరరావు, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్ శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జీ రత్నమణి, సీపీవో పీ త్రినాథ్ తదితర అధికారుల హాజరై కాకినాడ చుట్టుపక్కల ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జేసీ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డు లలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, అన్నదాత సుఖీభవ పథకం వంటి అంశాలపై మొత్తం 556 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలకు తగిన పరిష్కారం చూపాలన్నారు. ఆయా శాఖలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, తప్పని సరిగా నిర్ణీత గడువులోగ పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జీదారులు, తమ యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుడు హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి - జెసిటీ



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 22:** ప్రతి వినియోగదారుడు వారి హక్కులు బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి పిలుపు నిచ్చారు. సోమవారం అమలాపురం రూరల్ సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జాతీయ వినియో గదారుల వారో త్సవాలను పురస్కరించుకొని వినియోగదారుల అవగాహన సద స్సును జిల్లాస్థాయి అధికారులు పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు, సేవలను పొందే హక్కు ప్రతి వినియోగదారుడికీ ఉందని అదే విధంగా సరైన సమా చారం తెలుసుకుని, బిల్లు లు తీసుకుని, మోసాలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండటం వినియోగదారుని బాధ్యత అన్నారు. వినియో గదారుల హక్కులు, ఫిర్యా దు పరిష్కార విధానాలు, డిజిటల్ లావాదేవీలలో భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పిం చాలన్నారు. అవగాహన కలిగిన వినియోగదారుడే బలమైన సమాజానికి పునాదన్నారు.అవగాహన కలిగిన వినియోగదారుడే శక్తివంతమైన వినియోగదా రుడు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసు కుని, బాధ్యతాయుతంగా వ్యవ హరించాలన్నారు ఈ వారోత్సవాల ద్వారా విని యోగదారులకు మోసాల నుండి రక్షణ, న్యాయం పొందే మార్గా లు తెలియ జేయాలన్నారు. వినియోగదారులకు తమ ఉన్న హక్కుల ద్వారా సురక్షిత ఉత్పత్తులు, సమాచారం, ఎంపిక, ఫిర్యాదు పరిష్కా రం తెలియజేసి, మోసాలు, లోపాలు గుర్తించే అవకాశం పై ఈ వారోత్సవాల ద్వారా అవగాహన పెంపొం దించాలన్నారు. ఈ చర్యలు వ్యాపారులు నైతిక పద్ధతులు పాటించేలా ప్రోత్స హిస్తాయన్నారు. డిఆర్ఓ కే మాధవి ప్రసంగిస్తూ డిజిటల్ ఫిర్యాదుల పరిష్కారం వంటి ఆధునిక సాంకే తికతలపై దృష్టి సారించా లన్నారు.పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వపు పో టీలు నిర్వహించి విద్యా ర్థులను జాగృతం చేయాల న్నారు ఫొటో ప్రదర్శనలు, సమావేశాల ద్వారా హక్కులను వివరించాల న్నారు. వినియోగ దారులు కొనుగోళ్లలో మేల్కొని, వస్తువుల నాణ్యత, ధరలు తనిఖీ చేసుకోవాలన్నారు వాణిజ్యంలో పారదర్శకత పెరుగుతుందనీ. దీర్ఘకాలంలో వినియోగదారుల శక్తి, న్యాయ సంరక్షణ విధానాలు మెరుగు పడతాయన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ ఉదయ భాస్కర్ ప్రసంగిస్తూ వినియోగదారు లు తూకాలు, కొలతల్లో జరిగే మోసాల పట్ల అప్ర మత్తంగా ఉండాలన్నారు రైతులు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలను సంవ త్సరానికి ఒకసారి లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా సీలింగ్ చేయిం చుకోవాలని సూచిం చారు. ఎరువులు, ఇతర వస్తువు లు కొనుగోలు చేసే సమ యంలో వినియోగదారులు తూకం సరిగా ఉందో లేదో పరిశీలించాలన్నారు. తూకం లేదా కొలతల్లో తేడాలు ఉంటే మోసాలపై వెంటనే సంబంధిత అధి కారులకు, లేదా 1967 లేదా 1915 నంబర్కు ఫిర్యాదు చేయా లని కోరారు. అధికా రులు పలు దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలు తనిఖీలు నిర్వహిస్తూ కచ్చిత త్వంతో ఉండేటట్లు, పర్య వేక్షణ వ్యవస్థను బలో పేతం చేసుకోవాలన్నారు. తూని కలు కొలతలు శాఖ నియం త్రణ అధికారి విశ్వే శ్వరరా వు మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ఎలక్ట్రానిక్ కాటాలు తూకాలు సక్ర మంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాల న్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య మాట్లాడుతూ కొనుగోలు చేసిన పదార్థాలు తాజాగా ఉన్నాయా లేదా కాలం చెల్లిందా అనేది పరిశీలిం చాలన్నారు. జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు రహదారి భద్రత పట్ల స్ఫూర్తి దాయకమైన ప్రసంగాన్ని చేసి ఐదుగురు ఉపాధ్యా యులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు కోకోపేట్ చైర్మన్ అరికెల బల రామ మూర్తి శ్రీనివాస్ నగేష్ బీవీ సత్యనారాయణ అభిరాశీ లను సన్మానించారు. 24 మంది విద్యార్థులకు బహుమతి ప్రధా నం చేశారు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులుగా 5000 3000, 2000 నగదు మరియు ప్రశంసా పత్రాలు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా బహుకరించారు తూనికలు కొలతలు శాఖ వైజ్ఞానిక ప్రదర్శనను ఆహ్వానితులందరూ తిలకించారు. ఈ కార్యక్ర మంలో ఆయిల్ సేల్స్ ఆఫీసర్ శ్రీనివాస ప్రణతి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.





## 1729 ఆకారం లో విద్యార్థులు

ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 22ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నేడు జాతీయ గణిత దినోత్సవం ను ముమ్మిడివరం మండలం కోమానపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. రాంబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. రామానుజన్ ఆవిష్కరించిన సంఖ్య 1729 ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి రామానుజన్ వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఏ.ఎస్. డి. వి.వి.ఎస్ ప్రసాద్ ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కే.ఎన్. వి త్రిమూర్తులు, ఆర్. నాగార్జునరావు, ఎస్. ఎన్. మునేశ్వరరావు, పి సూర్యనారాయణమ్మ, పి శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, పి. టి. వి. బి వర్మ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతారామపురం డ్రీమ్ వే స్కూల్లో ఘనంగా గణిత దినోత్సవం




తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు22:గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని పుర్కరించుకుని సీతారామపురం డ్రీమ్ వే ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గణిత ప్రదర్శన, క్విజ్పోటీలు, వ్రాత పరీక్షలు నిర్వహించారు. గణిత ప్రదర్శనలో విద్యార్థులు అనేక అంశాలను ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులలో గణితంపై ఆసక్తి పెంపొందించడం తో పాటు తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కొప్పాడి మోహన్ కుమార్ తెలిపారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 22: ముమ్మిడివరం లో పలు పాఠశాలల్లో సోమవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక భాష్యం పాఠశాలలో గణిత వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఛాంప్స్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర గొప్పతనాన్ని, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు గణిత వస్తు ప్రదర్శనశాల నిర్వహించారు. సుమారు 100 కి పైగా గణిత వస్తు ప్రదర్శనశాల నిర్వహించి, తోటి విద్యార్థులకు చక్కగా వివరించారు. మానవాళి పెరుగుదలలో గణితం ప్రాముఖ్యత గురించి ప్రిన్సిపాల్ నాగేంద్ర విద్యార్థులకు వివరించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కృషి పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరూ ప్రయోజకులవుతారు - శిరీష



**పల్నాడు, డిసెంబర్ 22,( మనసులో మాట ):** ఒక భారతీయుడు గణిత శాస్త్రజ్ఞుడు సంఖ్యా సిద్ధాంతంలో సుప్రసిద్ధుడు శ్రీనివాస రామానుజ అని శ్రీ వివేకానంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ శిరీష అన్నారు. సోమవారం సుమారు 200 మంది విద్యార్థులతో గణిత శాస్త్ర ఎగ్జిబిషను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శుద్ధ గణితంలో ఈయనకు శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ, సంఖ్యా శాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి రామానుజమని అన్నారు. విద్యార్థులు కృషి పట్టుదలతో ఎన్నో ప్రయోగాలు చేసి ఎగ్జిబిషన్ ని ఏర్పాటు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారన్నారు. ఈ ఎగ్జిబిషన్ తయారీకి సహకరించిన గణిత ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అంటే ఆటపాటలతో పాటు జ్ఞానం,విజ్ఞానం, గణితం, నేర్చుకొని విద్యారంగంలో గొప్పగా ఎదగాలన్నారు. కృషి పట్టుదల ఉంటే మీలో ప్రతి ఒక్కరూ రామానుజమే అన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు తులసి, కావ్య, పద్మ, నాగరాజు, త్రివేణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, జనార్ధనలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మహాత్మా.. మమ్మల్ని క్షమించు

- నిన్ను మరొకసారి చంపేశారు
- మోదీ గద్దె దిగే వరకు మా పోరాటం ఆగదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు
- వికసిత్ భారత్ జి రామ్ జి బిల్లును రద్దు చేయాలని సీపీఐ బీకేఎంయూ అర్ధనగ్న ప్రదర్శన
- కాకినాడలో మోకాళ్లతో గాంధీ బొమ్మ వద్ద నిరసన







కాకినాడ (మనసులో మాట(, డిసెంబరు 22:భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చడంపై నిరసిస్తూ సోమవారం సాయంత్రం స్థానిక గాంధీ బొమ్మ వద్ద మోకాళ్ళతో నిరసన చేపట్టారు. అంతకు ముందు రామారావు పేట సెంటర్ నుండి పార్క్ వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, ఉప్పు సత్యాగ్రహ నేత, కుల మతాలకతీతంగా తన ఊపిరి వరకు ప్రజల కోసమే పనిచేసిన మహానుభావుడు అడుగుజాడల్లో నడవవలసిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆయన ఆనవాళ్లు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి, నిధులు ఎగ్గొట్టడానికే కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే ఆ మహాత్ముని పేరు తొలగించి వికసిత్ భారత్ జీ రామ్ జీ కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తోందని, ఆ మహాత్మా గాంధీ ఏం తప్పు చేశాడని పేరు మారుస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలంతా చేయడానికి పని లేక, తినడానికి తిండి లేక సొంత ఊళ్లు ఖాళీ చేసి వలసలు వెళ్లే పరిస్థితి దాపురించిందని, అటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి దొరుకుతుందని సంతృప్తిపడేలోపే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే కూలీలకు పనులు లేకుండా పస్తులు ఉండే పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని అన్నారు, ఓడ దాటే వరకూ ఓడ మల్లన్న.. ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న చందంగా ప్రభుత్వం తయారయిందని ధ్వజమెత్తారు. కొత్త ఉపాధి పరిస్థితి దేవుడేరుగని, కూలీలు ఉపాధి ఎగ్గొట్టేందుకే పేరు మార్పు అని, నిధులు నిలుపుదల చేసేందుకు ఈ కుట్ర అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలను బ్రతకనివ్వండి అని, అర్థాకలికి గురి చేయవద్దని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని మధు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు, సాకా రామకృష్ణ, సభ్యులు కేవీ రామయ్య, ఆనంద్ రావు, మధు, బొబ్బిలి ఈశ్వరరావు, బంగారు రాజేష్, మీసాల చక్రవర్తి, నిమ్మకాయల ఈశ్వరరావు, బంగారు హరికృష్ణ, కుమారి, నాగమణి, కొండ తదితర మహిళలు పాల్గొన్నారు.



## మహాసంస్థానంలో నృసింహ సరస్వతి స్వామి జయంతి వేడుకలు

**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 22:** కలియుగంలో దత్తాత్రేయను రెండో అవతారంగా భక్తులు కొలిచే నృసింహ సరస్వతి స్వామి జయంతి పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నృసింహ సరస్వతి స్వామి జయంతి సందర్భంగా మహాసంస్థానంలో స్వామి వారికి విశేష అభిషేకాలు పూజలు, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు . నృసింహ సరస్వతి జయంతిని పురస్కరించుకుని దత్త హెూమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీపాద శ్రీ వల్లభ దత్తాత్రేయ స్వామివారిలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆర్ సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హార్వెస్ట్ పాఠశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం




**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 22:** ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 22న స్థానిక హార్వెస్ట్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, గణితంపై ఉన్న ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల గణిత ఆకారాలను తయారు చేసి, వాటి ప్రాముఖ్యతను తోటి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన తీరు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే అంకెలతో ఆటలు, భిన్నాల సూత్రాలను అతి సులభంగా ఎలా అర్థం చేసుకోవాలో గణిత ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు.

గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్స్ పి. సత్యమోహన్ రెడ్డి, వి. సత్య నంద రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నిత్య జీవితంలో గణితం యొక్క ప్రాముఖ్యతను, రామానుజన్ సాధించిన విజయాలను వారు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్, రవీంద్రలతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముమ్మిడివరం ఎమ్మెల్యేను కలిసిన గంధం పళ్ళంరాజు



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 22:** ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు ను మర్యాదపూర్వకంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు సోమవారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, టిడిపి నాయకులు తాడి నరసింహ రావు, దొరబాబు, కొమ్మల సురేష్, ఇందుగుల ఆనంద్ లతో పాటు పలువురు ఉన్నారు

# అనారోగ్య బాధితులను ఆదుకోవడమే తన లక్ష్యం

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు మనసులో మాట డిసెంబరు 22..** సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనదనీ కానీ అనేక కారణాల వల్ల పేదలు, కార్మిక వర్గానికి చెందిన వారు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారనీ అలాంటి బాధితులకు అండగా నిలవడమే తన జీవిత లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం మండలంలోని అయితపూడి గ్రామానికి వచ్చిన మంత్రి సుభాష్ బ్రెయిన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మందపల్లి లోవరాజుకు 15వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయ రంగంలోకి వచ్చిన తాను, మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత, కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నానీ. ముఖ్యంగా పరిశ్రమల్లో పని చేసే కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు వారికి సరైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా కృషి చేస్తున్నాఅనారోగ్యం కారణంగా ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు ధైర్యం చెప్పి, వారికి అవసరమైన సహాయాన్ని అందించడంలో కార్యకర్తల చెప్పిన వారికి ఆర్థిక సాయం చేస్తున్నానీ తెలిపారుప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఆయన ప్రత్యేకత. ఆసుపత్రులను సందర్శించి బాధితులను పరామర్శించడం, అవసరమైన వైద్య ఖర్చులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాలు ఆయన మానవతా దృక్పథానికి నిదర్శనం. "ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర అభివృద్ధికి మూలాధారం" అన్న నమ్మకంతో ముందుకు సాగుతుందని తెలిపారు. అనారోగ్య బాధితులను ఆదుకోవడమే తన లక్ష్యమని పదేపదే నిరూపిస్తున్న వాసంశెట్టి సుభాష్, రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ఒక సేవాభావం కలిగిన వ్యక్తిగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారనీ పెనుమళ్ళ సహకార సంఘ అధ్యక్షుడు కొల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన చేస్తున్న సేవలు మరెందరికో ప్రేరణగా నిలుస్తూ, సమాజంలో మానవత్వం విలువను చాటుతున్నాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బొండా వెంకన్న సర్పంచు పెద్దిరెడ్డి చంద్రావు మాజీ ఎంపీటీసీ పెద్దిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు రాయుడు విజయ్ కుమార్ చౌదళ్ళ రాజు పాలిక శీను బాబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకత వారు ఉన్నత చదువులకు

# ఎంతో దోహదపడుతుంది - కలెక్టర్



అమలాపురం (మనసులో మాట) డిసెంబర్ 22: శాస్త్రీయ ఆలోచన, సృజనా త్మకత మరియు నవీనతను పెంపొందించేందుకు జిల్లా స్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన ఎంత గానో దోహదపడుతుందని ఆ దిశగా విద్యార్థులను అన్ని విధాల ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థులు సైంటిఫిక్ మ్యానర్లో ఆలోచన చేసిన అంశాలు చాలా కాలం గుర్తుండి భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు సుమారు పర్యావరణం వ్య వసాయం ఇంధన వనరులు వంటి ఏడు అంశాలపై ఈ ప్రదర్శన నిర్వహించడం జరి గిందన్నారు. విద్యార్థులు ప్రతి అంశంలో రొటీన్ గా కాకుండా సైంటిఫిక్ గా ఆలోచన చేయాలని సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబర్ మాసంలో ఈ యొక్క ప్రదర్శన లకు ప్రాముఖ్యతనిస్తున్నా ర న్నారు. పలువురు విద్యార్థులు తాము చేపట్టిన ప్రదర్శనలను జిల్లా కలెక్టర్ వారికి విశదీక రించారు ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రాజెక్టులు, నమూనాలు ప్రయోగాల రూపంలో ప్రదర్శించి ప్రతిభను చాటుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యను అనుభ వంతో అనుసంధానించి, భవి ష్యత్తుకు ఉపయోగపడే నైపు ణ్యాలను అభివృద్ధి చేసే ఉత్తమ ప్రతిభ నైపుణ్యాలను చాటుకునే వేదికగా ఈ ప్రదర్శన నిలుస్తుం దన్నారు. ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విద్యా ర్థుల్లో సృజ నాత్మకతను పెంపొందించే ముఖ్యమైన కార్యక్రమమన్నా రు. ఈ ప్రదర్శనలు విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన నూతన ఆవిష్కరణలు, ప్రయోగ నమూనాలను ప్రదర్శించి, భవిష్యత్ శాస్త్రవే త్తలుగా తీర్చిదిద్దాలన్నారు. రెండు తరగతులకు కలిపి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యా యుల ప్రదర్శనలు నిర్వహించి వాటిలోని అత్యుత్తమ ప్రదర్శ నలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాబడతాయన్నారు విద్యార్థుల్లో విజ్ఞానం, గణితం, పర్యావరణ అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడు తుందన్నారు. ప్రధానంగా వ్యవసాయం, నీరు, ఆరోగ్యం పర్యావరణ సమ తుల్యత సాంప్రదాయేతర పునరుత్పాదకత ఇంధన వనరుల వినియోగం వంటి రంగాల్లో ప్రయోగాలు సమా జాన్ని జాగృతం చేసేందుకు ఉపయోగపడతాయన్నారు. పరి శోధనలతోనే విద్యా ప్రగతి ఉందని విద్యా వ్యవస్థలో పరి శోధనను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు విద్య అంటే కేవలం పరీక్షలు రాయడం, పాఠ్యపుస్తకాలు చదవడం మాత్రమే కాదని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ ఆలోచనలను మూర్తీ భవిం చేలా కృషి సల్పాలన్నారు దీనికి శాస్త్రీయ దృక్పథం ఉండాలనీ. ఇందుకోసం పాఠశాలలు, కళాశాలలు విద్యా ర్థులను ప్రశ్నించే సామర్థ్యాలను పెం చాలన్నారు ప్రతి విద్యార్థి లో శాస్త్రీయ తత్వాన్ని అలవర్చాల న్నారు విద్యార్థులుగా ఉన్నపుడే వరిశోదన , విజ్ఞాన ప్రదర్శనలలో సైన్స్ ఫెయిర్లలో శాస్త్రీయ చర్చ లలో పాల్గొనడం ద్వారా వారి ఆసక్తిని పెంపొందించాలనీ. ఈ తరహా కార్యకలాపాలు విద్యా ర్థులలో ప్రశ్నించే భావాన్ని రేకెత్తిస్తాయన్నారు, దృఢమైన విచారణను ప్రేరేపిస్తాయన్నారు. ప్రతి కళాశాల, ప్రతి పాఠశాల ఒక అద్భుత మైన పరిశోదనా కేంద్రంగా మారే సామర్థ్యంతో ముం దుకు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు ముందుగా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, ఎమ్మె ల్సీ కే సూర్య నారాయణరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, డీఈవో పి నాగేశ్వ రరావు ఏఎమ్ ఓ కృష్ణ, కార్య దర్శి హనుమంతరావు ఎపిసి జి మమ్మీ, ఉప విద్యాశాఖ అధికారులు సూర్య ప్రకాశ్ లక్ష్మణమూర్తి డీసీఎంఎస్ చైర్మన్ పి చంద్రమౌళి, ప్రధానో పాధ్యా యులు మూర్తి జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

**పిఠాపురం (మనసులో మాట) డిసెంబరు 22:** పట్టణంలోని మమతా హై స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. స్థానిక మమత హై స్కూల్ నుండి ఉప్పాడ బస్టాండ్ వరకు విద్యార్థిని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగించారు. రోడ్డు భద్రత పై అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ కట్టా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ మణికుమార్ అదనపు సబ్ ఇన్స్పెక్టర్ లోకేశ్వర్ పాల్గొన్నారు పాఠశాల యాజమాన్యాన్ని పోలీస్ శాఖ తరపున అభినందిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులంతా తగు జాగ్రత్తలు తీసుకుని తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం వారు తెలిపారు.

## క్రీస్తు జననం ఈ లోకానికి ఎంతో పవిత్రమైనది




**పల్నాడు డిసెంబర్ 22,( మనసులో మాట):** క్రీస్తు జననం ఈ లోకానికి ఎంతో పవిత్రమైనదని వినుకొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ షకీలా దస్తగిరి అన్నారు. వినుకొండ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకల నిర్వహించారు. ఈ వేడుకలలో వైద్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి సభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ మాట్లాడుతూ క్రీస్తు జననం లోకమంతా జరుపుకోవడం ఆయన చూపిన ప్రేమ దయ కారుణ్యాలనే నియమాలను పాటిస్తూ ముందుకు వెళితే సమాజంలో ప్రజలందరూ సంతోషంగా ఉంటారన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ న్యాయవాది సైదారావు మాట్లాడుతూ ఈ లోకంలో ఏసుప్రభు ఒక చిన్న బాలునిగా తనను తాను తగ్గించుకొని ఒక పశువుల పాకలో జన్మించడం జరిగిందని, ఆ విధంగా మనం ఒకరికొకరం తగ్గించుకొని జీవించాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయానిధి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ సురేష్, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి దానయ్య, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు రోశయ్య, పాస్టర్ కృపా సాగర్ హాస్పటల్ డాక్టర్స్ మెర్సీ, ప్రియాంక, సుధాకర్, అబ్దుల్ రజాక్, సుధా, స్రవంతి, శిరీష ,సౌమ్య, హెడ్ నర్స్ చిరంజీవి లు, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, బాబు, రోజా, డిఇఓ సాగర్ పూర్ణిమ కేజియా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

బిర్యానీ వికటించి ఎనిమిది మంది యువకులకు అస్వస్థత

## బాధితులను పరామర్శించిన వంగా గీత

### ఆసుపత్రిలో అదనపుమంచాలు ఏర్పాటు చేయాలంటూ సూచన



**పిఠాపురం,(మనసులో మాట) డిసెంబరు 22:** పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు ఫుడ్ పాయిజన్ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం చేపల ప్యాకింగ్ పనుల నిమిత్తం తాళ్లరేవు సమీపంలోని భైరవపాలెం వెళ్లిన ఈ యువకులు, తిరిగి వచ్చే క్రమంలో తాళ్లరేవులోని ఒక బిర్యానీ సెంటర్లో బిర్యానీ కొనుగోలు చేసి తిన్నారు. ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నప్పటి నుండి యువకులకు వరుసగా వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే యూ, కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బాధితులను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులను పరామర్శించిన వంగా గీత:విషయం తెలుసుకున్న పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్, మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ సోమవారం ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. యువకుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆమె, వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అధికారులు చర్యలు తీసుకోవాలి:ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాసిరకం ఆహారంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటల్ యాజమాన్యాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని బిర్యానీ సెంటర్లపై తనిఖీలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో మంచాల కొరతపై ఆవేదన:పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చడం హర్షణీయమని, అయితే ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మంచాలు అందుబాటులో లేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రోగుల సంఖ్య పెరగడంతో ఒకే మంచంపై ఇద్దరు రోగులను పడుకోబెట్టి వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొందని, తక్షణమే అదనంగా మరో 20 మంచాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

## అనపర్తి నుండి బిక్కవోలు వరకు కెనాల్ రోడ్
# మరమ్మత్తు పనులు ప్రారంభం

- సంక్రాంతి నాటికి కెనాల్ రోడ్డు ప్రయాణికుల కష్టాలు తీరుతాయని ప్రకటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి
- ఏడు కోట్లతో అనపర్తి బిక్కవోలు కెనాల్ రోడ్డు అభివృద్ధి
- కెనాల్ రోడ్డుని బ్లాక్ లిస్టులో పెట్టి ఉంటే ఇప్పుడు నిధులు ఎలా వస్తున్నాయో మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి? ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి డిసెంబర్ 22(మనసులో మా డిసెంబర్ 22:** అనపర్తిలో అనపర్తి నుండి బిక్కవోలు వరకు చిధ్రమైపోయి ఉన్న కెనాల్ రోడ్డుకు ఏడు కోట్ల రూపాయలతో చేయనున్న అభివృద్ధి పనులను ఈరోజు అనపర్తిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ,

రాజమండ్రి - కాకినాడ కెనాల్ రోడ్ లో భాగంగా అనపర్తి నియోజకవర్గ పరిధిలో బిక్కవోలు నుండి అనపర్తి వరకు అభివృద్ధి చేయడం కోసం రూ 4.50 కోట్లు ఒక గ్రాంటు, రూ 2.60 కోట్లు మరొకటి మొత్తంగా రూ 7.10 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. దీని నిమిత్తం ఈరోజు ఇక్కడ భూమి పూజ చేసి పనులు మొదలు పెట్టించడం జరిగింది. కెనాల్ రోడ్డు ద్వారా అనపర్తి, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల ప్రజానీకం అటు రాజమండ్రి ఇటు కాకినాడ ప్రయాణాలు సాగించవలసిన పరిస్థితుల్లో గడిచిన 15 సంవత్సరాలుగా ఈరోజు దుర్భరంగా మారింది. 2014-19 కాలంలో ఈ రోడ్డు అభివృద్ధి నిమిత్తం కాంట్రాక్ట్ తీసుకున్న ట్రాన్స్ట్రాయ్ కంపెనీ అలసత్వం కారణంగా వచ్చిన నిధులు మురిగిపోవడం ఆ తర్వాత వచ్చిన వైయస్సార్సీపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో కనీసం మరమ్మత్తులకు కూడా నోచుకోని పరిస్థితికి ఈ రహదారి వచ్చింది. ఇటీవల ఒకసారి మరమ్మత్తు పనులు చేసినప్పటికీ పూర్తిగా క్రస్ట్ నాశనమైపోయిన పరిస్థితుల్లో మరలా యధాతధ స్థితికి రావడం జరిగింది. అందువల్ల ముఖ్యమంత్రి కి రోడ్లు భావనాలు శాఖకు విజ్ఞప్తి చేస్తే అనపర్తి పరిధిలో పూర్తిగా ధ్వంసమై ఉన్నందున ఏడు కోట్ల రూపాయలను వారు మంజూరు చేయడం జరిగింది. ఈ ఏడు కోట్ల రూపాయలతో అభివృద్ధిపరిచి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాము. పి పి పి మోడల్ లో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనను సిద్ధం చేయడం జరిగింది. అందుకోసం 650 కోట్ల రూపాయలు అవసరం అని గుర్తించడం జరిగింది. అవన్నీ కార్యరూపం దాల్చే వరకు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూసేందుకుగాను ఈరోజు ఇక్కడ ఈ పనులను ప్రారంభించడం జరిగింది. సంక్రాంతి నాటికి ఈ పనులు పూర్తయి ప్రయాణికుల కష్టాలు తీరతాయని భావిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఆనాటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి కెనాల్ రోడ్డు ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఈ కెనాల్ రోడ్డుని బ్లాక్ లిస్టులో పెట్టారు అంటూ చెప్పడం జరిగేది. ఎక్కడా రోడ్లను బ్లాక్ లిస్టులో పెట్టడం అంటూ జరగదు. ఆయన కొత్తగా సృష్టించారు అంతే. మరి రోడ్డుని బ్లాక్ లిస్టులో పెట్టి ఉంటే ఇప్పుడు నిధులు ఎందుకు వస్తున్నాయి అంటూ ఆయనను నేను ప్రశ్నిస్తున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏడు కోట్ల రూపాయలను ఈ రోడ్డు నిమిత్తం మంజూరు చేసి అభివృద్ధి చేయడం జరిగింది . ఇప్పుడు మరలా మరొక 7 కోట్లను మంజూరు చేయడం జరిగింది. పిపిపి మోడల్ లో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేయడం జరిగింది. ఇవన్నీ ఎలా జరుగుతున్నాయో సమాధానం చెప్పవలసిందిగా వారిని డిమాండ్ చేస్తున్నాను. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తుంది. అస్తవ్యస్తంగా తయారైన రహదారులను అభివృద్ధి పరిచి యధాతధ స్థితికి వాటిని తీసుకువచ్చే కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలియచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం,అనపర్తి మండలం,అనపర్తి టౌన్ కూటమి నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



## కెరీర్ ఎక్స్ పొ/ఎగ్జిబిషన్ లో అల్లిపూడి కె.జి.బి వి పాఠశాలకు ప్రథమస్థానం

**కోటనందూరు( మనసులో మాట )డిసెంబర్ 22..** జిల్లా విద్యాశాఖ నిర్వహించిన కెరీర్ ఎక్స్ పొ ఫెస్టివల్ లలో మండల లెవెల్ నుండి జిల్లా స్థాయి లో పోస్టర్ మేకింగ్ నందు ప్రధమ బహుమతి సాధించిన అల్లిపూడి కస్తూరిభాగాంధీ విద్యార్థినులు ఎ. దుర్గాభవాని ఎ.ఆశ్రిత, పి. మానస పి.భవాని, ఎస్ హాసిని,జి.రక్షిత లను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మరియు బాలికల అభివృద్ధి అధికారిని పి. ఉమా మహేశ్వరి మెమంటో మరియు సర్టిఫికెట్స్ అందించి అభినందనలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సెలర్ చింతకాయల అంకిత, ఒకేషనల్ ట్రైనర్ మాతిరెడ్డి దుర్గాదేవి పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాజేశ్వరి మరియు పాఠశాల సిబ్బంది విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసారు.

## హిందువులపై దాడులు నశించాలి



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 22:** బంగ్లాదేశ్ లో జరుగుతున్న మత హింసను వ్యతిరేకిస్తూ,హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ముమ్మిడివరం హిందూసేన ఆధ్వర్యంలో ప్రదాన రహదారిపై కొవ్వొత్తులు, కాగడాలతో ర్యాలీ ను సోమవారం సాయంత్రం నిర్వహించారు. దీపు కి న్యాయం చెయ్యాలి, హిందువులపై హత్యా కాండలు ఆపాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పలువురు బీజేపీ నేతలు, హిందూ సేన ప్రతినిధులు పాల్గొన్నారు

## వర్గీకరణతో ఎస్సీలు నడ్డి విరిచారు



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 22:** పిఠాపురం పట్టణంలో స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో పివి రావు 20వ వర్ధంతి సభను నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్ర పూర్వకంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు విమర్శించారు. వర్గీకరణ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వర్గీకరణను వెంటనే రద్దుచేసి ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## ఆర్డీవోచే అమృత వర్షిని కి జిల్లాస్థాయి నెంబర్ 2 అవార్డు

**ఐ. పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 22.** జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని డిసెంబర్. 24న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన వకృతత్వం పోటీలలో మురమళ్ళ విద్యాగని, చదువుల సరస్వతి నిలయంగా పేరు పొందిన సాయి హై స్కూల్ కు చెందిన విద్యార్థినియు.అమృత వర్షిని చూపిన ప్రతిభా పాట వాళ్లకు జిల్లాస్థాయిలోనే రెండవ స్థానం దక్కింది. ప్రభుత్వం చేపట్టిన వినియోగదారులు, వ్యవహారములు, ఆహార పౌరసరఫరాల, విద్య శాఖ నిర్వహించిన సమగ్ర సత్వర న్యాయం జరగడానికి" డిజిటల్ న్యాయ సేవలు అనే అంశంపై" విద్యార్థిని అమృత హర్షిని వక్రతత్వంలో విశేష ప్రతిభ కనిపించింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని విద్యార్థిని వర్షిని రికార్డు సృష్టించింది. పోటీలలో వర్షిని తన మేధా సంపత్తిని రంగరించి మిగతా విద్యాసంస్థల కంటే దీటుగా పోటీలో జిల్లాకే తలమానికంగా ద్వితీయ స్థానాన్ని సంపాదించింది. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించిన సాయి హై స్కూల్ విద్యార్థిని అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో అమృత వర్షినీ అమలాపురం ఆర్డీవో మాధవి, జిల్లా సివిల్ సప్లై అధికారి, జిల్లాస్థాయి అధికార యంత్రాంగం సమక్షంలో ప్రత్యేకంగా సత్కరించి అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థిని వర్షిని తను విద్యను నిర్దేశించిన మురమళ్ళ సాయి హై స్కూల్ కి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం ఆమె తల్లిదండ్రులకు గౌరవ మర్యాదలు నిలబెట్టడం పట్ల సాయి హై స్కూల్ విద్యా సంస్థఅధినేత పెనుమత్స కామరాజు (వాసు రాజు) హర్ష వ్యక్తం చేశారు. విద్యార్థిని అమృత వర్షిని సత్కరించారు.

### మన సనాతన సాంప్రదాయంలో
# వివేకానందుని విద్యాభ్యాసం
## - ఉత్తమోత్తమమైన ఉపనిషత్ ఉత్సవవైదిక వైభవ వేడుక




**అనపర్తి (మనసులో మాట) డిసెంబరు 22:** ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక సంస్థ వార్షికోత్సవాలు "ఉత్తమోత్తమమైన ఉపనిషత్ ఉత్సవవైదిక వైభవ వేడుక " బలబద్రపురంలోని ఎమ్మెస్సార్ ఫంక్షన్ హాల్ లో ఈరోజు ఉదయం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు ,ఆత్మజ్ఞాన ప్రబోధకులు శ్రీ వివేకానంద ఈ సందర్భంగా శిష్యులకు అనుగ్రహభాషణ చేశారు. భారతదేశంలో జన్మించడం ఆధ్యాత్మికంగా ఎదగడానికి పూలబాట వేసుకున్నట్లే అని, ఇక్కడ ఆధ్యాత్మిక ఉన్నతి ని సాధించడం, గురుపరంపరాగతంగా ఆత్మజ్ఞానాన్ని శిష్యులకు ప్రబోధించడం మన సనాతన సాంప్రదాయం అని ఉపదేశించారు. ఆధ్యాత్మిక జ్ఞానం తెలుసుకోవడం అంటే భౌతిక జీవితాన్ని త్యజించడం కానే కాదని, భౌతికంలోని సమస్యలను సైతం ఆధ్యాత్మికతతో ఎదుర్కొని ఆనందంగా జీవించవచ్చుని శ్రీ వివేకానంద ప్రబోధించారు. మానవాళి సంస్కరించుకోవడం కోసమే జన్మ తీసుకుంటామని ఆ సంస్కరణ కేవలం గురువు ద్వారా మాత్రమే సాధ్యమని ప్రబోధించారు. అంతకుముందు వారి శిష్యులు దేశం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చి వారికి పుష్పాభిషేకం చేసి స్వాగతం పలికారు ఈ వేడుకలు ఈరోజు నుంచి తొమ్మిది రోజులపాటు కొనసాగుతాయని ప్రతిరోజు ఉదయం 6 గంటలకే గురువుగారి ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. ఈరోజు విజయోత్సవ ర్యాలీ మరియూ జ్యోతి ప్రజ్వలన గావించి అద్వైత మహాసామ్రాజ్యానికి పట్టాభిషేకం అంకురార్పణ ....ట్రూత్ వివేకామృతం పతాక ఆవిష్కరణ , తదుపరి నిర్వాణషట్కమ్-వివేకామృతం,భగ్వద్గీత - వివేకామృతం జ్ఞానానుష్టానం గావించారు ప్రతీక్షణం ... పరమాత్మతో పరవశం.

## రాజీవ్ గాంధీ పాఠశాల జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం



**పిఠాపురం (మనసులో మాట) డిసెంబరు 22 :** పిఠాపురం పట్టణంలో గల రాజీవ్ గాంధీ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి కెరీర్ గైడెన్స్ ఎగ్జిబిషన్లో సత్తా చాటారు. 'టూరిజం డెవలప్మెంట్' (పర్యాటక అభివృద్ధి) అనే అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసా పత్రం, షీల్డ్ సహా రూ. 3,000 నగదు బహుమతిని అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సలీనా సఫర్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను చక్కగా వివరించి ద్వితీయ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయ బృందాన్ని పలువురు అభినందించారు.

## పెద్దాపురం మహారాణి సత్రం చైర్మన్గా శ్రీనివాస్





పెద్దాపురం (మనసులో మాట) డిసెంబర్ 23బీ పెద్దాపురంలో చారిత్రిక ప్రాధాన్యత కలిగిన శ్రీరాజా వత్సవాయి బుచ్చి సీతమ్మ జగపతిబాబు మహారాణి సత్రం నూతన చైర్మన్గా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుమట్టే శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సత్రం ఈవో కాట్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చిన్న రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు ముఖ్య అతిథులుగా సత్రం పాలకవర్గ ప్రమాణ స్వీకార వేడుకలు కోలాహలంగా జరిగాయి. చైర్మన్గా మట్టే శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులుగా తమ్మన సత్యనారాయణ,, కె.వి.వి రమణి, ఒక్కలంక కళ్యాణి, మేడిశెట్టి వెంకటేష్, సిహెచ్ ధనలక్ష్మి, వజ్రపు సువర్ణ, దాసరి శ్రీనివాస్, గుండేపల్లి సుధాకర్, నున్న భాస్కరరావు, దాకమూరి సుబ్బలక్ష్మి సుబీర్ గా ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రతిపాడు ఎమ్మెల్యే మరుపుల సత్య ప్రభ , బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిరి విశ్వేశ్వరరావు, లలిత ఇండస్ట్రీస్ ఎండిలు మట్టే సత్యప్రసాద్, మట్టి శ్రీనివాసరావు, మట్టి ఆదిష్ బాబు ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు. మహారాణి సత్రం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్యే సత్య ప్రభ, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కోరారు. జనసేన పెద్దాపురం టౌన్ అధ్యక్షులు పోలమర శెట్టి సత్తిబాబు, ఆర్యవైశ్య సంఘం నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ నిరంకుశ వైఖరి నశించాలంటూ
# పిఠాపురంలో పెద్ద ఎత్తున ఆందోళన

- కార్మిక చట్టాల ప్రకారం ఉద్యోగులకు సాధారణ సెలవులు కల్పించాలి
- ఉద్యోగులపై కక్ష సాధిస్తున్న జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున గర్జించిన 104ఉద్యోగులు.
- గతంలో ఇచ్చే జీతం కన్నా తక్కువ జీతం ఇవ్వడం దారుణం అంటూ ఆవేదన




**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 22:** భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 104 సిబ్బందిని వేధిస్తున్నారంటూ జీతాలు చెల్లింపులు, విధులు నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా తమపై ఒత్తిడిలు చేస్తున్నారంటూ 104 ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పిఠాపురంలోని భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ జిల్లా కార్యాలయం వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం సిఐటియు సహకారంతో నిర్వహించారు. భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రభుత్వం తెలిపిన జీతాలు చెల్లించకుండా కోతలు విధించి చెల్లించడం పై తీవ్రంగా మండిపడ్డారు . కార్మిక చట్టాల ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ సెలవులు మంజూరు చేయాలని అలాగే బఫర్ సిబ్బందిని నియమించుకోవాలని ఎన్ని మార్లు యాజమాన్యానికి తెలిపిన నిరంకుశంగా వ్యవహరిస్తుందంటూ తక్షణమే ప్రభుత్వం ఈ విషయంపై జోక్యం చేసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలతో నిరసన తెలిపారు. హక్కుల కోసం పోరాడుతున్న 104 ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబును సస్పెండ్ చేయడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషు బాబ్జి తెలిపారు. తక్షణమే సస్పెన్షన్ కు గురైన రాంబాబు ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తక్షణమే 104 ఉద్యోగులకు అందాల్సిన అన్ని సదుపాయాలను అందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు 104 ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దువ్వ శేషు బాబ్జి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా 104 ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు వెంకట్రావు, ఇందుమతి,హరిప్రసాద్ స్వర్ణ తేజ, శ్రీను సిఐటియు పిఠాపురం కార్యదర్శి కుంచే చిన్న, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
మంగళవారం 23 డిసెంబర్ 2025



# స్వచ్ఛాంధ్ర సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

- పల్లె ప్రాంతాలు పారిశుద్ధ్యానికి మారుగా నిలవాలి.
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జీడి నెల్లూరు నియోజకవర్గానికి ఈ-ఆటోలను అందించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు జెండా వూపి ఆటోలను ప్రారంభించిన ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే డాక్టర్ థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు డిసెంబర్ 22( మనసులో మాట):** స్వచ్ఛాంధ్ర సాధనే కూటమీ ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. పల్లె ప్రాంతాలు పారిశుద్ధ్యానికి మారుగా నిలవాలనీ.., ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే తాను పంచాయతీల ప్రగతిని దృష్టిలో ఉంచుకొని, తడి చెత్తా- పొడి చెత్తను సేకరించినందుకు ఈ-ఆటోలను గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో చిత్తూరు పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలన్నిటికి ఈ-ఆటోలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన 20 ఈ-ఆటోలను సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్తో కలిసి జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నేతృత్వంలో జీడి నెల్లూరు నియోజకవర్గానికి అందజేశారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. అంతేకాకుండా వారితో కలిసి జెండా ఊపి ఈ- ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించన మేరకు స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛతే సేవా కార్యక్రమం ఏపీలో దిగ్విజయంగా జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తాను ఈ-ఆటోలను జీడి నెల్లూరు నియోజకవర్గంలోని పంచాయతీలకు అందించినట్లు పేర్కొన్నారు. ఈ- ఆటోలు తడి చెత్త -పొడి చెత్తను సేకరించి, తద్వారా సంపదను సృష్టించేందుకు దోహదపడతాయన్నారు. తద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ వివరించారు. అనంతరం జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చొరవతో ఎంపీ నిధుల ద్వారా ఈ-ఆటోలను మా నియోజకవర్గానికి అందించడం హర్షించదగ్గ విషయ మన్నారు. ఈ-ఆటోల ద్వారా తడి చెత్త, పొడి చెత్తను సేకరించి, పల్లి ప్రాంతాలలో పారిశుధ్యనికి పెద్దపీట వేస్తామన్నారు. అదే సమయంలో దీని ద్వారా సంపదను సృష్టించేందు కు కూడా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ-ఆటోలు కూడా పంచాయతీల ప్రగతికి తోడ్పాటు నందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కుమారి అముద, చూడా చైర్పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే మనోహర్, కార్పోరేటర్ అశోక్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మాజీ ఎంపిటిసి తిరుమల,జీడి నెల్లూరు కూటమి నాయకులు, కార్యకర్తలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఉగ్రాణపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**పెనుమూరు, డిసెంబర్ 22, (మనసులో మాట):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఉగ్రాణంపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్ ను సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా స్థానిక సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి, కనక రాజులు, గుణశేఖర్ రెడ్డి రూ. 2 లక్షలు సొంత నిధులతో ఉగ్రాణంపల్లె హై స్కూల్ వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రజలకు మినరల్ వాటర్ అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధనంజయ రెడ్డి, ధీరజ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రమణారెడ్డి, గోవింద్ రెడ్డి, సాయి వినయ్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సాయి, చక్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గ్రామీణ కూలీల కడుపు కొట్టే బిల్లును రద్దు చేయాలి



**పలమనేరు డిసెంబర్ 22( మనసులో మాట)..** గ్రామీణ ప్రాంత కూలీల కడుపు కొట్టే కొత్త ఉపాధి హామీ బిల్లును వెంటనే రద్దుచేసి యధాతథంగా కూలీలకు ఉపాధి కల్పించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి .మునిరత్నం, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సోమరాజు, మహిళా నాయకులు, సరస్వతి,రత్నమ్మ ,వాణి, డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమ వారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు రాజా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... గతంలో ఉన్న ఎన్ఆర్ఈజీఎస్ స్కీమ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు వివిధ రకాల ఉపాధి పనులు దక్కడంతో పాటు మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. దాంతో నిత్యం కూలి పనులు చేసే వారికి జీవనాడిగా నిలిచిందన్నారు. ఇజీఎస్ పథకం తో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు, రైతులు, ప్రభుత్వ సముదాయాలు కోసం నిధులు ఖర్చు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలు కడుపు కొట్టడానికి ఈజీఎస్ పేరు మార్చడానికి ఇన్ని రోజులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి ఆర్ ఏ ఎం జి పథకం కోసం కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయాలని ప్రయత్నించిందని విమర్శించారు. కొత్తగా తీసుకొచ్చిన బిల్లు ద్వారా పేదలకు ఉపాధి కరువవుతుందని ఆఖరకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి కొత్తగా తీసుకొచ్చిన బిల్లును రద్దుచేసి పాత స్కీమ్ విధానాన్ని అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమానుల్లా, నారాయణ శెట్టి, శాంతమ్మ, ఆనంద, గుర్రం సుబ్రహ్మణ్యం, మంజునాథ్, రమణ, గంగిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట

- పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు సామాన్యులకే కేటాయింపు
- ఈ-డిప్ లో టోకెన్లు పొందిన భక్తులందరూ నిర్దేశిత సమయంలోనే తిరుమలకు చేరుకోవాలి
- ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ
- వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై మంత్రివర్గ ఉప సంఘం సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**తిరుమల (మనసులో మాట):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల్లో సామన్యులకే పెద్దపీఠ వేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలియజేశారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో సోమవారం వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు మంత్రుల ఉప సంఘంలోని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ లతో కలిసి ఆయన టీటీడీ, జిల్లా, పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలోని ముఖ్యాంశాలు- పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు అంటే దాదాపు 90శాతం సామాన్యులకే కేటాయింపు.- పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు.- తొలి మూడు రోజుల దర్శనాలకు 27 రాష్ట్రాల నుండి 23.64 లక్షల మంది ఈ-డిప్ కు నమోదు- 1.89 లక్షల మంది సామాన్య భక్తులకు ఈ-డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు.- భక్తులు ఏరోజు, ఏ సమయానికి దర్శనానికి రావాలో సమాచారం అందజేత.- టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వ దర్శన క్యూలైన్ ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలకు అవకాశం.- స్వామివారి దర్శనాలకు విచ్చేసే భక్తులకు విరివిగా అన్నప్రసాదాలు, తాగునీరు, తదితర సదుపాయాలు.- ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తుల సంఖ్య, వేచి ఉండే సమయాన్ని అంచనా వేస్తూ క్యూలైన్ల నిర్వహణ.- పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు.- అన్ని వర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని భక్తులకు విజ్ఞప్తి.- భక్తులకు పూర్తిస్థాయిలో సంతృప్తి కలిగేలా నిబద్ధతతో సేవలు అందించాలని సిబ్బందికి సూచన. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, దేవాదాయశాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**అందరి సమన్వయంతో పని చేయాలిఎమ్మెల్యే అమర్ ను కలసిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్**

**పలమనేరు డిసెంబర్ 22( మనసులో మాట):** తెలుగుదేశం పార్టీకికంచుకోట అయిన చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సూచించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తవణంపల్లి మండలంనకు చెందిన వై.సునీల్ కుమార్ చౌదరి నియమితులయ్యారు. దీంతో తొలుతా శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు పార్టీ కార్యాలయంలో తవణంపల్లి మండల నాయకులతో కలసి సోమవారం మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కల్పించిన గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో పార్టీకి చాలా మంది ప్రముఖులు పనిచేసిన చరిత్రను గుర్తించుకొని అందరి సమన్వయంతో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. పార్టీలోని పెద్దల సలహాలు సూచనలతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ రవి ప్రసాద్, నాయకులు సమీర్ చౌదరి, శివకుమార్, ప్రకాష్, సువిష్,సురేష్, రెడ్డప్ప,బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక




**పలమనేరు డిసెంబర్ 22( మనసులో మాట):** పలమనేరు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డివిజన్ ఆఫీసు నందు పలమనేరు మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ జిల్లా నాయకులు కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా రామచంద్ర, అధ్యక్షులుగా భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా సాలేహ, సహాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, రేవతి, కోశాధికారిగా ఆరిఫ్, కార్యదర్శులుగా శేఖర్, దేవి ప్రియ, ఆనందా చారి, ప్రత్యూష,నరేంద్ర, నాగరాజు, జిల్లా కౌన్సిలర్లుగా హరికృష్ణ, మంజుల రాణి, షణ్ముగం శెట్టి, రమేష్, మహిళా కన్వీనర్ గా ఇందిరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు విద్యాభివృద్ధికి, సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

## జిల్లా టి.డి.పి అధ్యక్షుడు సాయిని కలిసి మామిడి కుదురు టిడిపి శ్రేణులు



ఐ.పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 22.. జిల్లా టిడిపి అధ్యక్ష పదవి పగ్గాలు చేపట్టిన గుత్తుల సాయిని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి, స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనంద సాగర్ ఆధ్వర్యంలో మామిడికుదురు టిడిపి శ్రేణులు కలిసి సత్కరించారు. సోమవారం రాత్రి సాయి స్వగ్రామమైన గాడిలంకలో ఆనందసాగర్ నేతృత్వంలో మామిడికుదురు మండల టిడిపి సీనియర్ నాయకులుమోల్లేటి శ్రీను, మండల టి.డి.పి అధ్యక్షులు బోనంబాబు, కడలి నూకరాజు, తెలుగు యువత నేత భార్గవ్, పలువురు టిడిపి శ్రేణులు కలిసి సాయిని అభినందించారు. గుత్తుల సాయి, గంధం పల్లంరాజు లు జిల్లా టిడిపి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నియమితులైన తరుణంలో జిల్లా తెలుగుదేశం పార్టీలో సరికొత్త జోష్ నెలకొందని ఆనంద సాగర్ అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరి కృషి మరింత విజయానికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# రాష్ట్రపతికి వీడ్కోలు



**హైదరాబాద్, డిసెంబర్22:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో శీతాకాల విశ్రాంతి పూర్తి చేసుకుని తిరిగి ఢిల్లీకి బయలుదేరారు. డిసెంబర్ 17 నుంచి 22 వరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం (బొల్లారం)లో బస చేశారు. సోమవారం ఉదయం హకీంపేట్ వాయుసేన స్టేషన్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి సీఎం రేవంత్ రెడ్డి వీడ్కోలు పలికారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అతిథులతో సంభాషించారు. ఈ శీతాకాల విశ్రాంతి కాలంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి సంబంధిత అంశాలపై కూడా దృష్టి సారించారు.



# సర్పంచుల ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్, డిసెంబర్ 22:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు ఈ సందర్భంగా సందడిగా మారాయి. ప్రజాప్రతినిధులు తమ పదవీ బాధ్యతలు స్వీకరించడంతో గ్రామ పాలనకు కొత్త ఊపిరి వచ్చినట్టయింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాలను సంబంధిత ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించగా, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై నూతన సర్పంచులను అభినందించారు. పూలమాలలు, శాలువాలతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్పంచులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా పాలన సాగిస్తామని స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఉపాధి హామీ పనులు, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనిచేస్తామని తెలిపారు. ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా గ్రామసభల ద్వారా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, అవినీతి, పక్షపాతం లేకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. యువత, మహిళలు, రైతులు, దళితులు, బీసీలు, మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు%-%అధికారుల సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని అన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నూతన సర్పంచులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాల అనంతరం కొన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, ప్రాధాన్యతా పనులపై చర్చించారు. గ్రామ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు రూపొందించడంపై దృష్టి సారించారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారం కీలకంగా మారిందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే గ్రామాలు నిజమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా, నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారంతో తెలంగాణ గ్రామ పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది అని చెప్పవచ్చు.

# సమ్మిట్‌తో ప్రతిష్ట

## గ్లోబల్ సమ్మిట్‌తో పెరిగిన ప్రతిష్ట

- అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు ఇమేజ్
- సమ్మిట్ ద్వారా 5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు
- ఎంఓయూలపై చులకనగా మాట్లాడితే ఎలా
- మీ హయాంలో ఎంవోయూలపై పెట్టుబడులే లేవు
- కేసీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 22:** తెలంగాణ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను పెంచిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇప్పుడు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సమ్మిట్ విజయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం కేసీఆర్‌కు ఇష్టం లేనట్లు ఆయన మాటలు ఉన్నాయని మంత్రి మండిపడ్డారు. ఈ సమ్మిట్ ద్వారా 5 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు జరిగాయని, వీటిని కేసీఆర్ చాలా తేలికగా మాట్లాడటం తగదని శ్రీధర్ బాబు అన్నారు. 'కేసీఆర్ హయాంలోనూ అనేక ఒప్పందాలు జరిగాయి, కానీ అన్నీ కార్యరూపం దాల్చలేదు. మేము వాటి గురించి ఎప్పుడూ రచ్చ చేయలేదు. ఇప్పుడు మేము కుదుర్చుకున్న ప్రతి ఒప్పందాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు పక్కాగా ఫాలో-అప్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా 1.40 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ త్వరలోనే ప్రపంచానికే 'జీసీసీ క్యాపిటల్' కాబోతోందని మంత్రి ప్రకటించారు. గడిచిన ఏడాది కాలంలోనే 75 అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను రాష్ట్రానికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఐటీ, ఏరోస్పేస్, వ్యాక్సిన్ తయారీ రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ప్రపంచానికి అవసరమైన మూడు వంతుల వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయని గుర్తుచేశారు. వ్యాపార సంస్కరణల అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ అవార్డు అందుకోవడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ బీఆర్ఎస్ పేటెంట్ అని చెప్పుకోవడంపై మంత్రి స్పందిస్తూ.. రక్షణ రంగంలో అలాగే ఐటీ , మ్యానిఫ్యాక్చరింగ్ రంగాలకు పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయే. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు అసంపూర్తిగా ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించారు. పీఎం మిత్ర పథకం కింద కేంద్రం నుండి 30 కోట్ల నిధులు తెచ్చింది మేమని వివరించారు. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. మీరు హైప్‌లో ఉన్నారు.. మేము ప్రజల్లో హోప్ క్రియేట్ చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న 'గేట్ పాస్' కల్చర్‌ను రద్దు చేశామని, అందరినీ కలుపుకుని పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కేవలం పరిశ్రమలు తేవడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి దక్కేలా ఐటీఐ లను ఏటీసీ లుగా మార్చామని మంత్రి తెలిపారు. ఎంఎస్ఎంఈల కోసం కొత్త పాలసీని తీసుకువచ్చామని, పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని నింపుతూ కక్షసాధింపులు లేని పాలనను అందిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# జనవరి 13 నుంచి కైట్ ఫెస్టివల్

- ఫెస్టివల్ ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

**హైదరాబాద్,డిసెంబర్ 22:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13వ తేదీ నుంచి కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. దీని ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్‌కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఎ , హైడ్రా తరఫున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను సందర్శించి ఏర్పాట్లను సమీక్షిస్తారని ఆయన తెలిపారు. మావేశంలో హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ నగరవ్యాప్తంగా హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పర్యావరణ స్థిరత్వం, ప్రజాప్రయోజనాల కోసం చేపట్టిన పునరుద్ధరణ పనులను వివరించారు.

# జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన

## జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు




**హైదరాబాద్, డిసెంబరు 22:** జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆ నివేదికను బయటపెట్టలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది బుధవారమే కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటివరకు అందిన 3,100 అభ్యంతరాలు పరిష్కరిస్తున్నామన్నారు.

# మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం




**ఛత్తీస్‌గఢ్, డిసెంబర్22:** ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలు, ఆయుధాలను వెలికితీశారు. సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ చౌహాన్ మాట్లాడుతూ.. ఈ కార్మాగారం మావోయిస్టులు భద్రతా బలగాలపై దాడులు చేయడానికి ఆయుధాలు తయారు చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. డంప్‌ను ధ్వంసం చేయడం వల్ల వారి కార్యకలాపాలకు, నిర్వహణకు అటకాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ఉధృతం చేశామని పేర్కొన్నారు. మార్చి 2026 నాటికి మావోయిస్టులను పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యంతో భద్రతా బలగాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని తెలిపారు.

# గొంతు కోసుకున్న వ్యక్తికి పునర్జన్మ

**భద్రాద్రి వైద్యుల సాహసం**

**'గోల్డెన్ అవర్'లో శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన డాక్టర్ రవి బాబు**

**భద్రాచలం, డిసెంబర్ 22 (మనసులో మాట):**

రెండు వారాల క్రితం ఆత్మహత్యాయత్నంలో భాగంగా గొంతు కోసుకొని, చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ వ్యక్తికి భద్రాద్రి టీవీవీపీ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలోనే విజయవంతంగా నిర్వహించి రోగి ప్రాణాలను నిలిపారు. భద్రాచలం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిశాల్ తమంగ్ అనే వ్యక్తి కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో నూడిల్స్ బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు వారాల క్రితం వ్యక్తిగత కారణాలతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గొంతు లోతుగా తెగడంతో పరిస్థితి విషమించగా, స్థానికులు అతడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యలో కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న డాక్టర్ రవి బాబు (ఈఎన్టీ స్పెషలిస్ట్) వెంటనే స్పందించారు. రోగిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించి, 'గోల్డెన్ అవర్'లో సుమారు రెండు గంటల పాటు శ్రమించి అత్యంత సాహసోపేతంగా శస్త్రచికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రోగిని భద్రాచలం ఐసీయూకు తరలించారు. అక్కడ వైద్య బృందం రెండు వారాల పాటు కంటికి రెప్పలా కాపాడుతూ చికిత్స అందించడంతో బిశాల్ తమంగ్ కోలుకున్నారు. ఆదివారం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఇలాంటి ఆపరేషన్ చేయాలంటే గట్స్ ఉండాలి: ఎమ్మెల్యే ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరగాల్సిన ఆపరేషన్‌ను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేయడం సామాన్య విషయం కాదని అన్నారు. ఇలాంటి ఆపరేషన్లు చేయడానికి ఎంతో ధైర్యం (గట్స్) ఉండాలని వ్యాఖ్యానించారు. జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో ఏజెన్సీ ప్రాంతంలోనూ ప్రభుత్వ వైద్యులు అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ.. సాహసోపేతంగా ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలిపిన డాక్టర్ రవి బాబు, పాల్వంచ ఆసుపత్రి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. 24 గంటల పాటు రోగిని పర్యవేక్షించిన భద్రాచలం ఐసీయూ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ ఘటన జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి సేవల బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం రోగికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులకు సన్మానం – బాధితుడి ఆనందం తనకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ రవి బాబు, ఇతర వైద్య సిబ్బందిని రోగి బిశాల్ తమంగ్ శాలువాతో సత్కరించారు. తమంగ్ భార్య చెమర్చిన కళ్ళతో వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రామ్ ప్రసాద్, డాక్టర్ సోమరాజు దొర, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రామ కృష్ణ, డాక్టర్ మల్లేష్, డాక్టర్ నిఖిత, డాక్టర్ కౌండిన్య, డాక్టర్ తేజస్వి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను ఎలా ఫుట్‌బాల్ ఆడాలో రేవంత్‌కు తెలుసు

**కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ సీతక్క**



**హైదరాబాద్, డిసెంబరు 22:** ఫుట్‌బాల్ ఆడుకోవడం సీఎం రేవంత్‌కు బాగా తెలుసని, కేటీఆర్‌ను ఎలా ఫుట్ బాల్ ఆడుకోవాలో అలా ఆడుకుంటారని కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను ఫుట్‌బాల్ ఆడుకుంటామన్న కేటీఆర్ వ్యాఖ్యలపై సీతక్క ఘాటుగా స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎప్పుడో బీఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రపంచ ఆటగాడితోనే ఫుట్‌బాల్ ఆడినట్లు తెలిపారు. కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎట్లా ఆడాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసన్నారు. అధికారం పోయిందని అక్కసుతో హరీష్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీష్ రావుకు మించి తప్పుడు కూతలు, తప్పుడు మాటలు, గోబెల్ ప్రచారం ఎవరు చేయరని విమర్శించారు. అధికారం పోయాక ఎవరో ఎవరో వాళ్ళ ఇంట్లో పెద్ద గుంజుకున్నట్లుగా ఫీల్ అవుతున్నారని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఫైర్ అయ్యారు. ప్రజలు బీఆర్ఎస్‌కు 10 సంవత్సరాలు అవకాశం ఇచ్చారని.. సరిగా పని చేయకపోతే ప్రజలు అధికారం నుంచి దించేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మంచిగా పని చేయనప్పుడు కాంగ్రెస్‌ను కూడా దించుతారని అన్నారు. కవితకు జవాబు చెప్పలేక కాంగ్రెస్ పార్టీ మీద పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలతో తాము పాజిటివ్ దృక్పథంతో ఉంటామని స్పష్టం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఫుట్‌బాల్ ఆడుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# రెచ్చగొట్టే ప్రసంగాలతో మావో ఐడియాలజీ ప్రచారం

**గాదె ఇన్నయ్యపై రిమాండ్ రిపోర్టు**

**హైదరాబాద్, డిసెంబరు 22:** మాజీ మావోయిస్ట్, సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యపై నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణతో ఎన్ఐఏ అధికారులు తాజాగా ఆయనను అరెస్ట్ చేశారు. ఇన్నయ్య రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు బయటపడ్డాయి. రిమాండ్ రిపోర్టులో ఏముందంటే.. 'అక్టోబర్ 18వ దేశ భద్రతకు హాని కలిగించేలా గాదె ఇన్నయ్య వ్యాఖ్యలు చేశారు. వికల్ప్ అంత్యక్రియల సందర్భంగా ఇన్నయ్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వికల్ప్ అంత్యక్రియలకు 200 మంది హాజరయ్యారు. అంత్యక్రియల వద్ద అమరుల బంధుమిత్రుల సంఘం పేరుతో బహిరంగ సభ ఏర్పాటైంది. ఈ సభలో విద్వేషాలు రెచ్చగొట్టి మావోయిస్టు ఐడియాలజీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని గాదె ఇన్నయ్య పిలుపునిచ్చారు. దేశంలో కుట్రలు చేసి భద్రతకు హాని కలిగించాలని తీవ్రవ్యాఖ్యలు చేశారు. దేశంలో అనేక చోట్ల విధ్వంసాలకు పాల్పడాలని కుట్రపన్నారు. నవంబర్ 24న కేసు నమోదైంది. సీపీఐ మావోయిస్టు పార్టీకి మద్దతు తెలపడంతో పాటు వారి భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రసంగించారు. ప్రజలను విద్వేషాల వైపు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. గాదె ఇన్నయ్యకు అనేకమంది మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నాయి. మావోయిస్టు రిక్రూట్మెంట్‌తో పాటు పార్టీకి ఫండింగ్ కూడా చేశారు. ఇలాంటి వ్యక్తులు బయట ఉంటే ప్రమాదకరం' అని ఉంది. మావోయిస్టు నేత హిడ్మా ఎన్ కౌంటర్ తర్వాత గాదె ఇన్నయ్య ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. హిడ్మా తల్లిని కలిశారు. అక్కడున్న నేషనల్, స్టేట్ మీడియాతో పాటు యూట్యూబ్ ఛానళ్లతో హిడ్మా మరణంపై ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. ఈ సమయంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా మాట్లాడారు. అమిత్ షా తీరును తప్పుబట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై ఎన్ఐఏ ఫోకస్ పెట్టింది.

# రేవంత్ స్ట్రీట్ రౌడీలా మాట్లాడారు

- ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అపసోపాలు
- హామీలపై మాయ మాటలు చెబితే ఎలా
- ఉత్తమ్‌కు విషయ పరిజ్ఞానం లేదు
- మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, డిసెంబరు 22:** రేవంత్ రెడ్డికి నీతి జాతి లేదని, ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో కూడా తెలియదని, రేవంత్ రెడ్డి... రేపు ఏ పార్టీలో ఉంటాడో తెలియదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ స్ట్రీట్ రౌడీ మాదిరి మాట్లాడారని విమర్శించారు. త్యాగాల చరిత్ర తమది అని.. వెన్నుపోటుకు మారు పేరు రేవంత్ రెడ్డి అని కామెంట్స్ చేశారు. సంకుచిత, మరుగుజ్జు మనస్తత్వంతో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను తెలంగాణ ద్రోహిగా కేసీఆర్ ప్రజల ముందు నిలబెట్టారని అన్నారు. కేసీఆర్ ప్రజల పక్షాన ప్రశ్నిస్తే.. సీఎం, నీళ్ల మంత్రికి ఎందుకంత నొప్పి అని నిలదీశారు. ఎవరి ఒత్తిడితో నీటి వాటాను తగ్గించుకున్నారని ప్రశ్నించారు. 45 టీఎంసీలకు.. మంత్రి ఉత్తమ్ స్వయంగా తన దస్తూరితో కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఉత్తర కుమారుడిలా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అనుభవమంతా దోపిడికి, లూటీకి పనికొస్తుం దంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలపై రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో స్పందించిన తీరును బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తప్పుపట్టారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ ఒక స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ రెడ్డి స్ట్రీట్ రౌడీలా మాట్లాడారని విమర్శించారు. ఓ గల్లీ రౌడీ మాటలు, ఓ గూండా మాటల్లా రేవంత్‌రెడ్డి మాటలు ఉన్నాయని విమర్శించారు. తెలంగాణకు ఒక నొక్కుపడనియ్యను అని కేసీఆర్ చాలా గొప్పగా మాట్లాడారని, ఆ మాటతో సీఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వచ్చిన నొప్పి ఏమిటో అర్థం కావడం లేదని హరీశ్ రావు అన్నారు. తప్పు చేసేంద్రు కాబట్టే వాళ్లకు నొప్పి కలుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిన్న ఉత్తరకుమారుడిగా తేలిపోయారని ఎద్దేవా చేశారు. ఆసరా పింఛన్‌లను రూ.4 వేలకు పెంచుతామని ఎందుకు పెంచలేదని కేసీఆర్ ప్రశ్నించారని, దానికి మీరు ఎందుకు సమాధానం చెప్పలేదని ఇందుకు సంబంధించి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉన్నదని, నిధులు ఎలా సమీకరించాలో, ప్రజలకు ఎలా ఇవ్వాలో బాగా తెలుసని ఎన్నికల ముందు చెప్పింద్రు కదా.. ఇప్పుడు ఏమైంది అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మీ అనుభవం అంతా దోపిడీలకు, కమిషన్లకు, వాటాలకు, లూటీలకే సరిపోయిందా..? అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ హయాంలో ఆటో డ్రైవర్లకు ఫోన్ చేస్తే యూరియా బస్తాలు తెచ్చి ఇంట్లో వేసి వెళ్లేవారని, ఇప్పుడు చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని, యాప్‌లు, మ్యాప్‌లతో రైతులను ఎందుకు గోసపెడుతున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. దానికి మీ సమాధానం ఏదీ అని హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ నగర శ్రేయస్సు కోసం తాము ఫార్మాసిటీ కోసం కేటాయించిన స్థలంలో ఇప్పుడు ఫ్యూచర్ సిటీ ఎందుకు అంటున్నారని కేసీఆర్ అడిగిన ప్రశ్నకు సీఎం నుంచి సమాధానం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాల గురించి, హైదరాబాద్ శ్రేయస్సు గురించి మాట్లాడితే.. రేవంత్ రెడ్డి అంతా సొల్లు మాట్లాడారని విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో ఆర్థిక అరాచకత్వం సాగింది' అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలపై కూడా మాజీ మంత్రి మండిపడ్డారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో నువ్వు ఆహ్వానించిన ప్రముఖులే తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొనియాడారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆర్బీఐ గవర్నర్ సుబ్బారావు మాట్లాడిన మాటలను రేవంత్ రెడ్డి ఒకసారి వీడియో పెట్టుకుని చూడాలని సూచించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అద్భుతమైన ఆర్థిక ప్రగతిని సాధించిందని, మూడు రెట్ల జీఎస్‌డీపీని సాధించిందని, మూడు రెట్ల తలసరి ఆదాయం పెరిగిందని వారు కేసీఆర్ పాలనను మెచ్చుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేను కొంటూ రూ.50 లక్షలతో పట్టుబడి దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని అన్నారు. రూ.50 కోట్లకు రేవంత్ పీసీసీ పదవి కొనుక్కున్నాడని కోమటిరెడ్డి వెంకటరెడ్డే చెప్పారని గుర్తుచేశారు. రేవంత్‌కు ఒక స్టాండ్, సిద్ధాంతం, పద్ధతి లేదన్నారు. ధాన్యం, డాక్టర్ ఉత్తర్వుతో తెలంగాణను నంబర్ వన్ చేసింది కేసీఆర్ అని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఇప్పుడైనా ప్రిపేర్ అయ్యి ప్రెస్‌మీట్స్ నిర్వహించాలని ఎద్దేవా చేశారు. నీళ్ల మంత్రి ఉత్తమ్‌కు సగం సగం నాలెడ్జ్ మాత్రమే ఉందంటూ మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్ చేశారు.

# ఒకే గొడుగు కిందకు
## రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

- భూభారతి పోర్టల్‌తో అనుసంధానం
- ఒక్క క్లిక్‌తో రైతులకు పూర్తి భూసమాచారం
- ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ రూపకల్పన
- సీసీఎల్‌కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, డిసెంబర్ 22 :** భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా వేగవంతంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే ప్లాట్ ఫామ్ మీదకు తీసుకువచ్చి భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వచ్చే జనవరి నెలలో ఆధునీకరించిన ఈ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సోమవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాంపల్లిలోని సి.సి.ఎల్.ఎ. కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ భూ పరిపాలనకు కేంద్రమైన సిసిఎల్ ఎ కార్యాలయం నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ఆఫీసును ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తానని, అప్పటివరకు కొంతమార్పు కనిపించాలని అన్నారు. వరుసగా విభాగాల వారీగా సమీక్షించడం కూడా జరుగుతుందని ఇందుకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ జరిపిందని, ఇప్పటికీ కొన్ని భూముల ప్రైవేటు వ్యక్తుల పేరు మీదే ఉన్నాయని ఇవన్నీ కూడా రికార్డులలో మార్చాలని, అలాగే అసైన్డ్ , భూదాన్ భూములపై సమీక్షతో పాటు కొన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఏ విభాగంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, కోర్టు కేసులన్నింటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగానిర్మించబోయే తహశీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌గా ఉండాలని ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఒక్క క్లిక్‌తో రైతుకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా అదేవిధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్ , గ్రామాల నక్షా, ఫీడ్ బ్యాక్ వంటి పూర్తి సమాచారం లభించేలా సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలతో అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావాల్సిన సమాచారం లభిస్తుందన్నారు. క్రయ విక్రయదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ ను రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ చేసే ప్రతిపనిలో సామాన్యుని కోణం ఉండాలని ఎలాంటి లోపాలకు, తారుమారుకు ఆస్కారం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పరచాలని సూచించారు ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐ.జీ. రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్ఎ ఇన్‌ఛార్జి కార్యదర్శి మంద మకరంద్, ఎన్.ఐ.సి. ఎస్.ఐ.ఓ ప్రసాద్, విజయమోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో టెస్కోకు ప్రభుత్వ శాఖల వస్త్ర ఆర్డర్లు అందజేయాలి

**ఆదేశాలు పాటించని శాఖలపై చర్యలు**

**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**



**హైదరాబాద్, డిసెంబర్ 22:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు తమకు అవసరమైన వస్త్రాల ఆర్డర్లను వారం రోజుల్లో టెస్కో (తెలంగాణ స్టేట్‌కోఆపరేటివ్‌హ్యాండ్లూమ్ వీవర్స్‌సొసైటీ-%టెస్కో)కు అందజేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. నిర్దేశిత గడువులో ఆర్డర్లు ఇవ్వని శాఖలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు సచివాలయంలో చేనేత మరియు జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజ రామయ్యర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, టెస్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025%-%26 సంవత్సరానికి గాను అన్ని ప్రభుత్వ శాఖలు తమ వస్త్ర అవసరాలకు సంబంధించిన ఇండెంట్లను వారం రోజుల్లో టెస్కోకు అందజేయాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అలాగే, వివిధ శాఖలు టెస్కోకు బకాయి ఉన్న నిధులను వెంటనే చెల్లించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. 2026%-%27 సంవత్సరానికి ఇప్పటివరకు కేవలం నాలుగు శాఖలు నుంచే ఆర్డర్లు వచ్చాయని, మిగిలిన శాఖలు కూడా వారం రోజుల్లో తమ ఆర్డర్లు ఇవ్వాలని అధికారులను కోరారు. వస్త్రాల ఇండెంట్‌తో పాటు 50 శాతం నిధులను అడ్వాన్స్‌గా చెల్లిస్తే, టెస్కో వెంటనే వస్త్ర ఉత్పత్తి ప్రారంభించి సకాలంలో సరఫరా చేయగలదని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాలను నిర్ణీత కాలవ్యవధిలో ఉత్పత్తి చేసి అందజేయాలని టెస్కో అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థల నుంచి వస్త్ర కొనుగోలుకు వంద శాతం ఆర్డర్లు టెస్కో ద్వారానే తీసుకునేలా చర్యలు చేపట్టాలని, ఆ ఆర్డర్లను చేనేత మరియు పవర్‌లూమ్ సంఘాలకు వర్క్ ఆర్డర్లుగా మళ్లించి నేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని జౌళి శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, స్త్రీ%-%శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, టెస్కో అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






# రాయదుర్గంలో డ్రగ్స్ కలకలం

## హాస్టల్ అడ్డాగా దందా..
## ఐదుగురు అరెస్ట్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22 (మనసులో మాట):**

హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ ముఠా గుట్టు రట్టయింది. పీజీ హాస్టళ్లే అడ్డాగా చేసుకుని మాదకద్రవ్యాల దందా సాగిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్నెట్ పీజీ హాస్టల్‌లో కొంతమంది వ్యక్తులు ఉంటూ డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. హాస్టల్‌పై చేసిన ఆకస్మిక తనిఖీల్లో ఐదుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 12 గ్రాముల ఎండిఎంఏ, 7 గ్రాముల ఓజీ గాంజా, 6 మొబైల్ ఫోన్లు, రూ. 60 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేశామని, డ్రగ్స్ ఎక్కడి నుంచి తెస్తున్నారు, ఎవరికి విక్రయిస్తున్నారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జర్నలిస్టులకు
# కొత్త నిబంధనలు

**'అక్రిడిటేషన్ రూల్స్-2025' జీవో జారీ**

**2016 నిబంధనలు రద్దు.. రెండు రకాల కార్డుల విధానం అమలు**

**డిజిటల్ మీడియాకు కఠిన నిబంధనలు.. 5 లక్షల విజిటర్స్ తప్పనిసరి**

**స్టేట్ లెవల్ రిపోర్టర్‌కు డిగ్రీ, మండల స్థాయికి ఇంటర్మీడియట్ అర్హత**

**హైదరాబాద్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇచ్చే గుర్తింపు కార్డుల (అక్రిడిటేషన్) జారీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, నూతనంగా 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025'ను ఖరారు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం. 252 ను విడుదల చేసింది.

### కొత్త నిబంధనలు ఇలా..

ఇకపై జర్నలిస్టుల పనితీరును బట్టి రెండు రకాల కార్డులను జారీ చేయనున్నారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే రిపోర్టర్లకు ఇది ఇస్తారు. ఇది ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడానికి, సమాచార సేకరణకు గుర్తింపుగా పనిచేస్తుంది. డెస్క్ జర్నలిస్టులకు ఈ కార్డును జారీ చేస్తారు. ఇది కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు (హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర) పొందేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది.




### డిజిటల్ మీడియాకు నిబంధనలు

తొలిసారిగా డిజిటల్ న్యూస్ మీడియా (వెబ్‌సైట్లు)కు స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అక్రిడిటేషన్ పొందాలనుకునే వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది యూనిక్ విజిటర్స్ ఉండాలి. ఈ కేటగిరీలో రాష్ట్రవ్యాప్తంగా గరిష్టంగా 10 కార్డులు మాత్రమే మంజూరు చేస్తారు.

### విద్యార్హతలు - అనుభవం

రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టుకు డిగ్రీ అర్హత లేదా ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. నియోజకవర్గ/మండల స్థాయి: రూరల్ రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హతను తప్పనిసరి చేశారు.

### పత్రికలు, ఛానళ్లకు ప్రమాణాలు

ప్రింట్ మీడియా కనీసం 2,000 ప్రతులు సర్క్యులేషన్ ఉన్న దినపత్రికలే అక్రిడిటేషన్‌కు అర్హత సాధిస్తాయి. వీటికి పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఎలక్ట్రానిక్ మీడియా.. శాటిలైట్ ఛానళ్లు 50% వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు ప్రసారం చేయాలి.

### కమిటీల కాలపరిమితి

రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కొత్త కమిటీలు ఏర్పడే వరకు పాతవే కొనసాగుతాయి. రాష్ట్ర కమిటీకి మీడియా అకాడమీ చైర్మన్, జిల్లా కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కార్డు పోతే డూప్లికేట్ కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుంది.




# ప్రజలే మనకు బాస్‌లు

**వారికి జవాబుదారీగా ఉండాలి**

**భూ భారతి దరఖాస్తులకు జనవరి 15 డెడ్‌లైన్**

**తహసీల్దార్ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం ఉండకూడదు**

**సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు**

**కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

"ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజలే బాస్‌లు. వారికి నిజాయితీగా, నిస్వార్థంగా సేవలందించాలి" అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులకు హితవు పలికారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ముఖ్యంగా నవంబర్ 15 కంటే ముందు పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను జనవరి 15 నాటికి పూర్తిగా పరిష్కరించాలని డెడ్‌లైన్ విధించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని, దళారుల వ్యవస్థను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, కార్యాలయాల్లో హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు ఆలస్యంగా రావడం వల్ల భూ రిజిస్ట్రేషన్లు, స్లాట్ బుకింగ్, రికార్డు లాగిన్ వంటి పనులు ఆలస్యమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమయం చాలా విలువైందని గుర్తుచేశారు. భూ రికార్డులను భద్రపరిచి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందన్నారు. అలాగే కుల ధృవీకరణ పత్రాల మంజూరులో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఫైల్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలను ఉద్యోగులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగ రావు, ఆర్డీవోలు రమాదేవి (మెదక్), జయచంద్ర (తూప్రాన్), మహిపాల్ (నర్సాపూర్), తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మనస్తాపం చెంది వృద్ధుడి ఆత్మహత్య

**లక్ష్మీపూర్‌లో విషాదం**



**గొల్లపల్లి, డిసెంబర్ 22 (మనసులో మాట):**

దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కర్రె మల్లయ్య (67) గత మూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు నడుము నొప్పి, కాళ్లు, చేతులు సరిగా పనిచేయకపోవడంతో శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అనారోగ్య బాధలు భరించలేక, జీవితంపై విరక్తి చెంది ఆదివారం గ్రామ శివారులోని దీకొండ గుట్ట కింద ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కర్రె నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల మ్యాపింగ్
# వేగవంతం చేయాలి

**పనిచేయని బీఎల్‌ఓలను తొలగించండి**

**పనితీరుపై అసహనం.. వారం రోజుల్లో మార్పు రావాలని ఆదేశం**




**నారాయణపేట, డిసెంబర్ 22 (మనసులో మాట):**

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్షించారు. పట్టణ ప్రాంతాల్లో రోజుకు కనీసం 10 వేల చొప్పున మ్యాపింగ్ పూర్తి చేయాలని సీఈఓ లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే ఓటర్ల జాబితాలో స్పష్టంగా లేని , చిన్నవిగా ఉన్న, సక్రమంగా లేని ఫోటోలను గుర్తించి, ఫారం-8 ద్వారా వాస్తవ ఫోటోలను సేకరించి అప్‌డేట్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 2026 జనవరి 13 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నారాయణపేట కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అనంతరం స్థానిక అధికారులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే నారాయణపేట జిల్లా ఓటర్ల మ్యాపింగ్‌లో చివరి స్థానంలో ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రాబోయే వారం, పది రోజుల్లో జిల్లా పనితీరు మెరుగుపడాలని తహసీల్దార్లను ఆదేశించారు. బీఎల్‌ఓల వారీగా సమీక్ష నిర్వహించాలని, పనిలో పురోగతి చూపించని బీఎల్‌ఓలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించి పని పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, అన్ని మండలాల తహసీల్దార్లు, సీ-సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ల వద్ద
# రక్షణ చర్యలు చేపట్టాలి

**జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

ఓఆర్‌ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల వద్ద భవిష్యత్ అవసరాల దృష్ట్యా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి బృందావన్ కాలనీ, మంచిరేవుల, నార్సింగి ప్రాంతాల్లోని రిజర్వాయర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ల చుట్టూ రక్షణగా ప్రహరీ గోడలను నిర్మించాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రిజర్వాయర్ల వద్ద గార్డెనింగ్, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టి సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఎత్తయిన గేట్లను నిర్మించి, రిజర్వాయర్ వివరాలతో కూడిన బోర్డులను, "రక్షిత స్థలం - ప్రవేశం నిషిద్ధం" అనే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జలమండలి స్థలాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలమండలి స్థలాల్లో కొందరు ప్రైవేట్ వ్యక్తులు వాహనాల ద్వారా నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎస్‌ఆర్ డీజీ స్కూల్‌లో ఘనంగా గణిత దినోత్సవం

**అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు**



**కరీంనగర్, డిసెంబర్ 22:** ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ అశోక్ నగర్‌లోని ఎస్‌ఆర్ డిజి స్కూల్‌లో గణిత దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, అబాకస్ 2.0 వ్యవస్థాపకులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడ్డగట్ల గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత, విద్యాపరమైన ఎదుగుదలకు గణితం ఎంతో దోహదపడుతుందని, గణితంపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు తమ మేధోశక్తిని పెంచుకోవచ్చని సూచించారు. ఎస్‌ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్‌చార్జి శశిధర్ మాట్లాడుతూ సమాజంపై గణిత శాస్త్ర ప్రభావం ఎంతో ఉందని, ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధికి గణితం అత్యవసరమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ విద్యార్థుల మానసిక శ్రేయస్సు, పురోగతికి గణితం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ గణిత నమూనాలు (ప్రాజెక్టులు), ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రమాణ స్వీకారం రోజే అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ. 10 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన**



**గొల్లపల్లి, డిసెంబర్ 22 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో నూతన పాలకవర్గం కొలువుదీరిన తొలిరోజే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గ్రామ సర్పంచ్‌గా కాసరపు భవానీ అరవింద్ గౌడ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, గ్రామాభివృద్ధిపై తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో మంజూరైన రూ. 10 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ శంకుస్థాపన చేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన రోజే ప్రజావసరాల కోసం రోడ్డు పనులను ప్రారంభించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

**గొల్లపల్లి సర్పంచ్‌గా నల్ల నీరజ సతీష్ రెడ్డి ప్రమాణ స్వీకారం**



**గొల్లపల్లి, డిసెంబర్ 22 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో సోమవారం నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గం కొలువుదీరింది. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నూతన సర్పంచ్‌గా నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్‌గా గురిజాల బుచ్చిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల నీరజ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. చిన్న, పెద్ద అనే తారతమ్యాలు, భేదాభిప్రాయాలు లేకుండా అందరూ కలిసికట్టుగా సహకరిస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజలు తమ సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, కారబార్ మహేష్, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

**ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి**

**బయ్యారం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం**



**గజ్వేల్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బయ్యారం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ మైస కళ్యాణి ప్రశాంత్, ఉప సర్పంచ్ మైపాల్ రెడ్డి మరియు వార్డు సభ్యులను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం గ్రామ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి బయ్యారంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రశాంత్, ప్రవీణ్, స్వామి, సురేందర్, శారదా, ప్రియాంక, గణేష్, భవాని, ఆరోగ్యమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, నాయకులు పెంటయ్య, పాపిరెడ్డి, దయానంద రెడ్డి, అనిల్ రెడ్డి, బాపురెడ్డి, కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సౌజన్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ సయ్యద్ బాబా, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్కార్ వైద్యానికి 'ఐఏఎస్' బ్రాండ్

**గాంధీలో ప్రసవించిన అధికారి గౌతమ్ సతీమణి**

**హైదరాబాద్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

తెలంగాణలో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం నానాటికీ బలపడుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే వెనుకడుగు వేసే పరిస్థితి నుంచి, నేడు రాష్ట్రంలోని అత్యున్నత స్థాయి అధికారులే క్యూ కట్టే స్థాయికి సర్కార్ వైద్యం ఎదిగింది. లక్షల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లే స్థోమత ఉన్నప్పటికీ, ప్రభుత్వ డాక్టర్ల నైపుణ్యంపై భరోసాతో ఐఏఎస్ అధికారులు తమ కుటుంబ సభ్యులకు సర్కార్ దవాఖానాల్లోనే చికిత్స చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా ఐఏఎస్ అధికారి గౌతమ్ తన సతీమణి ప్రసవం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిని ఎంచుకున్నారు. సోమవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శోభ నేతృత్వంలోని వైద్య బృందం వెంటనే స్పందించి, అత్యంత జాగ్రత్తగా సిజేరియన్ ద్వారా ప్రసవం చేసింది. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.

# ప్రజాస్వామ్యంలో సర్పంచుల పాత్రే కీలకం

- గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ నిధులే ఆధారం
- మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి
- రాయికల్ మండలంలో ఘనంగా నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం



**రాయికల్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలకు ఎనలేని ప్రాధాన్యత ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణలో సర్పంచులదే కీలక పాత్ర అని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని సింగరావుపేట, అల్లీపూర్, ఉప్పుమడుగు, అయోధ్య, మైతాపూర్ గ్రామాలలో ఆదివారం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఈ గ్రామాలతో నాలుగు దశాబ్దాలుగా విడదీయరాని అనుబంధం ఉందని, తన రాజకీయ అరంగేట్రానికి, ప్రజా జీవితంలో కొనసాగడానికి గ్రామ పంచాయతీలే అండగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజలకు మొదట గుర్తొచ్చే వ్యక్తిగా ఉండాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాన్ని తమ సొంత కుటుంబంగా భావించి, ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా నిలవాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు మంజూరు చేసేందుకు దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారని, తద్వారా నేడు కేంద్రం నుంచి నేరుగా నిధులు అందుతున్నాయని తెలిపారు. అలాగే యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుపేదలందరికీ ఉపాధి కల్పించాలనే సంకల్పంతో జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం జాతిని ఏకం చేసిన మహాత్ముడి పేరును ఈ పథకానికి పెట్టారని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కరువు సమయాల్లోనూ కూలీలకు ఈ పథకం అండగా నిలుస్తోందన్నారు. నాడు ప్రారంభించిన ఉపాధి హామీ పథకమే నేడు గ్రామాల అభివృద్ధికి ప్రధాన ఆధారంగా మారిందని, జనాభా ప్రాతిపదికన వచ్చే ఈ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# తిగుల్ సర్పంచ్‌గా రజిత ప్రమాణ స్వీకారం

**జగదేవపూర్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామ పంచాయతీలో సోమవారం నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రజిత మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగదేవపూర్ రజక సంఘం అధ్యక్షుడిగా రాచకొండ సీతారాములు

**తిగుల్ గ్రామంలో ఘన సన్మానం**



**జగదేవపూర్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

జగదేవపూర్ మండల రజక సంఘం నూతన అధ్యక్షుడిగా తిగుల్ గ్రామానికి చెందిన రాచకొండ సీతారాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం తిగుల్ గ్రామంలో రజక సంఘం నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. సీతారాములుకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ప్రత్యేకంగా అభినందించారు. మండల స్థాయి పదవికి తమ గ్రామస్తుడు ఎంపిక కావడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శ్రీనివాస్, తిరుపతి, స్వామి, భిక్షపతి, కిష్టయ్య, గణేశ్, కనకయ్య, నాగయ్య, శ్రీకాంత్, బల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ శకం ముగిసింది

**గజ్వేల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి -మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**



- నమ్మి ఓట్లేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్న ఇక్కడి జనం
- పేదల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టింది నువ్వు కాదా...?
- రాష్ట్రాన్ని ఆర్థికంగా దోచుకొని భ్రష్టు పట్టించిన కెసిఆర్ కుటుంబం-

**గజ్వేల్, డిసెంబర్ 22 (మనసులో మాట):**

నమ్మి ఓట్లు వేసిన గజ్వేల్ ప్రజలకు కేసీఆర్ తీరని ద్రోహం చేశారని, ఇక్కడి ప్రజలకు ఆయన తక్షణం క్షమాపణ చెప్పాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్ష రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల తర్వాత చుక్క తెగిపడ్డట్లు బయటకు వచ్చిన కేసీఆర్.. మళ్లీ పునర్దర్శనం ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. గజ్వేల్ ప్రజల సొమ్మును అప్పనంగా వాడేసుకున్నారని, ప్రాజెక్టుల పేరిట సర్వం కోల్పోయిన నిర్వాసితులు, ముంపు బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల డబ్బును దోచుకున్న సొంత పార్టీ నేతల నుంచి ఆ సొమ్మును కక్కించాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమానికి ముందు కనీస వసతులు లేని కేసీఆర్ కుటుంబ సభ్యులు.. నేడు విదేశాల్లో చదువుకునే స్థాయికి ఎలా ఎదిగారని, ఆ డబ్బంతా ఎక్కడిదని నర్సారెడ్డి నిలదీశారు. ప్రభుత్వ, పేదల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టింది కేసీఆరేనని, ఆ భూములన్నింటినీ తన బినామీలకు కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకొని విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా భ్రష్టు పట్టించిన ఘనత కేసీఆర్ కుటుంబానిదేనని, ఆయన చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే రాష్ట్ర ఆదాయం సరిపోతుందని విమర్శించారు. చేసిన అక్రమాలతో జైలుకు వెళ్తాననే భయంతోనే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి తన హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై సమాధానం చెప్పాలని నర్సారెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగిసిపోయిందని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అబద్ధాలతో ప్రజలను ఇక మభ్యపెట్టలేరని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, మంత్రుల అక్రమాల చిట్టా ప్రభుత్వం వద్ద ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పెరుక కుల హక్కుల సాధనకే పోరాటం

- మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక
- రాజకీయాలకు అతీతంగా సంఘం పనిచేయాలి: రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్
- జిల్లా అధ్యక్షుడిగా బోడ్డు శంకర్, ప్రధాన కార్యదర్శిగా చుంచు రాజు కిరణ్

**లక్సెట్టిపేట/మంచిర్యాల, డిసెంబర్ 22 (మనసులో మాట):**

పెరుక కులస్తుల హక్కుల సాధన, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా మంచిర్యాల జిల్లా పెరుక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్సెట్టిపేటలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర పెరుక సంఘం అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా బోడ్డు శంకర్, ప్రధాన కార్యదర్శిగా చుంచు రాజు కిరణ్, గౌరవ అధ్యక్షుడిగా పెట్టెం లక్ష్మణ్‌లను రాష్ట్ర కమిటీ, కుల పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గటిక విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పెరుక సంఘం బలోపేతానికి, కులస్తుల హక్కుల పరిరక్షణకు నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. సంఘం నాయకులు ఎల్లప్పుడూ సభ్యులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా మిగిలిన మండల, గ్రామ స్థాయి కమిటీలను కూడా పూర్తి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మద్ద లింగయ్య, విద్యార్థి వసతి గృహ అధ్యక్షుడు గంగాధరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు సుందరి ఆనంద్, చుంచు ఉషన్న, జిల్లా నాయకులు తిప్పని లింగయ్య, సందేల వెంకటేష్, గడ్డం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, బొప్పు సతీష్, జిల్లా పెరుక యూత్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, లక్సెట్టిపేట అధ్యక్షుడు చిన్న రమేష్, యూత్ నాయకులు అంకతి తిరుపతి, ఎంబడి తిరుపతి, అశోక్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# యువతలో ధైర్యం, సమగ్ర మానవత్వం విలువల ప్రోత్సాహం

**జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్**

**ఆసిఫాబాద్ :** వీర్ బాల్ దివస్ ద్వారా యువతలో ధైర్యం, సమగ్ర మానవత్వ విలువలను ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలు తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ వరకు వీర్ బాల్ దివస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన జరగనున్న కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల అంశాలపై పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అంగన్వాడి పాఠశాలలలో కథలు చెప్పడం, ఆటలు, ప్రాథమిక పాఠశాలలలో బొమ్మలు గీయడం, కథలు చెప్పడం, బాల బాలికల ఉన్నత పాఠశాలలలో వ్యాసరచన పోటీలు, ముగ్గులు, కళాశాలలలో సందేశాత్మక నాటికలు సమగ్ర అంశాలపై చర్చ, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఈ నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త శారద, జెండర్ స్పెషలిస్ట్ రాణి, రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, పి టి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆహార సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు**

**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు, విధులు నిర్వహించే వైద్యాధికారులకు ఆహారం సరఫరా చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలను రెండు సంవత్సరాల కాలానికి అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు కోసం రూ.20 డిమాండ్ డ్రాఫ్ట్ (నాన్-రిఫండబుల్)ను సూపరింటెండెంట్, జీజీహెచ్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ పేరిట చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పూర్తిగా నింపిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాల్సిందిగా సూచించారు. ఈ ప్రక్రియలో అర్హత కలిగిన స్థానిక / జిల్లా మహిళా సమాఖ్యలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తెలిపారు.

# ఆహార సరఫరాకు దరఖాస్తుల స్వీకరణ

**ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలోని సామాజిక ఆసుపత్రులు, కాగజ్ నగర్ ఏరియా ఆసుపత్రిలోని రోగులకు, విధులు నిర్వహించే వైద్యాధికారులకు ఆహారం సరఫరా చేయుట కొరకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ టౌన్, బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి, జైనూర్ లలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, కాగజ్ నగర్ లోని ఏరియా ఆసుపత్రిలో 2 సంవత్సరాల కాలానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 23, 24, 27 తేదీలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సూపరింటెండెంట్, డిస్టిక్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్స్ పేరిట 5 రూపాయలతో డి.డి. డిడి రూపంలో చెల్లించి దరఖాస్తులు పొందవచ్చని, ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి 50 వేల రూపాయలు, ఏరియా ఆసుపత్రికి 1 లక్ష రూపాయలు డి డి రూపంలో చెల్లించాలని, అర్హత కలిగిన స్థానిక/ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళా సమాఖ్యలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# అనాథ పిల్లలకు సర్పంచ్ సహాయం



**సిర్పూర్(యు):** తల్లి తండ్రిని కొల్పోయిన అనాథ పిల్లలకు తమ వంతు చేయుతానందించి అదుకుంటామని రాఘాపూర్ సర్పంచ్ అత్రం విజయబీర్ష అన్నారు. రఘుపూర్ గ్రామంలో సోయం హన్మమంత్ రావ్ దంపతులు ఇటీవల మృతి చెందగా వారి సంతనం ఆయన ఓ కూతురు , ఓ కుమారుడు ఆయన అనాథలుగా మారారు. దీంతో వారిని చదువుతోపాటు అన్ని రకాలుగా ఆదుకుంటామని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కారోబారీ చిత్రం రాజు ,ఆదివాసి యువజన సంఘం నాయకుడు కనక లింగు, గ్రామ పటేల్ దేవర, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు నట్టల నివారణ టీకాలు



**నేరడిగొండ:** మండలంలోని గొర్రెలు, మేకలకు సామూహిక ఉచిత నట్టల నివారణ టీకాలు వేయడం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జనవరి 2 వరకు రోజు వారీగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శిభిరాలు ఏర్పాటు చేసి నట్టల నివారణకు మందులు పేర్కొన్నారు.

# జిల్లాలోని పర్యాటక అద్భుతాలు గుర్తించండి

- ఫొటోలు, వీడియోలతో పరిచయం చేస్తే భారీ నగదు బహుమతులు
- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే




**ఆసిఫాబాద్:** జిల్లాలో ఇప్పటివరకు ప్రజలకు పెద్దగా తెలియని పర్యాటక అద్భుతాలను ఫొటో లు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భారీ నగదు బహుమతులు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా పర్యా టక శాఖ అధికారి అష్ఫాక్ అహ్మద్తో కలిసి '100 వీకెం డ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలు వారాంతాల్లో విహారయాత్రల కోసం కొత్త ప్రదేశాలను అన్వేషిస్తుంటారని, ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర పర్యాటక శాఖ '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' అనే ప్రత్యేక పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు తెలియని జలపాతాలు, పురాతన దేవాలయాలు, ట్రెక్కింగ్ ప్రాంతాలు వంటి 100కొత్త పర్యాటక గమ్యస్థానాలను గుర్తించి, వాటి వివరాలతో ఒక కాఫీ టేబుల్ బుక్ రూపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పోటీలో నేచర్, వైల్డ్ లైఫ్, ఆర్ట్ అండ్ కల్చర్, హెరిటేజ్, వాటర్ బాడీస్, వంటకాలు, ఫామ్ స్టేస్, రిసార్ట్స్, స్పిరిచువల్, అడ్వెంచర్ వంటి 10 విభాగాల్లో ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు. ఎంచుకున్న ప్రదేశానికి సంబంధించి మూడు మంచి ఫొటోలు, 60 సెకన్ల నిడివి గల వీడియోతో పాటు, రవాణా, బస, బడ్జెట్ వివరాలతో కూడిన 100 పదాల సమాచారం సమర్పించాలని సూచించారు. పోస్టర్లో పేర్కొన్న గూగుల్ ఫామ్ లేదా సోషల్ మీడియా ఖాతాలను ట్యాగ్ చేస్తూ ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు. ఉత్తమ ఎంట్రీలకు మొదటి బహుమతిగా రూ.50,000, రెండో బహుమతిగా రూ.30,000, మూడో బహుమతిగా రూ.20,000 అందించనున్నట్లు వెల్లడించారు. అదనంగా, కన్సోలేషన్ బహుమతులుగా హరిత హోటల్స్లో ఉచిత బస సదు-పాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి 5వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధియే లక్ష్యంగా పని చేయాలి

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆసిఫాబాద్ మండల పరిధిలోని రాజంపేట, గుండి, కౌట గూడ గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను అభినందించారు. రాజంపేట, గుండి, కౌటగూడ సర్పంచులుగా ఎన్నికైన బుర్స పోచయ్య, జాబరి రవీందర్, కుడిమేత స్వప్న-లక్ష్మి నారాయణలు





పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారితో పాటు ఉప సర్పంచులుగా మడవి లక్ష్మి, చౌదరి సంతోష్, భీమయ్య మరియు వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ అభినందనలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నప్పటికీ, గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. ప్రజల సంక్షేమం కోసం, గ్రామాల మౌలిక వసతుల కల్పన కోసం అంకితభావంతో పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# పాడె మోసిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్

**ఆసిఫాబాద్ టౌన్:** అసిఫాబాద్ పట్టణానికి చెందిన బీ ఆర్ ఎస్ నాయకుడు షేక్ అహ్మద్ నవాబ్ ఆదివారం రాత్రి హఠాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ వెంటనే ఆయన నివాసానికి చేరుకొని పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అహ్మద్ హఠాన్మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన బాధపడ్డారు.

**పాడె మోసి గౌరవం**

ముస్లిం సంప్రదాయం ప్రకారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ స్వయంగా అహ్మద్ నవాబ్ పాడె మోశారు. కబరస్థాన్ వరకు అంతిమ యాత్రలో పాల్గొని, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి తన మిత్రుడికి కడసారి వీడ్కోలు పలికారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ ఛైర్మెన్ మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సాహితీవేత్త మధూ బావల్కర్‌కు అరుదైన గౌరవం




**ఆదిలాబాద్:** జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ బహుభాషా కవి, సాహితీవేత్త మధూ బావల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. మహారాష్ట్రలోని పూణే నగరంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని జనవరి 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న రెండవ ఇంటర్నేషనల్ పూలే ఫెస్టివల్ కు ఆయనను అధ్యక్షుడిగా నిర్వాహకులు ఎంపిక చేశారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సాహితీ ఉత్సవంలో దేశ విదేశాల నుంచి వందలాది మంది కవులు, కళాకారులు పాల్గొని తమ కవితలు, కళారూపాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించేందుకు మధూ బావల్కర్‌ను ఎంపిక చేసినట్లు ఫెస్టివల్ నిర్వాహకులు విజయ్ వడ్వేకర్ నియామక పత్రాన్ని పంపించారు. హిందీ, మరాఠీ, ఉర్దూ భాషల్లో నిష్ణాతులైన మధూ బావల్కర్ దేశ వ్యాప్తంగా వందలాది సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని వేలాది కవితలు రచించారు. ఆయన రచించిన కవితలు, వ్యాసాలు దేశ విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందాయి. తెలంగాణ ప్రాంతంలోని వెనుకబడిన ప్రాంతం నుంచి కవికి అంతర్జాతీయ సాహిత్యోత్సవానికి అధ్యక్ష స్థానం లభించడం గర్వకారణమని ఆదిలాబాద్ సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్త మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పేట్కులే మధూ బావల్కర్‌ను అభినందించారు.

# దుప్పట్ల పంపిణీ

**మంచిర్యాల:** అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు బ్లాంకెట్లు, నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. సోమవారం కాసిపేట మండలంలోని రొట్టెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల కొత్త తిరుమలాపూర్, కొత్తగూడ గ్రామాల్లో కార్యక్రమాలను చేపట్టారు. గత ఐదు సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాలకు వెళ్లి పేదలకు సహాయం అందిసుతండడంతో గ్రామస్తులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షయ ఫౌండేషన్ స్థాపకురాలు ఉష సురేష్, స్వప్న, ప్రీతి, తిరుమల, ప్రేమల, నాగమణి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులు అసంఘటిత రంగంలోకే వస్తారు. వారి సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా.. పత్రికా యాజమాన్యాలు చూస్తున్నాయి కదా అని ప్రభుత్వం పట్టించుకోదు. అయితే పత్రికా యాజమాన్యాలు కూడా పట్టించుకోవు. రోజంతా కష్టపడినా దమ్మిడీ ఆదాయం లేని జర్నలిస్టులు ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టలేక, ఈ రంగాన్ని వదిలి వేరే వృత్తి చేయలేక.. కష్టాల కొలిమిలో కాలుతూ నిరంతరం చస్తూ బతుకుతున్నారు. ఇంట్లో బాధ్యతలు, సమస్యలు చుట్టుముట్టినా.. బయట పదిమందీ పెట్టే నమస్కారాలతో కడుపు నింపుకుని, ఆకలిని మంచి నీళ్ళతో చంపుకునే జర్నలిస్టులు ఎందరో. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చేది ఒక్క అక్రెడిటేషన్. అదే పెద్ద గుర్తింపు.. అదే పెద్ద ప్రభుత్వ కొలువుగా సంబరపడిపోయే అల్ప సంతోషులు ఈ జర్నలిస్టులు. ఈ అక్రెడిటేషన్ మంజూరుకు ప్రభుత్వాలు సవాలక్ష షరతులు పెట్టి సామాజిక బాధ్యత కలిగిన జర్నలిస్టులను ఇబ్బంది పెట్టడం శోచనీయం. ప్రస్తుత నిబంధనలను అనుసరించి చిన్న పత్రికల జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మరీ కష్టం. ఈ కరువు కాలంలో పత్రికను నడపడమే కష్టంగా ఉండి ప్రతి రోజు ప్రసవవేదన అనుభవించే యాజమాన్యాలు , జర్నలిస్టులు అక్రెడిటేషన్ కోసం విధిస్తున్న నిబంధనలు చూసి సొమ్మసిల్లిపోతున్నాడు. పత్రిక తేవడమే కష్టం. మూసేద్దామనుకుంటే మరో పని రాదు. అష్టకష్టాలు పడి పేపర్ తీసుకొచ్చి ఏదో తనతో పాటు మరొకరికో.. ఇద్దరికో అక్రెడిటేషన్ లభిస్తుందని ఆడపడితే సర్కారు నిబంధనలతో ఆశలన్నీ పూర్తిగా నీరుగారిపోయాయి. ఇక కూటమి సర్కారు దాహం తీర్చడం చిన్న పత్రికల జర్నలిస్టుల్లో ఎవరికీ సాధ్యం కాకపోవచ్చునేమో.. అనే ఆరోపణలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు తెలుగు జర్నలిస్టులు.




# అక్రిడిటేషన్ కార్డు.. ఆస్కార్ అవార్డా..!?

## అదేమైనా బ్రహ్మ పదార్థమా... సవాలక్ష నిబంధనలు పెట్టడానికి..

## ప్రభుత్వ పరంగా ఇచ్చే గుర్తింపు కార్డు కోసం జీతం బత్తెం లేని జర్నలిస్టులపై ఎందుకిన్ని ఆంక్షలు?

## ప్రశ్నించే గొంతుపై కత్తి పెట్టే దుర్మార్గపు ఆలోచనా..?

## భజనపరులను దగ్గర చేసుకునే వ్యూహమా..?

## జీవోలు ఎవరికోసం...ఎవరు ఇస్తున్నారు..?

## నిబంధనలు సవరించండి

గత ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు..నిషేధాలతో జర్నలిస్టుల గొంతు నొక్కేసింది. ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం 'అమ్మకి కూడుపెట్టడు..కానీ పెద్దమ్మకు కోక కొంటాను' అన్నట్టు..అర్థం పర్థంలేని పద్ధతులతో... జర్నలిస్టుల జీవితాలతో ఆటలాడుతోంది. ఎంప్యానెల్మెంట్ ను జర్నలిస్టుకు ముడి పెట్టడం....ఏళ్ళ తరబడి పనిచేసిన వారిని కూడా వాళ్ళ అకడమిక్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ తెమ్మనడం.. అక్రిడేషన్ పొందిన నాటి నుండి నేటి వరకు ఉన్న పాత కార్డులు పెట్టమనడం ఇలా చాలా నిబంధనలు పెట్టి సాధ్యమైనంత వరకు పాత్రికేయులకు గుర్తింపు ఇవ్వకూడదనే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. మొదట్లో అక్రిడేషన్ కార్డులు ఇచ్చినప్పుడు పాతవి రిటర్న్ చేస్తేనే కొత్తవి ఇచ్చేవారు. ఆ విషయంలో కనీస అవగాహనలేని సమాచార శాఖ ఈ నిబంధనలు పెట్టడంలో అంతరార్ధం ఏమిటి? అక్షరం చొరవ లేనివాడు ఏ పత్రికల్లోనూ పనిచేయలేడు. వాడి వార్తలు, కథనాలే వాడి నైపుణ్యానికి నిదర్శనం. గతంలో ఉన్న రైల్వే పాస్‌లను కట్ చేశారు. ఇక ఆర్టీసీ బస్సు ఛార్జీల్లో మూడవ వంతు మాత్రమే ఛార్జి అని చెప్పి, రెండు వంతుల మొత్తం వసూలు చేస్తున్నా.... ఎవరికీ పట్టదు. ఎక్కడుందండీ మీ జీవోల ఆచరణ?..ఇలా మీరు ముందుకు వెళితే కలం.. ఇంకా కుదించుకుపోలేదు. అడ్డగోలు నిబంధనలు, షరతులు వదిలేసి పనిచేసే జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు పొందేలా నిబంధనలు సరిచేసి, జర్నలిస్టుల కోసం పునరాలోచించాలని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం కూటమి ప్రభుత్వాన్ని కోరుతోంది.

**మేడవరపు రంగనాయకులు**
వ్యవస్థాపక అధ్యక్షుడు,
తెలుగు జర్నలీస్టుల సంక్షేమ సంఘం



## పాలకులారా ఒకసారి ఆలోచించండి

## అక్రెడిటేషన్ అనేది ప్రభుత్వం జర్నలిస్టులకు ఇవ్వాల్సిన గుర్తింపు

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ నిబంధనల పేరుతో చిన్న పత్రికలపై వివక్ష తగదు

**అమరావతి:**

ఒక ప్రభుత్వ నియంత నిర్ణయాలకు నీళ్ళు ఒదిలి.. పాలన పట్ల అనుభవం, అవగాహనతో కూటమి ప్రభుత్వం ఉంటుందని భావించడం ఎండమావిని చూసి నీరనుకున్నట్లే ఉంది. నాడు తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా ఆ పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులను, ప్రజా ఉద్యమాలను.. ప్రభుత్వ విధానాలను నిక్కచ్చిగా రాసినందుకు ఎందరో జర్నలిస్టులను ఆనాటి వైసిపి హయాంలో ఇబ్బంది పెట్టారు. తీరా కూటమి ప్రభుత్వ వచ్చాక జర్నలిస్టులపై పగపట్టినట్టు అడ్డగోలు ఉత్తర్వులు తెచ్చి వారిని నడిరోడ్డున నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఎన్డీయే అధికారంలోకి రావడానికి ఆనాడు పెద్ద ఎత్తున జరిగిన నిరసనలని.. చంద్రబాబు అరెస్టుని...ఆనాటి కొన్ని హత్యాకాండలని వెలుగులోకి తీసుకురావడమే పాత్రికేయుల నిబద్ధతకు నిదర్శనం. 'ఏరు దాటే వరకూ మల్లన్న ఏరు దాటాకా బోడి మల్లన్న' అన్న సామెతలా ప్రస్తుతం పాత్రికేయులని చాలా సులువుగా విసిరి...ఏరి పారేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అక్రిడిటేషన్లు.. నిజంగా పాత్రికేయులకు బలాన్నో.. బలగాన్నో ..ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడటానికో ఏ మాత్రం పనికి రాదు. కానీ అదేదో పద్మశ్రీ.. ఆస్కార్ అవార్డు ఇచ్చినట్టు తెగ ఫీలయిపోవడం చూస్తుంటే పాలకుల ఇరుకు హృదయాన్ని చూపెడుతోంది.

### అక్రెడిటేషన్ కార్డుకు దూరం చేయడం దారుణం..

వక్ఫ్ ఎలా భూములను తనలో కలుపుకుంటుందో.. సర్వోత్తమ న్యాయస్థానానికి పత్రాలు సమర్పిస్తే ఖాతరు చేయలేదు. పరకామణి కేసులో లోక్ అదాలత్ రాజీ ఎలా కుదుర్చుకుందో చెప్పలేదు.. దాంతో న్యాయ వ్యవస్థ విశ్వసనీయత పెద్ద ప్రశ్నగా మారింది. ఇక పార్లమెంటరీ వ్యవస్థ ఒక ఎంపీని చిత్రవధ చేసినప్పుడు ఐపీఎస్ లు, వెంకన్న ఆస్తులు ఇతర ఏసీబీ దాడుల్లో దొరికిన పెద్దల విషయాల్లో అధికారులు నమ్మకం




కోల్పోతున్నారు. ఇవన్నీ సరికాదన్నట్లు అన్ని వ్యవస్థలని పరిరక్షించే సామాజిక బాధ్యత తీసుకుంటున్న పాత్రికేయ వ్యవవస్థను ఛిన్నాబిన్నం చేయడానికి నేటి టీడీపీ కూటమి ప్రభుత్వం ఇష్టమొచ్చిన జీవోలతో వారి హక్కులను హరిస్తూ చిద్రం చేస్తోంది. ఎప్పుడూ జర్నలిస్టులు ప్రజల...ప్రతిపక్షాల గొంతు వినిపిస్తూనే ఉంటారు. యాజమాన్యాలు పాత్రికేయుల విద్య, వ్యవహారశ్కెలి వారు రాసే వార్తలు, కథనాల ద్వారా పత్రికల్లో అవకాశం ఇస్తుంది. ఫ్రీలాన్స్ జరర్నలిస్టు తనకుండే పరిజ్ఞానంతో వివిధ అంశాలపై ఉన్న అవగాహనతో కథనాలు రాస్తాడు. ఇక అనేక సంవత్సరాల అనుభవం కలిగి ఉన్న వెటరన్ జర్నలిస్టు తను రాసే విషయాలపైనే పరిపూర్ణత సాధించి పత్రికలకు అందిస్తాడు. ఆయా యాజమాన్యాలకు పాత్రికేయుల ఎకడమిక్ ఎడ్యుకేషన్‌తో పనిలేదు. పాత్రికేయులలలో ఉన్న నిబద్ధత.. సౌశీల్యత...కావాలి. కానీ..మీరిచ్చే గుర్తింపు కార్డుకు ..ఎడ్యుకేషన్ కాలమ్ పెట్టి కొంతమంది జర్నలిస్టులను తొలగించే ప్రయత్నం చేయడం, ఎంప్యానెల్ ముసుగు వేసి చిన్న పత్రికలకు, అత్యధిక సంఖ్యలో ఉన్న జర్నలిస్టులను అక్రెడిటేషన్ కార్డుకు దూరం చేయడం దారుణమయిన విషయం. ఏ ఉన్నతాధికారి ఈ బోడి సలహాను ఇచ్చాడో..దానిని గుడ్డెద్దు చేలో పడినట్టు అమలు చేయాలనుకోవడం ఎంత వరకు సమంజసమో ఆత్మవిమర్శ చేసుకోవాలి. పోనీ ప్రభుత్వం ఏమైనా జర్నలిస్టులకు జీతాలు ఇస్తున్నారా? కనీసం వేజ్ బోర్డు అమలుకు జీఓలను చేసి అమలుపర్చారా? కనీసం సంక్షేమానికో... రుణానికో కృషిచేసే విధంగా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అడిగినట్లు మీడియా కార్పొరేషన్ ఏమైనా పెట్టారా...? ఉన్న రైలు పాస్‌ల రాయితీని కరోనాతో పాటు కాటేశారే! కేంద్రం మీకు అనుకూలంగా ఉన్నప్పుడు కూడా వాటిని పునరుద్ధరించే చర్యలు తీసుకోలేదే! చిన్న పత్రికలకు రాయితి తో ఊడిన న్యూస్ ప్రింట్ కాగితాన్ని అందించగలుగుతున్నారా? ప్రభుత్వ ప్రకటనలు రోష్టర్ పద్ధతిలో విడుదల చేయగలరా?.. ఏమి సాధించామని ఇంత మిడిసిపాటు అని ప్రశ్నిస్తే మీ తలలు ఎక్కడ పెట్టుకుంటారు?.. ఇక సమాచార శాఖ ఉన్నతాధికారులు...సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంత బలమైనదో తెలిసీ కూడా పాలకవర్గ రాజకీయాలకు తలలూపి లేనిపోని విధి విధానాలను తయారుచేసి 'బాస్' ల దగ్గర మొప్పుపొందుతుంటారు. ఏదో ఊడబొడుస్తామని చెప్పి 'అంత ఉరుము ఉరిమి ఇంతేనా కురిసింది' అన్నట్టు పాత్రికేయుల గుర్తింపును ఎలా తగ్గించాలి...అనే ఆలోచనలోనే ఉన్నారు. మీరిచ్చే గుర్తింపు కార్డు ఎంత వరకు ప్రయోజకారిగా ఉంటుందో అందరికీ తెలిసిందే.

### కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కాదా!

ప్రపంచమేధావుల్లా ఉచిత సలహాలు... ఇచ్చి అసంబద్ధ విధానాలతో ప్రభుత్వ మెప్పుపొందేందుకు తైతక్కలాడటం కొందరు ఉన్నతాధికారులకు పరిపాటి అయిపోయింది. ప్రక్క రాష్ట్రాలనుంచి మన రాష్ట్రంలో సర్కులేట్ అవుతున్న పలు మీడియా సంస్థలకి పనిచేసే ఇక్కడి పాత్రికేయులకు రాష్ట్రస్థాయి అక్రిడేషన్లు మంజూరు చేస్తూ ఇక్కడ ప్రచురితమవుతున్న పత్రికలకు గండికొట్టడంలో ఆంతర్యం...కార్పరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కాదా!.. ముందుపేజీలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర ప్రధాన వార్తలు రాస్తున్నారుగా.. ఆమాత్రం గమనించలేరా? రాజకీయ నాయకులు, ప్రజల సమస్యలను ప్రచురితం చేసే సత్తాగల స్థానిక పత్రికలపై ఎందుకు శీతకన్ను? పాత్రికేయుల మధ్య చిన్నా, పెద్దా, అంటూ వివక్షతలు ఎందుకుపెడుతున్నారు ? పత్రికలలో ప్రకటనలు పొందేందుకు అర్హత కోసం నిర్దేశించిన ఎంప్యానెల్‌మెంట్ నిబంధన స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా పనిచేసే పాత్రికేయులకు ఎందుకు ముడిపెడుతున్నారు? మీరు ఎక్కిన అందలానికి మొదట్నించి నిచ్చెనలా పనిచేసింది పాత్రికేయులు కాదా!....పనిచేసే పాత్రికేయుడుకి మీరు వేతనాలు ఇవ్వరుకదా! యాజమాన్యాలు అర్హత.. వారి నైపుణ్యతబట్టి ఉద్యోగాలు ఇస్తుంటే..మీరు జీతాలు చెల్లించినట్టు మధ్యలో ఎందుకలా ఫీల్ అవుతున్నారు. ఎలాగూ సమాచార శాఖ కమీషనర్ మీరిచ్చిన సలహాలు..సూచనలకు మేరకే పనిచేస్తారు. అందుకే తమ నిస్సాహయతను చెబుతూ పాత్రికేయులకు కనీసం కలిసే అవకాశం ఇవ్వటం లేదు. ఏ కృష్ణుడో మరలా అవతరించి భగవద్గీతలా పరిస్థితి బోధిస్తేకానీ మంత్రి పార్థుడికి అర్థం అవదు. నలుగురు ఒక్కసారి ఆలోచించి పాత్రికేయుల శ్రేయస్సుకోరితే... భవిష్యత్‌లో వారు పాలనాపర సమస్యలని అవగాహన చేసుకుని ప్రజలకు మంచి వార్తలు అందించే పరిస్థితి ఉంటుంది. లేదంటే తెలుగు జర్నలిస్టుల అసంతృప్తి ఏదశకు చురుతుందో తెలియదు కదా!

# ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్‌గా కేఎల్ రాహుల్!



ఐపీఎల్ అంటేనే సంచలనాలకు మారుపేరు. ముఖ్యంగా ఆటగాళ్ల బదిలీలు, కెప్టెన్ల మార్పులు నెటిజన్లలో ఎప్పుడూ ఆసక్తిని రేకెత్తిస్తాయి. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ కూడా రాబోయే 2026 సీజన్ కోసం ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతేడాది కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్ పటేల్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, సీనియర్ ప్లేయర్ కేఎల్ రాహుల్‌ను కొత్త సారథిగా నియమించేందుకు యాజమాన్యం మొగ్గు చూపుతోంది. గత 2025 సీజన్‌లో రిషబ్ పంత్ స్థానంలో అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. అయితే, ఫ్రాంచైజీ ఆశించిన స్థాయిలో జట్టు ఫలితాలు రాలేదు. దీంతో పాటు, కేఎల్ రాహుల్ వంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటంతో, ఆయన నాయకత్వంలో జట్టును మరింత బలోపేతం చేయాలని ఢిల్లీ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. గతంలో పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఉండటం అతనికి కలిసొచ్చే అంశం.కేఎల్ రాహుల్‌ను మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. వాస్తవానికి 2025 సీజన్ లోనే అతనికి కెప్టెన్సీ దక్కుతుందని భావించినప్పటికీ, అప్పట్లో వ్యక్తిగత కారణాల వల్ల లేదా యాజమాన్యం వ్యూహం వల్ల అక్షర్‌ను ఎంపిక చేశారు. అయితే, తాజా రిపోర్ట్స్ ప్రకారం, రాహుల్ కూడా కెప్టెన్సీ చేపట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.అక్షర్ పటేల్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో అత్యంత కీలకమైన ఆటగాడు. గత ఐదు ఆరు ఏళ్లుగా అతను జట్టుకు ప్రధాన బలంగా ఉన్నాడు. కెప్టెన్సీ నుంచి తప్పించినప్పటికీ, ఒక కీలక ప్లేయర్‌గా అతను జట్టులోనే కొనసాగనున్నాడు. కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా అక్షర్ కేవలం తన ఆల్‌రౌండ్ ప్రదర్శనపై దృష్టి పెడితే జట్టుకు మరింత ప్రయోజనం ఉంటుందని కోచింగ్ స్టాఫ్ భావిస్తున్నట్లు టాక్. ఈ వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. కేఎల్ రాహుల్ కెప్టెన్సీ పట్ల కొందరు హర్షం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం అక్షర్ పటేల్‌కు మరికొంత కాలం అవకాశం ఇవ్వాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా, ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా ఈ విషయంపై స్పందించాల్సి ఉంది. మరికొద్ది రోజుల్లోనే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ తన తొలి ఐపీఎల్ టైటిల్ కల నెరవేర్చుకోవడానికి చేస్తున్న ఈ మార్పులు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి!

# కేకేఆర్ పెట్టిన ప్రతి పైసాకు న్యాయం చేసిన ముస్తఫిజుర్..




ఐపీఎల్ 2026 వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ ధర వెచ్చించి కొనుగోలు చేసిన బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తఫిజుర్ రెహమాన్ తన సత్తా ఏంటో మరోసారి నిరూపించుకున్నాడు. డిసెంబర్ 16న జరిగిన వేలంలో ఊహించని రేటు దక్కించుకున్న ఈ కట్టర్ మాస్టర్, సరిగ్గా ఐదు రోజుల తర్వాత (డిసెంబర్ 21న) మైదానంలో నిప్పులు చెరిగే బంతులతో చెలరేగిపోయాడు. యూఏఈ వేదికగా జరుగుతున్న ఐఎల్టీ20 టోర్నీలో దుబాయ్ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న ముస్తఫిజుర్, కేవలం 23 బంతుల్లోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసి తన జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ముస్తఫిజుర్ తన బేస్ ప్రైస్‌ను రూ. 2 కోట్లుగా నిర్ణయించుకోగా, వేలంలో కేకేఆర్ అతడిని ఏకంగా రూ.9.20 కోట్లకు దక్కించుకుంది. అంటే తను ఆశించిన దానికంటే దాదాపు 5 రెట్లు ఎక్కువ ధర లభించింది. ఈ భారీ ధరపై కొందరు విమర్శలు చేసినప్పటికీ, అబుదాబిలో గల్ఫ్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముస్తఫిజుర్ తన స్పెల్‌తో వారందరికీ సమాధానం చెప్పాడు. 3.5 ఓవర్లలో (23 బంతులు) కేవలం 34 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా గల్ఫ్ జెయింట్స్ కెప్టెన్ జేమ్స్ విన్స్, అజ్మతుల్లా ఒమర్జాయ్ వంటి సెట్ అయిన బ్యాటర్లను అవుట్ చేసి ప్రత్యర్థిని 156 పరుగులకే కట్టడి చేశాడు. ఈ మ్యాచ్‌లో దుబాయ్ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించగా, ముస్తఫిజుర్ తన అద్భుత ప్రదర్శనకు గానూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. ముస్తఫిజుర్ వేసే స్లోయర్ కట్టర్లు, డెత్ ఓవర్లలో వేరియేషన్లే అతడికి ఇంతటి డిమాండ్ తెచ్చిపెట్టాయి. వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ (%జూఖ%) కూడా ఇతడి కోసం గట్టిగా పోటీ పడినప్పటికీ, కేకేఆర్ పట్టుబట్టి మరీ భారీ ధర చెల్లించి సొంతం చేసుకుంది. ఐపీఎల్ ప్రారంభానికి ముందే ముస్తఫిజుర్ ఇలాంటి భీభత్సమైన ఫామ్‌లో ఉండటం కేకేఆర్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# రిటైర్మెంట్‌పై రోహిత్‌శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత మాజీ కెప్టెన్, ప్రపంచ నంబర్ 1 వన్డే బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ తన విమర్శకులకు తగిన సమాధానం ఇస్తూ బలమైన పునరాగమనం చేశాడు. 38 ఏళ్ల ముంబై క్రికెటర్ 2025లో భారతదేశం తరపున 14 వన్డేలు ఆడాడు, రెండు సెంచరీలు మరియు నాలుగు అర్ధ సెంచరీల సహాయంతో మొత్తం 650 పరుగులు చేశాడు. అక్టోబర్ 2025లో ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అతని అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన తర్వాత, అతను ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా కూడా ఎంపికయ్యాడు, రోహిత్ మొదటిసారి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు, అతని అంతర్జాతీయ కెరీర్ గురించి చాలా ప్రశ్నలు ఉన్నాయి. అతన్ని భారత వన్డే కెప్టెన్సీ నుండి తొలగించారు, ఇది రిటైర్మెంట్ గురించి ఊహాగానాలకు దారితీసింది. అయితే, రోహిత్ శర్మ తన చివరి సిరీస్‌లో ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజయపథంలో నడిపించాడు. అనేక విదేశీ పర్యటనలలో పరుగులు సాధించడంలో విఫలమైన తర్వాత, రోహిత్ శర్మ గురించి అన్ని వైపుల నుండి ప్రశ్నలు తలెత్తాయి. అతను మొదట ఆస్ట్రేలియాలో పరుగులు చేశాడు మరియు తరువాత దక్షిణాఫ్రికాతో జరిగిన స్వదేశీ సిరీస్‌లో రెండు అర్ధ సెంచరీలు సాధించి తన ఫామ్‌ను కొనసాగించాడు. ఈ వారం విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరపున రోహిత్ ఆడుతున్నట్లు కనిపిస్తుంది.ఆదివారం (డిసెంబర్ 21), అతను గురుగ్రామ్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యాడు, అక్కడ అతను అంతర్జాతీయ క్రికెట్‌లో తన భవిష్యత్తు గురించి ఒక ముఖ్యమైన అప్‌డేట్ ఇచ్చాడు. రోహిత్ ప్రకారం, అతను వీలైనంత వరకు అగ్రస్థానంలో ఉండాలనుకుంటున్నాడు. అతను ఇలా అన్నాడు, "నా జీవితం కూడా అలాగే ఉండేదిబీ దీన్ని ప్రారంభించడం చాలా కష్టం. కానీ నేను విమానం ఎక్కిన తర్వాత, అది చేరుకున్న ఎత్తు ఇంకా తగ్గలేదు. అదే ముఖ్యమని నేను అనుకుంటున్నాను మరియు ఆ విమానం ఇంత త్వరగా ల్యాండ్ అవ్వాలని నేను కోరుకోవడం లేదు. నేను పైభాగంలో ఉండాలనుకుంటున్నాను." రోహిత్ ఇలా కొనసాగించాడు, "మనందరికీ తెలుసు, అందరూ ప్రయాణించారని నాకు ఖచ్చితంగా తెలుసు. అందుకే నేను విమానం ఉదాహరణను ఉపయోగించాను. విమానం 35,000-40,000 అడుగుల ఎత్తుకు చేరుకున్నప్పుడు, అది బాగా మరియు విశ్రాంతిగా అనిపిస్తుంది, మేము తింటాము మరియు నిద్రపోతాము. అదే జీవితం." మీరు వేగాన్ని పుంజుకున్న తర్వాత, అక్కడే ఉండటం ముఖ్యం, ఆపై ల్యాండింగ్ కూడా ముఖ్యం, కానీ మీరు ఎప్పుడు ల్యాండ్ కావాలనుకుంటున్నారో అది మీపై ఆధారపడి ఉంటుంది.

# విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి శుభ్‌మన్ గిల్



2026 టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొననున్న 15మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ ఇటీవల ప్రకటించింది. అయితే ఈ జట్టులో టీమ్ఇండియా వైట్‌బాల్ ఫార్మాట్ రెగ్యులర్ వైస్‌కెప్టెన్ శుభ్?మన్ గిల్‌కు చోటు దక్కలేదు. ఇక వరల్డ్‌కప్ కోసం ప్రకటించిన జట్టుతోనే టీమ్ఇండియా 2026 జనవరి నెలలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆడనుంది. ఈ క్రమంలో గిల్ ఆటను చాలా రోజుల దాకా చూడడం కుదరదేమోనని అభిమానులు ఆందోళన చెందుతున్న వేళ అతడి ఫ్యాన్స్‌కు కిక్కిచ్చే న్యూస్. గిల్ మరో రెండు రోజుల్లోనే బరిలో దిగనున్నాడు.భారత క్రికెటర్లు జాతీయ జట్టుకు ఆడని సమయంలో దేశవాళీలో ఏదైనా జట్టుకు ప్రాతినిధ్యం వహించాల్సిందేనని బీసీసీఐ ఇప్పటికే నిబంధన తీసుకొచ్చింది. దీంతో టీమ్ఇండియాకు ఆడని సమయంలో ప్లేయర్లు డొమెస్టిక్ క్రికెట్?లో బరిలోకి దిగుతున్నారు. ఈ క్రమంలోనే గిల్ కూడా 2025-26 విజయ్ హజారే ట్రోఫీలో బరిలో దిగేందుకు సిద్ధమయ్యాడు. అతడు పంజాబ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ మేరకు పంజాబ్ రీసెంట్‌గా ప్రకటించిన జట్టులో గిల్‌కు చోటు దక్కింది. టీమ్ఇండియా తన తదుపరి వన్డే సిరీస్‌ను వచ్చే నెల 11న ఆడనుంది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్ ఉండనుంది. అయితే ఈ సిరీస్ కంటే మూడు రోజుల ముందే (జనవరి 08) లీగ్ మ్యాచ్‌లు ముగుస్తాయి. దీంతో టీమ్ఇండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా ఈ టోర్నీలో ఆడనున్నారు. రోహిత్ ముంబయికి ప్రాతినిధ్యం వహించనుండగా, విరాట్ దిల్లీ జట్టుకు ఆడనున్నాడు. వీళ్లతోపాటు దాదాపు భారత క్రికెటర్లంతా ఈ టోర్నీలో పాల్గొనే ఛాన్స్ ఉంది.2026 జనవరి 11న న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. అయితే టీ20లకు ఎంపికకాకపోయినా, వన్డే సిరీస్‌కు మాత్రం టీమ్ఇండియాకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనున్నాడు. ఈ సిరీస్‌లో కివీస్‌తో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్? ఆడనుంది.

**పంజాబ్ విజయ్ హజారే ట్రోఫీ జట్టు:**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), హర్నూర్ పన్ను, అన్‌మోల్‌ప్రీత్ సింగ్, ఉదయ్ సహారన్, నమన్ ధీర్, సలీల్ అరోరా (వికెట్ కీపర్), సన్వీర్ సింగ్, రమణదీప్ సింగ్,



# టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన లేడీ కోహ్లీ స్మృతి మంధాన

టీమిండియా మహిళల జట్టు అదరగొట్టింది. వన్డే ప్రపంచ కప్ విజయం సాధించిన నెల రోజుల విరామం తరువాత.. గ్రౌండ్‌లోకి అడుగుపెట్టిన భారత మహిళా క్రికెటర్లు మరోసారి అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ క్రమంలో టీమిండియా క్రికెట్ క్వీన్, లేడీ కోహ్లీ స్మృతి మంధాన సరికొత్త చరిత్ర సృష్టించింది. శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్టణం వేదికగా ఆదివారం తొలి టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టారు. ఫలితంగా స్వల్ప లక్ష్యాన్ని మరో 32 బంతులు మిగిలి ఉండగానే ఛేధించి 8 వికెట్ల తేడాతో విజయం సాధించారు. తద్వారా సిరీస్‌లో బోణీ కొట్టారు. విశాఖ వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక బ్యాటింగ్ చేసింది. నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన షఫాలీ వర్మ (9) మరుసటి ఓవర్‌లో ఔట్ అయింది. ఆ తరువాత స్మృతి మంధాన, జెమీమా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ఈ క్రమంలో స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. స్మృతి మంధాన మహిళల టీ20 క్రికెట్లో 4వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అదే సమయంలో మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్లో రెండో బ్యాటర్‌గా నిలిచింది. స్మృతి కంటే ముందు న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ ఈ ఘనత సాధించింది. సుజీ బేట్స్ ఇప్పటి వరకు 177 మ్యాచ్‌లలో 4,716 పరుగులు చేసింది. ప్రస్తుతం స్మృతి మంధాన 154 మ్యాచ్‌లలో 4007 పరుగులు చేసింది. ఇక మూడవ స్థానంలో హర్మన్‌ప్రీత్ కౌర్ ఉంది. ఆమె 183 మ్యాచ్‌లలో 3,669 పరుగులు చేసింది.

# జాకబ్ డఫీ అదిరే ప్రదర్శన

## సర్ రిచర్డ్ హాడ్లీ 40 ఏళ్ల రికార్డ్ బ్రేక్

## వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ గ్రాండ్ విక్టరీ



2026 ఐపీఎల్ మినీ వేలంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అమ్ముడైన న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ తాజాగా వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో అదిరే ప్రదర్శన చేశాడు. తాజాగా ముగిసిన మూడో టెస్టులోనూ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు దక్కించుకున్నాడు. దీంతో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 15.43 యావరేజ్‌తో ఏకంగా 23 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ఇందులో మూడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. దీంతో డఫీకి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. ఈ క్రమంలోనే అతడు 40ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. తాజా సిరీస్‌తో కలిపి ఈ ఏడాది డఫీ మొత్తం 39 ఇన్నింగ్స్‌ల్లో 17.11 యావరేజ్‌తో 81 వికెట్లు నేలకూల్చాడు. దీంతో న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సర్ రిచర్డ్ హాడ్లీ 40ఏళ్ల రికార్డును డఫీ బద్దలు కొట్టాడు. ఈ క్రమంలోనే ఓ క్యాలెండర్ ఇయర్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు నేలకూల్చిన కివీస్ బౌలర్‌గా డఫీ రికార్డు సృష్టించాడు. రిచర్డ్ హాడ్లీ 1985వ సంవత్సరంలో 29 ఇన్నింగ్స్‌లో 79 వికెట్లు తీసి ఈ రికార్డ్ నెలకొల్పాడు. గత 40ఏళ్లుగా ఈ రికార్డ్ హాడ్లీ పేరిటే ఉంది. అయితే ఈ మ్యాచ్‌తో డఫీ ఆ రికార్డ్‌ను అధిగమించాడు. ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో ఆర్సీబీ జాకబ్ డఫీని కొనుగోలు చేసింది. అతడిని ఆర్సీబీ ఫ్రాంచైజీ రూ.2 కోట్ల బేస్‌ప్రైజ్‌కు దక్కించుకుంది. ఇక తాజా సిరీస్‌లో అతడు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న డఫీని ఆర్సీబీ కూడా తొలి మ్యాచ్ నుంచే బరిలోకి దించే అవకాశం ఉంది. ఇదే రేంజ్?లో ఐపీఎల్‌లోనూ వికెట్లు పడగొడితే డఫీకి వరల్డ్ క్రికెట్‌లో మరింత క్రేజ్ రావడం పక్కా! అయితే ఈ మ్యాచ్‌లో కివీల్ ఓపెనర్లు టామ్ లేథమ్, డేవన్ కాన్వే అదిరే ప్రదర్శన చేశారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఈ ఇద్దరూ రెండేసి సెంచరీలతో మోత మోగించారు. దీంతో టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు ఇన్నింగ్స్‌లలో రెండేసి సెంచరీలు సాధించిన మొదటి ఓపెనింగ్ జోడీగా కాన్వే కాన్వే- టామ్ లేథమ్ చరిత్ర సృష్టించారు. ఈ మ్యాచ్‌లో కాన్వే వరుసగా 227 పరుగులు, 100 పరుగులు చేయగా, టామ్ లేథమ్ 137 పరుగులు, 101 పరుగులు నమోదు చేశాడు.కాగా, సొంగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌ను న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. తాజాగా జరిగిన మూడో టెస్టులో విండీస్?పై కివీస్ 323 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. దీంతో 2-0 తేడాతో సిరీస్‌ను దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో టామ్ లాథమ్, డేవన్ కాన్వే సెంచరీలతో రాణించగా, డఫీ బౌలింగ్‌లో అదిరే ప్రదర్శన చేయడం వల్ల కివీస్ భారీ విక్టరీ కొట్టింది.తాజా సిరీస్?విజయంతో 2027 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ రెండో స్థానానికి చేరుకుంది. ఈ సైకిల్?లో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడిన కివీస్ రెండింట్లో విజయం సాధించింది. ఒక టెస్టు డ్రా చేసుకుంది. దీంతో 77.78 పాయింట్ పర్సెంటేజీతో రెండో స్థానంలో కొనసాగుతోంది. టాప్‌లో ఆస్ట్రేలియా ఆరు మ్యాచ్‌లకు ఆరు విజయాలతో 100శాతం పాయింట్ పర్సెంటేజీతో ఉంది. ఈ పట్టికలో భారత్ 48.15 పాయింట్ పర్సెంటేజీతో ఆరో స్థానంలో కొనసాగుతోంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక


# నార్త్‌లో అఖండ-2 విడుదల

## హిందీ ఆడియన్స్ స్పందన అంతంత మాత్రమే




టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నటసింహం నందమూరి బాలకృష్ణకు తెలుగులో ఉన్న స్టార్‌డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆరు పదుల వయసులోనూ తమదైన శైలితో ప్రేక్షకులను మెప్పిస్తూ, యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తూ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. తెలుగులో వీరిద్దరికీ అశేషమైన అభిమాన గణం ఉండటంతో పాటు భారీ మార్కెట్ కూడా ఉంది. అయితే నార్త్ మార్కెట్ విషయానికి వస్తే చిరంజీవి, బాలకృష్ణలకు ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కడం లేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి స్వాతంత్ర్య పోరాట యోధుడి కథతో తెరకెక్కిన 'సైరా నరసింహ రెడ్డి' సినిమాతో నార్త్ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారు. భారీ బ్జడెట్, పాన్ ఇండియా రిలీజ్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటించడం వంటి అంశాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కానీ హిందీలో పెద్ద ఎత్తున రిలీజ్ చేసినప్పటికీ, సినిమా ఆశించిన స్థాయి-ంలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వసూళ్లు పరిమితంగానే నమోదయ్యాయి. ఆ తర్వాత మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' రీమేక్‌గా తెరకెక్కిన 'గాడ్ ఫాదర్' తో మరోసారి చిరంజీవి నార్త్ మార్కెట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించారు. రాజకీయ నేపథ్యం, పవర్‌ఫుల్ పాత్ర ఉన్నప్పటికీ ఈ సినిమా కూడా హిందీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇదే సమయంలో నటసింహం బాలకృష్ణ కెరీర్‌లో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'అఖండ' సినిమాతో నార్త్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనే కాదు, హిందీ డబ్బింగ్ వెర్షన్‌కి కూడా యూట్యూబ్, టీవీ ప్రసారాల ద్వారా మంచి ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో 'అఖండ 2: తాండవం' పై హిందీలో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సీక్వెల్ నార్త్ మార్కెట్‌లో క్లిక్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ రిలీజ్ తర్వాత పరిస్థితి భిన్నంగా మారింది. హిందీ వెర్షన్‌కు థియేటర్లలో స్పందన నెమ్మదిగా ఉండటంతో వసూళ్లు నిరాశపరిచినట్లు సమాచారం. ఇప్పటివరకు కలెక్షన్లు కోటి రూపాయల మార్క్‌ను కూడా దాటలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో చిరంజీవి హిందీ సినిమాల కంటే బాలకృష్ణ సినిమా మరింత తక్కువ వసూళ్లు సాధించిందన్న చర్చ మొదలైంది. బాలీవుడ్ మార్కెట్‌లో 'అఖండ 2' విషయంలో అంచనాలు ఒకలా, ఫలితాలు మరోలా వచ్చాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజులలో అయిన వీరు అనుకున్నది సాధిస్తారా అన్నది చూడాలి.







# అనిల్ రావిపూడి అదుర్స్

## ఏఐతో ప్రచార వీడియో వైరల్



సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవర ప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది. నెట్టింట ఈ వీడియోకు భారీ స్పందన వస్తుండగా, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్టాటజ్రీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, 2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి, 2026 సంక్రాంతికి కూడా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలనే ఎ÷-లాన్‌లో ఉన్నారు. అందులో భాగంగానే మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' తో సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. అలాగే వెంకీ మామ (వెంకటేష్) ఈ మూవీలో తొలిసారి చిరంజీవితో కలిసి గెస్ట్ రోల్‌లో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



# రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం

## మరోమారు విడుదలైన పడియప్ప

## థియేటర్‌కు వెళ్లి చూసి థ్రిల్ అయిన రమ్యకృష్ణ




తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే ఎవర్ గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'పడయప్ప' తెలుగులో 'నరసింహ'మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 12న థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది. రజనీకాంత్ సరసన సౌందర్య, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ముఖ్యంగా నీలాంబరి పాత్ర సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాత్రకు ప్రాణం పోసిన రమ్యకృష్ణ నటన ఇప్పటికీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. రీ రిలీజ్ సందర్భంగా తాజాగా రమ్యకృష్ణ స్వయంగా థియేటర్లో 'పడయప్ప'ను వీక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ 'ఫస్ట్ టైమ్ 'పడయప్ప' మూవీని థియేటర్లో చూశాను' అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రజనీకాంత్ ? రమ్యకృష్ణ మధ్య వచ్చే సీన్స్ ఇప్పటికీ అభిమానులకు ప్రత్యేకం. ముఖ్యంగా నీలాంబరి అజ్ఞాతవాసం ముగించుకుని, చాలా ఏళ్ల తర్వాత 'నరసింహ'ను ఎదుర్కొనే సీన్ సినీ చరిత్రలోనే ఐకానిక్‌గా నిలిచింది. డైలాగ్స్, బీజీఎం, ఇద్దరి నటన థియేటర్లో మరోసారి గూస్‌బంప్స్ తెప్పించాయి. ఆ సీన్ వచ్చిన సమయంలో థియేటర్లో ఫ్యాన్స్‌తో కలిసి రమ్యకృష్ణ కూడా ఆ క్షణాలను ఆస్వాదించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతూ, 'నీలాంబరి ఇస్ నాట్ జస్ట్ ఎ క్యారెక్టర్? ఇట్'స్ ఎ లెజెండ్' అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. రీ రిలీజ్ అయినప్పటికీ 'పడయప్ప'కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే? ఈ సినిమా నిజంగా క్లాసిక్ అని మరోసారి నిరూపితమవుతోంది.

# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల




కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.

# సమంతకూ తప్పని అభిమానుల తాకిడి



అభిమానుల అత్యుత్సాహం వల్ల 'ది రాజాసాబ్' ఈవెంట్‌లో నిధి అగర్వాల్ ఇబ్బంది పడిన సంఘటన మరువక ముందే సమంతకు కూడా అలాంటి చేదు అనుభవమే ఎదురైంది. తాజాగా హైదరాబాద్‌లో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె తిరిగి తన కారు వద్దకు వెళ్తుండగా అభిమానులు ఒక్కసారిగా సెల్ఫీల కోసం ఎగబడ్డారు. దీంతో సమంత ఇబ్బంది పడ్డారు. బాడీగార్డ్‌లు ఆమెను జాగ్రత్తగా కారు ఎక్కించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా నెటిజన్లు అభిమానుల తీరును తప్పుపడుతున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861